


సమాజ హితం – మా అభిమతం

www.arunaprabha.com

# అరుణ ప్రభ

ARUNAPRABHA TELUGU DAILY

తెలుగు దినపత్రిక

RNI NO. TEL TEL/2023/89778




రంగారెడ్డి - హైదరాబాద్ సంపుటి : 04 సంచిక : 198 పేజీలు : 12, వెల రూ. 5/- బుధవారం, సెప్టెంబరు 9, 2026

PUBLISHED FROM RANGAREDDY, HYDERABAD. CIRCULATED BY : RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD, CHITTOOR, VISAKHAPATNAM, SRIKAKULAM, ELURU, ONGOLE, VIJAYAWADA, SPSR NELLORE, PRAKASHAM, GUNTUR, KURNOOL, KADAPA

# ఎర్రవల్లిలో ఉద్రిక్తత

## ఎమ్మెల్సీల సస్పెన్షన్‌తో రాజకీయ వేడి

## స్పీకర్‌పై వ్యాఖ్యల దుమారం.. భారాస నేతలపై పోలీసుల చర్యలు

## కేటీఆర్, హరీశ్‌రావు సహా నేతల అడ్డగింత.. పలువురికి గాయాలు



హైదరాబాద్ సెప్టెంబర్ 8: తెలంగాణ శాసనసభ, శాసనమండలి సమావేశాల రెండో రోజైన మంగళవారం కూడా రాష్ట్రంలో రాజకీయ ఉద్రిక్తత కొనసాగింది. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై భారాస ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యలు, పోలీసులపై మరో ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి వ్యవహరించిన తీరుపై వివాదం మరింత ముదిరింది. ఇరువురు ఎమ్మెల్సీలపై చర్యలు తీసుకోవాలని శాసనసభ తీర్మానం చేసి శాసనమండలికి పంపగా, మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి వారిని సమావేశాలు ముగిసే వరకు సస్పెండ్ చేశారు. ఇదే సమయంలో ఎర్రవల్లిలోని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఫాంహౌస్ వద్ద కాంగ్రెస్, భారాస శ్రేణుల మధ్య ఉద్రిక్తత చోటుచేసుకుంది. డప్పులతో నిరసనకు వచ్చిన దళిత సంఘాల కార్యకర్తలను భారాస శ్రేణులు అడ్డుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఇరువర్గాల మధ్య తోపులాటలు, ఘర్షణలు చోటుచేసుకోగా పలువురికి గాయాలయ్యాయి. పరిస్థితిని అదుపులోకి తీసుకునేందుకు పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేసి పలువురిని అదుపులోకి తీసుకున్నారు. సోమవారం అసెంబ్లీ సమావేశాల అనంతరం చోటుచేసుకున్న పరిణామాలపై స్పీకర్ ఓఎస్డీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డిపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంలోని నిబంధనలను కూడా కేసులో చేర్చారు. మంగళవారం ఉదయం ఇద్దరు ఎమ్మెల్సీలను వారి నివాసాల వద్ద పోలీసులు అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరుపరిచారు. ఇరువురిని రిమాండుకు పంపించాలని పోలీసులు కోరినప్పటికీ న్యాయస్థానం అందుకు నిరాకరించింది. అనంతరం పూచీకత్తుపై వారిద్దరూ విడుదలయ్యారు. ఈ పరిణామాలతో ఉదయం నుంచే రాజకీయ వాతావరణం వేడెక్కింది. శాసనసభ ఉదయం ప్రారంభమైన వెంటనే భారాస ఎమ్మెల్యేలు నల్లబ్యాడ్జీలు ధరించి సభకు హాజరయ్యారు. తమ మహిళా ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిల పట్ల పోలీసులు అనుచితంగా వ్యవహరించినా ప్రభుత్వం చర్యలు తీసుకోలేదని భారాస శాసనసభాపక్ష ఉపనేత టి.హరీశ్‌రావు ఆరోపించారు. ఈ అంశంపై హరీశ్‌రావు మాట్లాడుతుండగా స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అడ్డుకున్నారు. మహిళా సభ్యుల పట్ల

(మిగతా 2వ పేజీలో)



# మండలిలో హైటెన్షన్

## ఎమ్మెల్సీ తాతా మధును లాక్కెళ్లిన మార్షల్స్

**శాసనమండలి ప్రాంగణంలో తీవ్ర ఉద్రిక్తత**

**మీడియా పాయింట్ వద్ద ఎమ్మెల్సీ తాతా మధును అడ్డుకున్న మార్షల్స్**

**వెళ్లేందుకు నిరాకరించడంతో బలవంతంగా ఎత్తుకెళ్లి బయటకు తరలింపు**

**స్పీకర్‌పై వ్యాఖ్యల నేపథ్యంలో ఆయనపై చర్యలు తీసుకున్న అధికారులు**

హైదరాబాద్ : తెలంగాణ శాసన మండలి ప్రాంగణంలో మంగళవారం తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధును మార్షల్స్ బలవంతంగా ప్రాంగణం వెలుపలికి తరలించారు. ఈ ఘటనతో అక్కడ ఒక్కసారిగా గందరగోళ పరిస్థితి నెలకొంది. మండలి ప్రాంగణంలోని మీడియా పాయింట్ వద్ద మాట్లాడేందుకు ఎమ్మెల్సీ తాతా మధు ప్రయత్నించారు. అయితే, ఆయనపై ఇప్పటికే సస్పెన్షన్ వేటు పడినందున, మండలి ఆవరణలో మాట్లాడేందుకు అనుమతి లేదని అధికారులు స్పష్టం చేశారు. వెంటనే అక్కడి నుంచి వెళ్లిపోవాలని ఆయనకు సూచించారు. అయినప్పటికీ,

(మిగతా 2వ పేజీలో)



**మంత్రుల శాఖలను సమూలంగా మార్చాలని అధిష్ఠానానికి చెప్పా: మహేశ్ గౌడ్**

కేబినెట్ విస్తరణ ఊహాగానాలపై మహేశ్ గౌడ్ స్పందన

పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా కేబినెట్ పునర్‌వ్యవస్థీకరణపై సూచనలు చేశానని వెల్లడి

తనకు మంత్రి పదవి ఇవ్వడం అధిష్ఠానం నిర్ణయమన్న మహేశ్ గౌడ్



**తాతా మధుపై చర్యలు తీసుకునే అధికారం ఉంది కానీ: స్పీకర్ గడ్డం ప్రసాద్**

బీఆర్ఎస్‌లా సస్పెన్షన్ల సంస్కృతి తమది కాదని స్పష్టీకరణ

ఈ వ్యవహారంలో కేసీఆర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్



**రీల్స్ చూస్తుండగా సిగ్నల్ కట్..**

**మనస్తాపంతో మహిళ ఆత్మహత్య!**

ఛత్తీస్‌గఢ్ కోర్బా జిల్లాలో ఘటన.. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి

## హైదరాబాద్‌కు అంతర్జాతీయ ఖ్యాతి: భారత్‌లో తొలిసారిగా గ్లోబల్ రియల్ ఎస్టేట్ సదస్సు

భారత్‌లో తొలిసారిగా అంతర్జాతీయ రియల్ ఎస్టేట్ సదస్సు

హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో సెప్టెంబర్ 25 నుంచి 27 వరకు ఈవెంట్

హాజరుకానున్న 35 దేశాలకు చెందిన 1500 మందికి పైగా ప్రతినిధులు

ఏఐ, ప్రాప్‌టెక్, అంతర్జాతీయ పెట్టుబడులపై ప్రధానంగా చర్చ

భారత రియల్ రంగం ప్రపంచ స్థాయికి చేరిందన్న నిర్వాహకులు





## తిరునల్వేలి గ్యాంగ్‌రేప్ కేసులో దోషికి ఉరిశిక్ష

**తిరునల్వేలి గ్యాంగ్‌రేప్ కేసులో పోక్సో కోర్టు సంచలన తీర్పు**

**మరో ఇద్దరికి 20 ఏళ్లు, 13 ఏళ్ల జైలుశిక్ష**

**2022లో మైనర్‌పై పెళ్లి పేరుతో అత్యాచారానికి పాల్పడిన నిందితులు**

మైనర్‌పై సామూహిక అత్యాచారానికి పాల్పడిన కేసులో తమిళనాడులోని తిరునల్వేలి పోక్సో ప్రత్యేక కోర్టు సంచలన తీర్పు

(మిగతా 2వ పేజీలో)

# కేటీఆర్, హరీశ్‌రావు అరెస్ట్

**కేసీఆర్‌ను కలిసేందుకు అసెంబ్లీ నుంచి బయలుదేరిన బీఆర్ఎస్ నేతలు**

**మేడ్చల్ వద్ద అడ్డుకున్న పోలీసులు**

**రోడ్డుపైనే నిరసనకు దిగిన కేటీఆర్, హరీశ**

ఎర్రవెల్లి : ఎర్రవెల్లిలోని ఫామ్‌హౌస్‌లో ఉన్న బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌ను కలిసేందుకు బయలుదేరిన బీఆర్ఎస్ కీలక నాయకత్వాన్ని పోలీసులు మార్గమధ్యంలోనే అడ్డుకుని అరెస్టు చేయడం తెలంగాణ రాజకీయాల్లో సంచలనం సృష్టించింది. అసెంబ్లీ నుంచి ఎర్రవెల్లికి పయనమైన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్,

(మిగతా 2వ పేజీలో)



# హైదరాబాద్‌కు అంతర్జాతీయ ఖ్యాతి
# భారత్‌లో తొలిసారిగా గ్లోబల్ రియల్ ఎస్టేట్ సదస్సు

**భారత్‌లో తొలిసారిగా అంతర్జాతీయ రియల్ ఎస్టేట్ సదస్సు**

**హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో సెప్టెంబర్ 25 నుంచి 27 వరకు ఈవెంట్**

**హాజరుకానున్న 35 దేశాలకు చెందిన 1500 మందికి పైగా ప్రతినిధులు**

**ఏఐ, ప్రాప్‌టెక్, అంతర్జాతీయ పెట్టుబడులపై ప్రధానంగా చర్చ**

**భారత రియల్ రంగం ప్రపంచ స్థాయికి చేరిందన్న నిర్వాహకులు**



ప్రపంచ రియల్ ఎస్టేట్ రంగానికి సంబంధించిన ప్రతిష్ఠాత్మక ఏడవ అంతర్జాతీయ రియల్ ఎస్టేట్ కాన్ఫరెన్స్ కు హైదరాబాద్ నగరం ఆతిథ్యం ఇవ్వనుంది. దేశంలో ఈ అంతర్జాతీయ సదస్సు జరగడం ఇదే ప్రథమం. 2026 సెప్టెంబర్ 25 నుంచి 27 వరకు మూడు రోజుల పాటు హైటెక్స్‌లోని ఎగ్జిబిషన్ సెంటర్‌లో ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నారు. ఈ గ్లోబల్ ఈవెంట్‌కు 35కు పైగా దేశాల నుంచి 1500 మందికి పైగా ప్రతినిధులు, పరిశ్రమల అధినేతలు, నిపుణులు హాజరుకానున్నారు. “ది డోర్ టు వాట్ హ్యాపెన్స్ నెక్స్ట్” (భవిష్యత్తుకు తలుపులు) అనే థీమ్‌తో ఈ సదస్సును నిర్వహిస్తున్నారు. రియల్ ఎస్టేట్ రంగంలో రాబోయే మార్పులు, మారుతున్న ఆర్థిక ప్రాధాన్యతలు, అంతర్జాతీయ పెట్టుబడులు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), ప్రాప్‌టెక్, డీప్‌టెక్, సుస్థిర అభివృద్ధి వంటి కీలక అంశాలపై ఈ వేదికగా విస్తృతంగా చర్చించనున్నారు. ఈ కార్యక్రమం మూడు ప్రధాన విభాగాల కలయికగా జరగనుంది. ఇందులో అంతర్జాతీయ రియల్ ఎస్టేట్ కాన్ఫరెన్స్‌తో పాటు, ప్రాప్‌టెక్ అండ్ రియల్ ఎస్టేట్ ఇన్నోవేషన్ షోకేస్, లగ్జరీ ప్రాపర్టీ ఎక్స్‌పో కూడా ఉంటాయి. ఈ సందర్భంగా నేషనల్ అసోసియేషన్ ఆఫ్ రియల్టర్స్-ఇండియా (నార్-ఇండియా) ఛైర్మన్ సుమంత్ రెడ్డి ఆరాణి మాట్లాడుతూ, “భారతదేశ డెవలపర్లు, నిపుణులు, ప్రాజెక్టులు అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా పనిచేసే స్థాయికి చేరుకున్నాయి” అని అన్నారు. ఈ సదస్సు ఆ స్థాయిని ప్రపంచానికి చాటి చెబుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. IREC 2026 ఛైర్ శైలేందర్ సింగ్ మాట్లాడుతూ, “ప్రపంచ రియల్ ఎస్టేట్ రంగంలో రానున్న మార్పులతో భారతదేశాన్ని అనుసంధానించే ఒక వేదికను సృష్టించాలన్నదే ఈ సదస్సు ముఖ్య ఉద్దేశం” అని వివరించారు. ఈ ప్రతిష్ఠాత్మక సదస్సుతో హైదరాబాద్ కీర్తి మరింత పెరగడంతో పాటు, భారత రియల్ ఎస్టేట్ రంగంలోకి కొత్త పెట్టుబడులకు మార్గం సుగమం అవుతుందని నిపుణులు భావిస్తున్నారు.

# పోలీసు ఉద్యోగాలకు ట్రాన్స్‌జెండర్ల దరఖాస్తులు స్వీకరించండి: తెలంగాణ హైకోర్టు

### ఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాలకు ట్రాన్స్‌జెండర్ల దరఖాస్తులు స్వీకరించాలని ఆదేశం

**దరఖాస్తుల్లో ‘ఇతరులు’ అనే కాలమ్ లేకపోవడంపై ఆగ్రహం**

**భౌతికంగానైనా అప్లికేషన్లు తీసుకోవాలని రిక్రూట్‌మెంట్ బోర్డుకు సూచన**

**ట్రాన్స్‌జెండర్ల విషయంలో ప్రభుత్వ వైఖరిపై ధర్మాసనం అసంతృప్తి**

**హోంశాఖ, డీజీపీకి వివరణ కోరుతూ ఉన్నత న్యాయస్థానం నోటీసులు**



తెలంగాణలో ఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాల నియామక ప్రక్రియలో ట్రాన్స్‌జెండర్లకు అవకాశం కల్పించకపోవడంపై హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. దరఖాస్తు ఫారంలో స్త్రీ, పురుష లింగాలతో పాటు ‘ఇతరులు’ అనే కాలమ్‌ను ఎందుకు చేర్చలేదని ప్రభుత్వాన్ని, రాష్ట్రస్థాయి పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డును ప్రశ్నించింది. ట్రాన్స్‌జెండర్ల నుంచి కూడా దరఖాస్తులు స్వీకరించాలని మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు జారీచేసిన నోటిఫికేషన్లలో తమకు అవకాశం కల్పించలేదని సూర్యాపేట జిల్లాకు చెందిన డి.తనుశ్రీ, మరికొందరు ట్రాన్స్‌జెండర్లు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది ఎల్. రవిచందర్ వాదిస్తూ, అన్ని రంగాల్లో ట్రాన్స్‌జెండర్లకు సమాన అవకాశాలు కల్పించాలని గతంలోనే హైకోర్టు తీర్పు ఇచ్చిందని గుర్తుచేశారు. వాదనలు విన్న ధర్మాసనం, సమాజంలో కేవలం రెండు లింగాలే ఉంటాయన్న మూస ధోరణి నుంచి బయటపడాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించింది. గతంలో హైకోర్టు సీజేగా ఉన్న జస్టిస్ ఉజ్జల్ భుయాన్ ఇచ్చిన తీర్పు ప్రకారం ప్రభుత్వం ఇప్పటికీ మార్గదర్శకాలు ఎందుకు రూపొందించలేదని నిలదీసింది. దరఖాస్తుల గడువు ఈనెల 16 వరకు ఉందని బోర్డు తరఫు న్యాయవాది తెలపడంతో, ఆన్‌లైన్ పోర్టల్‌లో అవకాశం లేకపోతే భౌతికంగానైనా సరే ట్రాన్స్‌జెండర్ల నుంచి దరఖాస్తులు తీసుకుని, వారికి రశీదు ఇవ్వాలని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ విషయంపై పూర్తి వివరణ ఇవ్వాలని ఆదేశిస్తూ హోంశాఖ, డీజీపీ, పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డుతో పాటు దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్ల సాధికారత శాఖకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను సెప్టెంబర్ 16వ తేదీకి వాయిదా వేసింది.

# ఎర్రవల్లిలో ఉద్రిక్తత

తమకు పూర్తి గౌరవం ఉందని, సోమవారం జరిగిన ఘటనపై విచారణకు ఆదేశించామని, నివేదిక ఆధారంగా బాధ్యులపై చర్యలు తీసుకుంటామని స్పీకర్ తెలిపారు. అయినప్పటికీ హరీశ్‌రావు అదే అంశాన్ని ప్రస్తావించడంతో స్పీకర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తన కుటుంబాన్ని ఉద్దేశించి ఎమ్మెల్సీ చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ తనకు ఆవేశం ఉండటం సహజమని పేర్కొన్నారు. ఈ క్రమంలో కాంగ్రెస్, భారాస, భాజపా సభ్యుల మధ్య వాగ్వాదం జరగడంతో సభ కొంతసేపు వాయిదా పడింది. మధ్యాహ్నం తిరిగి ప్రారంభమైన శాసనసభలో తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డిల వ్యవహారంపై ప్రధానంగా చర్చ జరిగింది. స్పీకర్‌ను ఉద్దేశించి అభ్యంతరకర వ్యాఖ్యలు చేయడంతో పాటు శాసన వ్యవస్థ గౌరవాన్ని దెబ్బతీసేలా వ్యవహరించారని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహతో పాటు పలువురు ఎమ్మెల్యేలు ఆరోపించారు. ఈ సందర్భంగా సోమవారం అసెంబ్లీ గేటు వద్ద జరిగిన ఘటనలకు సంబంధించిన ఫొటోలను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్పీకర్ అనుమతితో సభలో ప్రదర్శించారు. మహిళా పోలీసుల పట్ల అనుచితంగా ప్రవర్తించడం, పోలీసులపై దౌర్జన్యం చేయడం వంటి ఘటనలు ఫొటోల్లో స్పష్టంగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. అనంతరం తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డిల ఎమ్మెల్సీ సభ్యత్వాన్ని రద్దు చేయాలని కోరుతూ శాసనసభ తీర్మానం చేసింది. ఆ తీర్మానాన్ని శాసనమండలికి పంపించింది. శాసనమండలిలో చర్చ ప్రారంభమైన కొద్దిసేపటికే తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డిలపై సస్పెన్షన్ వేటు పడింది. దీంతో భారాస ఎమ్మెల్సీలు నిరసన వ్యక్తం చేశారు. వారికి మద్దతుగా భారాస ఎమ్మెల్యేలు కూడా మండలి వద్దకు చేరుకున్నారు. ప్రభుత్వ వైఖరికి నిరసనగా భారాస నేతలు నినాదాలు చేసి అనంతరం ప్రదర్శనగా బయటకు వచ్చారు. ఇదే సమయంలో ఎర్రవల్లిలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయన్న సమాచారం అందడంతో కేటీఆర్, హరీశ్‌రావు సహా భారాస ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అక్కడికి బయలుదేరారు. స్పీకర్‌పై ఎమ్మెల్సీలు చేసిన వ్యాఖ్యలకు నిరసనగా కాంగ్రెస్‌కు చెందిన దళిత సంఘాలు కేసీఆర్ ఫాంహౌస్ ముట్టడికి పిలుపునిచ్చాయి. దీంతో పెద్ద సంఖ్యలో కార్యకర్తలు ఎర్రవల్లి పరిసరాలకు చేరుకుని డప్పులు మోగిస్తూ నిరసన చేపట్టారు. వారిని స్థానిక భారాస నాయకులు అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. పరిస్థితి క్రమంగా ఉద్రిక్తంగా మారి పరస్పరం దాడులు చేసుకునే స్థాయికి చేరింది. పోలీసులు భారీగా బారికేడ్లు ఏర్పాటు చేసి రోప్ పార్టీలతో ఇరువర్గాలను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘర్షణల్లో, పోలీసుల లాఠీఛార్జిలో పలువురు గాయపడ్డారు. తీవ్రంగా గాయపడిన గజ్వేల్ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి నరసారెడ్డిని నిమ్స్‌కు తరలించారు. ఎర్రవల్లిలో పరిస్థితిపై సమాచారం అందుకున్న కేటీఆర్, హరీశ్‌రావు సహా భారాస నేతలు అక్కడికి బయలుదేరారు. అయితే వారిని పోలీసులు మార్గమధ్యంలోనే అడ్డుకున్నారు. హకీంపేట వద్ద కేటీఆర్, హరీశ్‌రావులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారితో పాటు పలువురు భారాస నేతలను వేర్వేరు పోలీస్‌స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు, పోలీసుల మధ్య తోపులాటలు, వాగ్వాదాలు చోటుచేసుకున్నాయి. దీంతో ఎర్రవల్లి పరిసరాల్లో కొంతసేపు తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. మంగళవారం చోటుచేసుకున్న పరిణామాలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పలువురు మంత్రులతో సమావేశమయ్యారు. అసెంబ్లీలోని తన గదిలో మంత్రులతో చర్చించిన ముఖ్యమంత్రి.. సభలో భారాస నేతల వ్యవహారశైలి, స్పీకర్‌పై వ్యాఖ్యలు, ఎమ్మెల్సీలపై తీసుకున్న చర్యలు, తదుపరి సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించినట్లు తెలిసింది. శాసనసభ చేసిన తీర్మానంపై బుధవారం శాసనమండలిలో చర్చ జరిగే అవకాశం ఉంది. సోమవారం అసెంబ్లీ ఎదుట చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మంగళవారం స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను ఆయన ఛాంబర్‌లో కలిశారు. స్పీకర్‌పై భారాస నేతలు అనుచిత పదజాలంతో చేసిన వ్యాఖ్యలు, అసెంబ్లీ ఎదుట జరిగిన ఘటనలపై వారు ఆరా తీశారు. ఈ సందర్భంగా స్పీకర్‌కు ప్రభుత్వం అండగా ఉంటుందని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు. వ్యక్తిగతంగా దూషించడంతో స్పీకర్ తీవ్రంగా కలత చెందారని, ఈ ఘటనను ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. బాధ్యులపై తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# ‘నా తల్లిని అవమానించారు.. దానికి ఏం చెబుతారు?’: హరీశ్ రావుపై స్పీకర్ గడ్డం ప్రసాద్ ఆగ్రహం

**అసెంబ్లీలో తాతా మధు వ్యాఖ్యలపై తీవ్ర దుమారం**

**హరీశ్ రావుపై స్పీకర్ గడ్డం ప్రసాద్ ఆగ్రహం**

**మహిళా ఎమ్మెల్యేలపై పోలీసుల తీరుపై హరీశ్ ఫిర్యాదు**

**ఘటనపై విచారణకు ఆదేశించామని స్పీకర్ వెల్లడి**

**తన తల్లిపై వ్యాఖ్యలపై హరీశ్‌ను నిలదీసిన స్పీకర్**



తెలంగాణ అసెంబ్లీ సమావేశాల రెండో రోజు కూడా వాడీవేడిగా సాగుతోంది. స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై ఎమ్మెల్సీ తాతా మధు అనుచిత వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలు సభలో తీవ్ర దుమారం రేపాయి. ఈ అంశంపై చర్చ జరుగుతుండగా బీఆర్ఎస్ నేత హరీశ్ రావుపై స్పీకర్ గడ్డం ప్రసాద్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.హరీశ్ రావు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డితో పోలీసులు అనుచితంగా ప్రవర్తించారని ఆరోపించారు. వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై స్పీకర్ స్పందిస్తూ.. మహిళా నేతలపై దాడి జరిగిందన్న ఆరోపణలపై ఇప్పటికే విచారణకు ఆదేశించినట్లు తెలిపారు. నివేదిక వచ్చిన తర్వాత తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అదే సమయంలో తాతా మధు తన తల్లిపై చేసిన వ్యాఖ్యల అంశాన్ని స్పీకర్ ప్రస్తావించారు. “నా తల్లిని అవమానించిన అంశంపై ఏం చెబుతారు?” అంటూ హరీశ్ రావును ప్రశ్నించారు. దీనిపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలోనే స్పీకర్, హరీశ్ రావు మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. మరోవైపు మంత్రి సీతక్క కూడా ఈ వ్యవహారంపై తీవ్రంగా స్పందించారు. స్పీకర్ తల్లిని అవమానిస్తే ప్రధాన ప్రతిపక్షం కనీసం విచారం వ్యక్తం చేయకపోవడం సిగ్గుచేటని అన్నారు. మహిళా పోలీసుల ఎదుట బీఆర్ఎస్ నేతలు చొక్కాలు విప్పి విసిరేశారని ఆరోపించారు. అంతేకాకుండా వారిపై దాడికి కూడా పాల్పడ్డారని అన్నారు.

# మండలిలో హైటెన్షన్

అధికారుల సూచనను తిరస్కరించిన తాతా మధు, అక్కడే ఉండేందుకు ప్రయత్నించారు. దీంతో మార్షల్స్ రంగప్రవేశం చేసి, ఆయన్ను బలవంతంగా అక్కడి నుంచి తరలించే ప్రయత్నం చేశారు. ఆయన నిరాకరించడంతో, మార్షల్స్ ఆయనను చేతులపై ఎత్తుకుని ప్రాంగణం వెలుపలికి తీసుకెళ్లారు. అసెంబ్లీ స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలతో తాతా మధుపై సస్పెన్షన్ వేటు వేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే, మండలి ప్రాంగణంలో ఆయనను మాట్లాడకుండా అధికారులు అడ్డుకున్నారు.

# కేటీఆర్, హరీశ్‌రావు అరెస్ట్

మాజీ మంత్రి హరీశ్ రావుతో పాటు పలువురు ఎమ్మెల్యేల వాహనాల కాన్వాయ్‌ను మేడ్చల్ పరిసర ప్రాంతాల్లో పోలీసులు బారికేడ్లు పెట్టి నిలిపివేశారు. వారిని అరెస్ట్ చేసి బోయిన్ పల్లి, జవహర్ నగర్ పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ క్రమంలో పోలీసుల తీరుపై కేటీఆర్, హరీశ్ రావులు మండిపడ్డారు. శాంతియుతంగా వెళుతున్న తమను ఏ ప్రాతిపదికన అడ్డుకుంటున్నారని నిలదీస్తూ కేటీఆర్, హరీశ్ రావు రోడ్డుపైనే నిరసనకు దిగడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఈ క్రమంలో పోలీసులు, బీఆర్ఎస్ నాయకుల మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట చోటుచేసుకుంది. ప్రతిపక్ష నేతలను నిరోధించడమే లక్ష్యంగా పోలీసులు ప్రవర్తిస్తున్నారని బీఆర్ఎస్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేయగా... ప్రభుత్వ ఉత్తర్వుల మేరకే శాంతిభద్రతల పరిరక్షణకు విధుల్లో ఉన్నామని పోలీసులు తెలిపారు. పరిస్థితి చేయిదాటిపోతుండటంతో కేటీఆర్, హరీశ్ రావు సహా ఇతర ఎమ్మెల్యేలను పోలీసులు బలవంతంగా అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్లకు తరలించారు.

# తిరునల్వేలి
# గ్యాంగ్‌రేప్ కేసులో దోషికి ఉరిశిక్ష

వెలువరించింది. ఈ కేసులో ఒక దోషికి మరణశిక్ష విధిస్తూ, మరో ఇద్దరికి కఠిన కారాగార శిక్షలను ఖరారు చేస్తూ న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. వివరాల్లోకి వెళితే, 2022లో తిరునల్వేలికి చెందిన 16 ఏళ్ల బాలికకు ఓ ప్రార్థనా స్థలంలో విలాతికుళానికి చెందిన పెయింటర్ మునీశ్వరన్ (25) పరిచయమయ్యాడు. ఫోన్ నంబర్లు మార్చుకున్నాక వారిద్దరూ సుమారు రెండు వారాల పాటు మాట్లాడుకున్నారు. ఆ తర్వాత, పెళ్లి చేసుకుంటానని నమ్మబలికిన మునీశ్వరన్, సదరు బాలికను తన ద్విచక్ర వాహనంపై మీనాక్షిపురంలోని తన సోదరి నివాసానికి తీసుకెళ్లి, అక్కడ ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. అనంతరం మునీశ్వరన్ తన స్నేహితులైన చిన్నకుట్టి (28), మురుగేశన్ (23)లను అక్కడికి పిలిపించాడు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం, వారు కూడా బాలికపై లైంగిక దాడికి ఒడిగట్టారు. ఈ దారుణం గురించి బాధితురాలు తన తల్లిదండ్రులకు తెలపడంతో, వారు పాళయంకోట్టై మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. ఈ కేసుపై సమగ్ర విచారణ జరిపిన ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి సురేశ్ కుమార్ మంగళవారం తుది తీర్పు వెలువరించారు. నిందితుడు చిన్నకుట్టికి మరణశిక్ష విధించగా, మురుగేశన్‌కు 20 ఏళ్లు, మునీశ్వరన్‌కు 13 ఏళ్ల కఠిన కారాగార శిక్ష ఖరారు చేస్తూ న్యాయస్థానం తీర్పునిచ్చింది.

# మంత్రుల శాఖలను సమూలంగా మార్చాలని అధిష్ఠానానికి చెప్పా: మహేశ్‌గౌడ్

తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వంలో కేబినెట్ విస్తరణ, మంత్రుల శాఖల మార్పుపై ఊహాగానాలు షికారు చేస్తున్న వేళ, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. గాంధీ భవన్‌లో మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడుతూ... ప్రస్తుతం కేబినెట్‌లో ఉన్న మంత్రుల శాఖలన్నింటినీ సమూలంగా పునర్వ్యవస్థీకరించి, కొత్త శాఖలను కేటాయించాలని తాను కాంగ్రెస్ హైకమాండ్‌కు స్పష్టమైన సూచన చేసినట్లు వెల్లడించారు. పీసీసీ అధ్యక్షుడిగా తన పరిధి మేరకు పార్టీ ప్రయోజనాల కోసం ఈ సలహా ఇచ్చానని... దానిపై తుది నిర్ణయం తీసుకోవడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, అధిష్ఠానం చేతిలోనే ఉందన్నారు. ఇక తనను మంత్రివర్గంలోకి తీసుకునే అంశంపై స్పందిస్తూ... ఆ విషయాలన్నీ అధిష్ఠానం నిర్ణయానికే వదిలేశానని తెలిపారు. ప్రస్తుతం పార్టీని బలోపేతం చేసే బాధ్యత కలిగిన పీసీసీ అధ్యక్షుడిగా నిరంతరం పనిచేస్తున్నానని పేర్కొన్నారు.

# తాతా మధుపై చర్యలు తీసుకునే అధికారం ఉంది కానీ: స్పీకర్ ప్రసాద్

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు తనపై చేసిన అనుచిత వ్యాఖ్యలపై చర్యలు తీసుకునే అధికారం తనకు ఉన్నప్పటికీ, ప్రస్తుతానికి ఆ దిశగా వెళ్లడం లేదని తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ స్పష్టం చేశారు. తాతా మధు శాసనసభ సభ్యుడు కాకపోయినప్పటికీ (ఎమ్మెల్సీ), సభాధిపతిగా ఆయనపై చర్య తీసుకునే అధికారం తనకు ఉందని ఆయన పేర్కొన్నారు. మంగళవారం మీడియాతో మాట్లాడిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. “బీఆర్ఎస్ హయాంలో మాదిరిగా ఎవరినీ అకస్మాత్తుగా సస్పెండ్ చేయబోమని, ఈ వ్యవహారాన్ని ప్రజాస్వామ్య పద్ధతిలోనే పరిష్కరిస్తాం” అని ప్రసాద్ కుమార్ వెల్లడించారు. ఈ వివాదంపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్వయంగా క్షమాపణ చెప్పాలని ప్రభుత్వం డిమాండ్ చేస్తోందని ఆయన తెలిపారు. ప్రతి అసెంబ్లీ సమావేశానికి ముందు సభకు హాజరుకావాలని తాను వ్యక్తిగతంగా కేసీఆర్‌ను కోరుతూనే ఉన్నానని ఆయన గుర్తుచేశారు. అసెంబ్లీలో మహిళా సభ్యుల పట్ల పోలీసులు అనుచితంగా ప్రవర్తించారన్న ఆరోపణలపైనా స్పీకర్ స్పందించారు. విచారణలో పోలీసుల తప్పిదం ఉన్నట్లు తేలితే కచ్చితంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కాగా, నేటి సభా కార్యక్రమాలకు తాను అధ్యక్షత వహించడం లేదని, ప్యానెల్ స్పీకర్ కడియం శ్రీహరి సభను నిర్వహిస్తారని గడ్డం ప్రసాద్ కుమార్ ప్రకటించారు.

# రీల్స్ చూస్తుండగా సిగ్నల్ కట్.. మనస్తాపంతో మహిళ ఆత్మహత్య!

ఛత్తీస్‌గఢ్‌లో ఒక విచిత్రమైన, విషాదకరమైన ఘటన చోటుచేసుకుంది. మొబైల్ ఫోన్‌లో రీల్స్ చూస్తుండగా ఇంటర్నెట్ సిగ్నల్ పదేపదే నిలిచిపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఓ మహిళ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం, కోర్బా జిల్లాలోని కేరకఛార్ గ్రామానికి చెందిన మంగ్లో బాయి సారథి (52) ఈ దారుణానికి పాల్పడింది. ఈ నెల 5న పురుగుల మందు తాగిన ఆమె ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందింది. మృతురాలికి ఫోన్‌లో రీల్స్, టీవీ సీరియల్స్ చూసే అలవాటు ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు. శనివారం మధ్యాహ్నం భోజనం చేస్తూ వీడియోలు చూస్తుండగా, నెట్‌వర్క్ సమస్యతో అవి మధ్యలోనే ఆగిపోయాయి. దీంతో తీవ్ర ఆగ్రహానికి గురైన ఆమె ఫోన్‌ను నేలకేసి కొట్టి, గదిలోకి వెళ్లి తలుపు వేసుకుంది. కొంతసేపటి తర్వాత ఆమె బయటకు వచ్చి వాంతులు చేసుకోవడం మొదలుపెట్టింది. గదిలో పురుగుల మందు డబ్బా ఖాళీగా కనిపించడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. వెంటనే ఆమెను మొదట స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి, అక్కడి నుంచి కోర్బాలోని మెడికల్ కాలేజీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, కుటుంబ సభ్యుల వాంగ్మూలాలను రికార్డ్ చేశారు. కేవలం నెట్‌వర్క్ సమస్యలే ఈ ఆత్మహత్యకు కారణమా? లేక ఇతర అంశాలు ఏమైనా ఉన్నాయా? అనే కోణంలో దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

అరుణ ప్రభ
ARUNAPRABHA TELUGU DAILY
బుధవారం, సెప్టెంబరు 9, 2026

# వారెవ్వా... Gen-Z

## ఆవేశం నుంచి ఆవిష్కరణ వరకు



చరిత్రలో కొన్ని తరాలు కాలాన్ని అనుసరిస్తాయి. మరికొన్ని తరాలు కాలాన్నే తమ వెంట నడిపిస్తాయి. ప్రతి శతాబ్దానికీ అలాంటి ఒక తరం వస్తుంది. పాత ప్రశ్నలకు కొత్త భాషను ఇస్తుంది. పాత అన్యాయాలకు కొత్త ప్రతిఘటనను నిర్మిస్తుంది. నేడు భారతదేశం అలాంటి ఒక తరాన్ని చూస్తోంది. దానిని ప్రపంచం +వఅ--్గ అని పిలుస్తోంది. కానీ ఈ తరం కేవలం ఒక వయోపరిమితి కాదు. అది ఒక మానసిక స్థితి. ప్రశ్నించడానికి భయపడని ధైర్యం. అన్యాయాన్ని సహజంగా అంగీకరించని మనస్తత్వం. భవిష్యత్తు తమ చేతుల్లోనే ఉండాలని కోరుకునే విశ్వాసం.

ఢిల్లీ వీధుల్లో మొదలయ్యే ప్రతి నినాదం ఇక ఢిల్లీ గోడల మధ్యే మిగిలిపోవడం లేదు. అది కొన్ని గంటల్లోనే దేశం నలుమూలల యువ హృదయాల్లో ప్రతిధ్వనిస్తోంది. ఒక విద్యార్థి కళ్లలో కనిపించిన ఆవేదన మరో రాష్ట్రంలోని విద్యార్థి కళ్లలోనూ అదే తేమను నింపుతోంది. ఒక నిరుద్యోగి గొంతులో వినిపించిన ప్రశ్న లక్షలాది యువజీవితాల సందేహంగా మారుతోంది. ఇది కేవలం సమాచార విప్లవం కాదు. ఇది అనుభవాల సామూహికీకరణ. బాధలకు సరిహద్దులు లేవని కొత్త తరం గుర్తించిన క్షణం.

అయితే చరిత్ర మనకు ఒక ముఖ్యమైన పాఠం నేర్పుతుంది. ఆవేశం చరిత్రను ప్రారంభించవచ్చు. కానీ ఆలోచనే చరిత్రను నిలబెడుతుంది. ఒక్కరోజు కోపం అధికారాన్ని కదిలించవచ్చు. కానీ సమాజాన్ని మార్చేది దీర్ఘకాలిక చైతన్యం మాత్రమే. వీధుల్లో వినిపించే నినాదం ఒక అగ్నికణం అయితే, ఆ అగ్నిని వెలుగుగా మార్చేది నిర్మాణాత్మక పోరాటమే.

ఈ తరం చేతిలో మొబైల్ ఫోన్ ఉంది. ప్రపంచం మొత్తం అరచేతిలో ఉంది. సమాచారం క్షణాల్లో చేరుతోంది. నిజం కూడా అదే వేగంతో పయనిస్తోంది. అబద్ధం కూడా అదే వేగంతో వ్యాపిస్తోంది. అందుకే ఈ తరానికి కేవలం స్పందించడం సరిపోదు. వివేచన కూడా అవసరం. ప్రతి వైరల్ వీడియో వెనుక ఉన్న వాస్తవాన్ని తెలుసుకునే సహనం అవసరం. ప్రతి నినాదం వెనుక ఉన్న సామాజిక సందర్భాన్ని అర్థం చేసుకునే అధ్యయనం అవసరం.

ఉపాధి కోసం చదివిన యువకుడు ఉద్యోగం కోసం క్యూలో నిలబడుతున్నాడు. పరీక్షలకు సంవత్సరాల తరబడి సిద్ధమైన విద్యార్థి ప్రశ్నాపత్రాల లీకేజీల ముందు నిస్సహాయుడవుతున్నాడు. అత్యున్నత విద్య పొందిన యువతి తన ప్రతిభను నిరూపించుకోవడానికి అవకాశాల కోసం దేశం దాటాలని ఆలోచిస్తోంది. ఇది వ్యక్తిగత వైఫల్యం కాదు. వ్యవస్థలో ఏర్పడిన సంక్షోభానికి ప్రతిబింబం. ఈ సంక్షోభాన్ని వ్యక్తిగత నిరాశగా కాకుండా సామాజిక ప్రశ్నగా మలిచినప్పుడే ఉద్యమం పుడుతుంది.

ప్రపంచ చరిత్రలో నిలిచిపోయిన యువజన ఉద్యమాలను పరిశీలిస్తే ఒక విషయం స్పష్టమవుతుంది. అవి కేవలం ప్రభుత్వాలను ప్రశ్నించలేదు. సమాజాన్ని కూడా ప్రశ్నించాయి. కేవలం అధికార మార్పును కోరుకోలేదు. విలువల మార్పును కోరుకున్నాయి. కేవలం చట్టాలను మార్చాలని అడగలేదు. మనుషుల ఆలోచనలను మార్చాలని ప్రయత్నించాయి. అందుకే అవి చరిత్రలో నిలిచిపోయాయి.

నేటి భారత యువత ముందు కూడా అదే సవాలు ఉంది. కోపాన్ని కాపాడుకోవడం కంటే దానికి దిశ ఇవ్వడం ముఖ్యం. నిరసనను కొనసాగించడం కంటే దానికి లక్ష్యం ఇవ్వడం అవసరం. ఒక రోజు వీధుల్లో నడవడం కంటే, సంవత్సరాల పాటు ప్రజల మధ్య నడవడం మరింత అవసరం. ఎందుకంటే ప్రజల జీవితాల నుంచి దూరమైన ఉద్యమం చివరకు తన స్వరాన్నే కోల్పోతుంది.

విద్యార్థి ఉద్యమం రైతు కన్నీటిని అర్థం చేసుకున్నప్పుడు మాత్రమే అది ప్రజా ఉద్యమమవుతుంది. నిరుద్యోగ యువకుడి ఆవేదన కార్మికుడి చెమటతో కలిసినప్పుడు మాత్రమే అది సామాజిక శక్తిగా రూపాంతరం చెందుతుంది. మహిళల భద్రత, దళితుల గౌరవం, ఆదివాసీల అస్తిత్వం, ప్రకృతి పరిరక్షణ, రాజ్యాంగ విలువలు--- ఇవన్నీ ఒకదానికొకటి సంబంధం లేని అంశాలు కావు. ఇవన్నీ ప్రజాస్వామ్య భవిష్యత్తు అనే ఒకే వృక్షానికి చెందిన కొమ్మలు.

ప్రతి తరం తనకంటూ ఒక పరీక్షను ఎదుర్కొంటుంది. స్వాతంత్ర్య తరం వలస పాలనను ఎదుర్కొంది. తరువాతి తరం పేదరికం, నిరక్షరాస్యతతో పోరాడింది. ఈ తరం ఎదుర్కొంటున్న పరీక్ష వేరే. సమాచారపు శబ్దంలో సత్యాన్ని గుర్తించడం. విభజన రాజకీయాల మధ్య ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టడం. నిరాశ మధ్య ఆశను నిర్మించడం. ఆవేశం మధ్య ఆలోచనను నిలుపుకోవడం.

భవిష్యత్తు ఈ తరం చేతుల్లో ఉందని చెప్పడం ఒక సాధారణ వాక్యం. కానీ నిజానికి భవిష్యత్తు ఎవరి చేతుల్లోనూ సిద్ధంగా ఉండదు. దానిని నిర్మించాలి. ప్రతి ప్రశ్నతో ఒక ఇటుక వేయాలి. ప్రతి చర్చతో ఒక గోడ నిలబెట్టాలి. ప్రతి ప్రజా భాగస్వామ్యంతో ఒక పునాది బలపరచాలి. అప్పుడు మాత్రమే సమానత్వం, న్యాయం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం అనే పదాలు రాజ్యాంగ పుస్తకంలోని అక్షరాలుగా కాకుండా ప్రజల జీవితాల్లోని అనుభవాలుగా మారతాయి.

అందుకే నేటి యువత ముందు ఉన్న అతిపెద్ద బాధ్యత నిరసించడం కాదు; నిరసనకు దిశ చూపించడం. ప్రశ్నించడం కాదు; ప్రశ్నలను ప్రజా చైతన్యంగా మలచడం. కోపాన్ని వ్యక్తం చేయడం కాదు; ఆ కోపాన్ని సమాజ నిర్మాణానికి అవసరమైన శక్తిగా మార్చడం. చరిత్రను చదవడం కాదు; చరిత్రను సృష్టించే సామర్థ్యాన్ని సంపాదించడం.

ప్రతి పెద్ద మార్పు మొదట ఒక ప్రశ్నగానే పుడుతుంది. ఆ ప్రశ్న ఆలోచనగా మారుతుంది. ఆలోచన ప్రజల మధ్య నమ్మకాన్ని పెంచుతుంది. నమ్మకం సంఘటనగా రూపుదాల్చుతుంది. సంఘటన ఉద్యమమవుతుంది. ఉద్యమం చరిత్రను సృష్టిస్తుంది. అందుకే నేటి +వఅ--్గ తరం ముందున్న అసలు సవాలు వీధుల్లో ఎంత దూరం నడిచిందన్నది కాదు; సమాజంలో ఎంత లోతుగా వేర్లు వేసిందన్నది. ఎన్ని హ్యాష్‌ట్యాగ్‌లు ట్రెండ్ అయ్యాయన్నది కాదు; ఎన్ని జీవితాల్లో ఆశను నాటిందన్నది.

వీధులు ఒక రోజు ఖాళీ కావచ్చు. ప్లకార్డులు మడతపెట్టబడవచ్చు. నినాదాల ప్రతిధ్వని కాలంతో కలిసి నెమ్మదిగా మసకబారవచ్చు. కానీ ఆ నిరసనల నుంచి పుట్టిన కొత్త ఆలోచనలు పుస్తకాలుగా మారితే, ప్రజా సంస్థలుగా ఎదిగితే, గ్రామ సభల్లో వినిపిస్తే, విశ్వవిద్యాలయాల్లో చర్చలుగా వికసిస్తే, కార్మికుడి చేతిలో సంఘటిత శక్తిగా నిలిస్తే, రైతు పొలంలో ఆశగా మొలిస్తే... అప్పుడే ఒక తరం తన చారిత్రక బాధ్యతను నెరవేర్చినట్లవుతుంది.

చరిత్రకు క్షణిక కోపాలు అవసరం. కానీ చరిత్రను నిర్మించేది దీర్ఘకాలిక నిబద్ధత. సమాజానికి నినాదాలు అవసరం. కానీ సమాజాన్ని మార్చేది సంఘటిత చైతన్యం. వీధిలో పుట్టిన ప్రశ్న పుస్తకంలో ఆలోచనగా మారాలి. పుస్తకంలో పుట్టిన ఆలోచన ప్రజల మధ్య ఉద్యమంగా ఎదగాలి. ఉద్యమం ప్రత్యామ్నాయ సమాజ నిర్మాణానికి పునాదిగా నిలవాలి. అప్పుడు మాత్రమే ఒక తరం తన కాలాన్ని అనుసరించదు; కాలాన్నే తన వెంట నడిపిస్తుంది.

**ఆవేశం ఒక నిప్పురవ్వ...**
**ఆలోచన ఒక వెలుగు బాట...**
**సంఘటిత చైతన్యం ఒక ప్రజాశక్తి...**
**ఆ ప్రజాశక్తే రేపటి భారత చరిత్రను రాసే కలం...**

**ఆవేశం నుంచి ఆవిష్కరణ వరకు...**
**నిరసన నుంచి నిర్మాణం వరకు...**
**యువత నుంచి ప్రజాశక్తి వరకు...**
**ఇదే నూతన భారత ప్రయాణం...**
**ఇదే చరిత్ర పిలుపు...**



-గుర్రం పాపిరెడ్డి
ఎడిటర్

# 20 ఏళ్లు దాటితే కిడ్నీ పరీక్ష తప్పనిసరి.. కేంద్రానికి పార్లమెంటరీ ప్యానెల్ సూచన

**దేశంలో కిడ్నీ వ్యాధుల కట్టడికి జాతీయ విధానం ఏర్పాటు చేయాలన్న ప్యానెల్**

**ఏపీలోని ఉద్దానం సమస్యపై పార్లమెంటరీ సంఘం ప్రత్యేక ప్రస్తావన**

**క్రియాటినిన్‌తో పాటు ఈజీఎఫ్ఆర్, యూరిన్ అల్బుమిన్ పరీక్షలు తప్పనిసరి చేయాలని సూచన**

**కిడ్నీ రోగులకు ఆర్థిక చేయూత, ప్రత్యేక బీమా అందించాలన్న స్థాయీ సంఘం**

దేశంలో వేగంగా విస్తరిస్తున్న క్రానిక్ కిడ్నీ డిసీజ్ (సీకేడీ) ముప్పును ఎదుర్కొనేందుకు కేంద్ర ప్రభుత్వం వెంటనే ఒక జాతీయ విధానాన్ని రూపొందించాలని ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ పార్లమెంటరీ స్థాయీ సంఘం గట్టిగా సిఫారసు చేసింది. 20 ఏళ్ల వయసు దాటిన ప్రతి ఒక్కరూ ప్రతి ఆరు నెలలకోసారి తప్పనిసరిగా మూత్రపిండాల పనితీరు పరీక్షలు చేయించుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించింది. యువతలో కూడా కిడ్నీ సమస్యలు పెరుగుతుండటంపై కమిటీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. వ్యాధి ముదిరి చివరి దశకు చేరుకునే వరకు చాలామందికి తమ కిడ్నీలు దెబ్బతిన్నాయనే విషయమే తెలియడం లేదని పేర్కొంది. మధుమేహం, అధిక రక్తపోటు ఈ వ్యాధికి ప్రధాన కారణాలుగా ఉన్నప్పటికీ, వ్యవసాయ కూలీలు, కఠిన వాతావరణంలో పనిచేసే వారిలోనూ ఇది ఎక్కువగా కనిపిస్తోందని తెలిపింది. తీవ్రమైన ఎండలు, డీహైడ్రేషన్, పురుగుమందుల వాడకం, కలుషిత నీటిలోని భార లోహాల ప్రభావంపై లోతైన శాస్త్రీయ పరిశోధనలు జరగాలని అభిప్రాయపడింది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా 'ఉద్దానం' ప్రాంతంలో ప్రబలుతున్న కిడ్నీ వ్యాధుల గురించి కమిటీ ప్రత్యేకంగా ప్రస్తావించింది. గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో సరైన వైద్య సేవలు అందుబాటులో లేకపోవడం వల్ల ప్రాంతీయ అసమానతలు పెరుగుతున్నాయని, పేదలకు ఉచితంగా రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలని స్పష్టం చేసింది.



**ప్యానెల్ కీలక సిఫారసులు**

ప్రస్తుతం చేస్తున్న సీరం క్రియాటినిన్ పరీక్ష మాత్రమే సరిపోదని ప్యానెల్ స్పష్టం చేసింది. కిడ్నీలు 50 శాతం దెబ్బతినే వరకు ఈ పరీక్షలో ఫలితం సాధారణంగానే కనిపిస్తుందని వివరించింది. అందువల్ల, క్రియాటినిన్‌తో పాటు తప్పనిసరిగా eGFR, యూరిన్ అల్బుమిన్, ప్రొటీన్ పరీక్షలు చేయాలని సూచించింది. ల్యాబ్‌లు ఎలాంటి అదనపు రుసుము లేకుండానే క్రియాటినిన్ రిపోర్టులోనే ఈజీఎఫ్ఆర్ విలువను చేర్చేలా నిబంధనలు తేవాలని కోరింది. సీకేడీ రోగులకు ప్రత్యేక ఆరోగ్య బీమా, ఆర్థిక చేయూత అందించాలని, తక్కువ ధరలకే రెనాల్ కేర్ సేవలు అందుబాటులోకి తేవాలని కమిటీ సిఫారసు చేసింది. మారుమూల ప్రాంతాల్లోనూ డయాలసిస్ కేంద్రాలు ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పింది. కిడ్నీ వ్యాధులపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు ఇంటింటికీ ప్రచారం నిర్వహించాలని, పాఠశాల పాఠ్యాంశాల్లో కూడా సంబంధిత అంశాలను చేర్చాలని సూచించింది.



## గౌతమ్ అదానీకి భారీ ఊరట.. అమెరికా కోర్టులో కేసు కొట్టివేత

**ఆయనపై నమోదైన క్రిమినల్ ఛార్జీలను కొట్టివేసిన న్యాయస్థానం**

**తీర్పును గౌరవిస్తున్నానని, న్యాయవ్యవస్థపై నమ్మకం ఉందని చెప్పిన అదానీ**

**భారత్‌లో సోలార్ కాంట్రాక్టులకు సంబంధించిన లంచం ఆరోపణలపై ఈ కేసు**

**ప్రాసిక్యూటర్ల అభ్యర్థన మేరకు కేసును కొట్టివేసిన న్యూయార్క్ కోర్టు**

ప్రముఖ పారిశ్రామికవేత్త, అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీకి అమెరికాలో భారీ ఊరట లభించింది. ఆయనపై నమోదైన క్రిమినల్ ఛార్జీలను యూఎస్ కోర్టు కొట్టివేసింది. ఈ తీర్పును గౌరవిస్తున్నానని, సత్యం, న్యాయంపై తనకున్న నమ్మకం చెక్కుచెదరలేదని అదానీ పేర్కొన్నారు. ఈ విషయమై ఆయన 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా ఆయన స్పందించారు. న్యాయ ప్రక్రియను తాను ఎంతో గౌరవిస్తున్నానని తెలిపారు. ఈ క్లిష్ట సమయంలో తమ గ్రూప్‌పైనా, న్యాయవ్యవస్థపైనా, భారత దేశ న్యాయ సామర్థ్యంపైనా నమ్మకం ఉంచిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. దేశ నిర్మాణానికి, విలువలను సృష్టించేందుకు తమ నిబద్ధత కొనసాగుతుందని అన్నారు. భారత్‌లో సోలార్ పవర్ కాంట్రాక్టులకు సంబంధించిన లంచం ఆరోపణలు, అమెరికన్ ఇన్వెస్టర్లను తప్పుదోవ పట్టించారన్న అభియోగాలపై గౌతమ్ అదానీ, ఆయన మేనల్లుడు సాగర్ అదానీపై ఈ కేసు నమోదైంది. అయితే, ఈ కేసు విచారణను నిలిపివేయాలని కోరుతూ ఫెడరల్ ప్రాసిక్యూటర్లు కోర్టును అభ్యర్థించారు. ఈ కేసు అధిక భాగం భారత్‌తో ముడిపడి ఉందని, దీని విచారణ కొనసాగించడం వల్ల న్యాయ ప్రయోజనాలు నెరవేరవని వారు వాదించారు. ఈ వాదనలతో ఏకీభవించిన న్యూయార్క్‌లోని ఈస్టర్న్ డిస్ట్రిక్ట్ జడ్జి నికోలస్ గారౌఫిస్ నిన్న కేసును కొట్టివేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

అరుణ ప్రభ
ARUNAPRABHA TELUGU DAILY
www.arunaprabha.com

# తెలంగాణ స్పీకర్‌పై ఎమ్మెల్సీ తాతా మధు వ్యాఖ్యలకు కాంగ్రెస్ నిరసన

### బాధాకరం.. తాతా మధును పదవి నుంచి తొలగించాలి: ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బుర్ర జ్ఞానేశ్వర్

### శంషాబాద్‌లో కాంగ్రెస్ నిరసన సెగ

### అంబేద్కర్ చౌరస్తాలో దిష్టిబొమ్మ దహనం



అరుణ ప్రభ శంషాబాద్ జోన్ , సెప్టెంబర్ 8 : తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసినట్లు ఆరోపణలు ఉన్న అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ శంషాబాద్‌లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు నిరసన చేపట్టారు. శంషాబాద్ అంబేద్కర్ చౌరస్తా వద్ద మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, ఎమ్మెల్సీ తాతా మధు దిష్టిబొమ్మలను దహనం చేస్తూ బీఆర్ఎస్ నాయకులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బుర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్ మాట్లాడుతూ, తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఎమ్మెల్సీ తాతా మధును తక్షణమే పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. "దళితులకు ఎవరూ లేరని అనుకుంటున్నారా? గడ్డం ప్రసాద్ కుమార్‌కు ఎవరూ అండగా లేరని భావిస్తున్నారా? తాతా మధు జాగ్రత్తగా ఉంటే మంచిది" అని హెచ్చరించారు. సభాపతి స్థానంలో ఉన్న గడ్డం ప్రసాద్ కుమార్ ఎంతో సంస్కారవంతమైన నాయకుడని పేర్కొన్నారు. అసెంబ్లీ సాక్షిగా బీఆర్ఎస్ అగ్రనేతలు కేటీఆర్, హరీష్ రావులతో పాటు ఎమ్మెల్సీ తాతా మధు కూడా స్పీకర్‌కు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. దళిత వర్గానికి చెందిన స్పీకర్‌పై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం క్షమించరానిదని ఆమె తీవ్రంగా మండిపడ్డారు. బీఆర్ఎస్ నాయకులపై "ఖబర్దార్" అంటూ నిరసనకారులు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఎస్సీ సెల్స్ ఉపాధ్యక్షుడు జల్పల్లి నరేందర్, శంషాబాద్ మండల అధ్యక్షుడు చిలకమర్రి మహేందర్ ముదిరాజ్, కొత్వాల్‌గూడ డివిజన్ ప్రెసిడెంట్ బొబ్బిలి సానం శ్రీనివాస్ గౌడ్, శేఖర్ ముదిరాజ్, కోటేష్ గౌడ్, గడ్డం శేఖర్ యాదవ్, సంజయ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. భారీ సంఖ్యలో కాంగ్రెస్ కార్యకర్తలు నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు.

## స్పీకర్ పదవి గౌరవాన్ని కించపరిచే వ్యాఖ్యలను ఖండించిన కాంగ్రెస్

### రంగారెడ్డి జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కొండకళ్ళ నాగేందర్ రెడ్డి ఆధ్వర్యంలో శంషాబాద్‌లో భారీ నిరసన

అరుణ ప్రభ శంషాబాద్ జోన్ : జిహెచ్ఎంసి శంషాబాద్ జోన్ పరిధిలో శంషాబాద్ అంబేద్కర్ చౌరస్తా వద్ద భారీగా నిరసన కార్యక్రమం తెలంగాణ శాసనసభ గౌరవాన్ని, స్పీకర్ పదవి ప్రతిష్ఠను కించపరిచే విధంగా బీఆర్ఎస్ నాయకులు చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ రంగారెడ్డి జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కొండకళ్ళ నాగేందర్ రెడ్డి ఆధ్వర్యంలో శంషాబాద్‌లో భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చల్లా నరసింహారెడ్డి, తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్ హాజరయ్యారు. తెలంగాణ శాసనసభ గౌరవ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ తాతా మధు వెంటనే బేషరతుగా క్షమాపణలు చెప్పాలని, ఆయనపై తగిన చర్యలు తీసుకుని సస్పెండ్ చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. రాజ్యాంగబద్ధమైన స్పీకర్ పదవి గౌరవాన్ని దెబ్బతీసే విధంగా ఎవరూ వ్యవహరించరాదని వారు పేర్కొన్నారు. నిరసన కార్యక్రమంలో రాష్ట్ర టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సానం శ్రీనివాస్, రాష్ట్ర ఎస్సీ సెల్ వైస్ చైర్మన్ జల్పల్లి నరేందర్, సీనియర్ నాయకులు గుర్రం రణధీర్ రెడ్డి, సులోచన, మాజీ మండల అధ్యక్షుడు, నర్కూడ గ్రామ సర్పంచ్ శేఖర్ యాదవ్, మాజీ మున్సిపల్ అధ్యక్షుడు సంజయ్ యాదవ్, బీ–బ్లాక్ అధ్యక్షుడు ఖలీద్, మండల అధ్యక్షుడు మహేందర్, మున్సిపల్ అధ్యక్షుడు బొబ్బిలి శేఖర్, డివిజన్ అధ్యక్షుడు సామ ఇంద్రపాల్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి హర్మిందర్ సింగ్, మంగళారం గోవర్ధన్ రెడ్డి, ధనంజయ్ పాల్గొన్నారు. అలాగే జిల్లా ఉపాధ్యక్షుడు సాయినికేశ్,




ప్రధాన కార్యదర్శులు విఘ్నేష్ కట్కూరి, పృథ్వీ గౌడ్, గోపాలకృష్ణ, స్వప్న, రాజేంద్రనగర్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు మహేష్ గౌడ్, ఉపాధ్యక్షుడు చందు యాదవ్, కొత్వాల్‌గూడ డివిజన్ అధ్యక్షుడు కిరణ్, శంషాబాద్ డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్, కస్తూరి శ్రవణ్, ఎన్ఎస్‌యూఐ నాయకులు వర్ధన్, అభిషేక్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా యువజన కాంగ్రెస్ కార్యవర్గ కమిటీ సభ్యులు, అసెంబ్లీ కార్యవర్గ కమిటీ సభ్యులు, మండల అధ్యక్షులు, మండల కార్యవర్గ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువజన కాంగ్రెస్ నాయకులు, ఎన్ఎస్‌యూఐ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని నిరసన తెలిపారు.



## చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలి

### ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు పెద్దఎత్తున తరలిరావాలి

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 8 (అరుణప్రభ): తెలంగాణ ఉద్యోగుల జేఏసీ (TGEJAC) పిలుపుమేరకు సెప్టెంబర్ 10న నిర్వహించనున్న 'చలో హైదరాబాద్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎల్లారెడ్డిపేట మండల ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం ఎల్లారెడ్డిపేట మండల తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో చలో హైదరాబాద్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం తెలంగాణ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 10న హైదరాబాద్‌లో చేపట్టనున్న కార్యక్రమానికి మండలం నుంచి ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఇప్పటికే వివిధ దశల్లో ఆందోళన కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. సీపీఎస్‌ను రద్దు చేసి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు వెంటనే ఓపీఎస్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న పీఆర్సీని ప్రకటించడం, డీఏలు చెల్లించడం, ఉద్యోగుల పెండింగ్ బిల్లులను పరిష్కరించడం, ఆరోగ్య పథకాన్ని అమలు చేయడం తదితర సమస్యలపై ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం మరింత జాప్యం చేస్తే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఉద్యోగుల న్యాయమైన హక్కుల సాధన కోసం ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిస్తూ "సెప్టెంబర్ 10న హైదరాబాద్‌లో కదం తొక్కుదాం" అని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మార్వాడి గంగరాజు, అవురం సుధాకర్‌రెడ్డి, లాల శ్రీనివాస్, కదిరి శ్రీనివాస్, ఎం.డి. ఇబ్రహీం, ఈ. అశోక్, బావికాడి రామచంద్రం, కాంభోజ సతీష్, జె. శ్రీనివాస్, కొప్పుల లక్ష్మణ్, బంటు బాలకిషన్, బట్టారి సంపత్‌కుమార్, ఎలగందుల ఆంజనేయులు, బాధవేణి గోపి, ఎంపీడీవో, ఎమ్మార్వో సిబ్బంది, భాగస్వామ్య సంఘాల నాయకులు, జిల్లా స్థాయి నాయకులు, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



## వడ్త్య రమేష్‌ను సన్మానించిన పొగాకు గూడెం యువకులు

దేవరకొండ నియోజకవర్గం పి.ఏ. మండలం : దేవరకొండ నియోజకవర్గం పి.ఏ. మండలం రాంపురం గ్రామపంచాయతీ పరిధిలోని పొగాకు గూడెంకు చెందిన యువకులు దేవరకొండలో బీఆర్ఎస్ దేవరకొండ నియోజకవర్గ నాయకులు వడ్త్య రమేష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తమ గ్రామం రాంపురం గ్రామపంచాయతీ పరిధిలోని పొగాకు గూడెంకు రావాల్సిందిగా వడ్త్య రమేష్‌ను ఆహ్వానించారు. అనంతరం వడ్త్య రమేష్‌ను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో గోనబోయిన వెంకటేష్, ఆంజనేయులు, రాంబాబు, అనిల్, ఆంజనేయులు, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



## పింఛన్ దరఖాస్తుల్లో జాప్యం వద్దు

ధర్మవరం, సెప్టెంబర్ 8; (అరుణ ప్రభ న్యూస్) : ధర్మవరం పట్టణంలోని 15వ వార్డు గాంధీనగర్ సచివాలయాన్ని జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. నూతన పింఛన్ దరఖాస్తుల స్వీకరణ, క్షేత్రస్థాయి పరిశీలన, ప్రస్తుత స్థితి, ఇ–కేవైసీ ప్రక్రియను సమీక్షించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్ అందేలా దరఖాస్తులను నిశితంగా పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయి పరిశీలన, ఇ–కేవైసీ నమోదును నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సూచించారు. సచివాలయ సిబ్బంది అర్జీదారులకు అందుబాటులో ఉండి సరైన సమాచారం అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీవో రాంభూపాల్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య, సచివాలయ అధికారులు, రెవెన్యూ సిబ్బంది, డిజిటల్ సహాయకులు పాల్గొన్నారు.




## దేవరకొండ పెన్షనర్స్ భవనంలో కార్యదర్శి పుట్టినరోజు వేడుకలు

అరుణ ప్రభ, దేవరకొండ డివిజన్, సెప్టెంబర్ 8 ,తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి అంకం చంద్రమౌళి 72వ పుట్టినరోజు వేడుక సందర్భంగా మంగళవారం కార్యవర్గం ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించారు.పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు .ఈ సందర్భంగా పలువురు కార్యవర్గ సభ్యులు, సభ్యులు మాట్లాడుతూ దేవరకొండ సంఘం కార్యదర్శిగా పెన్షనర్స్ కు ఉత్తమ సేవలు అందిస్తున్నారని ,ఎల్లవేళలా సభ్యులకు అందుబాటులో ఉండి, తగిన సలహాలు సూచనలు అందిస్తూ సమస్యల పరిష్కారాలకు తన వంతు కృషి చేస్తున్నారని ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో సహ అధ్యక్షులు గంగిడి దామోదర్ రెడ్డి ,కోశాధికారి పంగులూరు లింగయ్య, ఉపాధ్యక్షులు ఆకులపల్లి ఐజాక్ ,పడమటి శాంతకుమారి, జిల్లా ఉపాధ్యక్షులు కంచర్ల నారాయణరెడ్డి ,సంయుక్త కార్యదర్శి వనం బుచ్చయ్య, కార్యనిర్వాహక కార్యదర్శి మహమ్మద్ యూసుఫ్ షరీఫ్, కార్యవర్గ సభ్యులు మునిని వీరయ్య, మోటమర్రి పురుషోత్తం, సపావత్ నందు లాల్, బులుసాని సత్యనారాయణ, ఆలంపల్లి శ్రీనివాసులు, మౌలానా, లోకేష్, పులిరాజు, చంద్రయ్య, సావిత్రమ్మ, గంధం వసంత తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.



## నేత్రదానంపై అవగాహన బైక్ ర్యాలీ

ధర్మవరం, సెప్టెంబర్ 8; (అరుణ ప్రభ న్యూస్): జాతీయ నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా విశ్వదీప సేవా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నేత్రదానంపై అవగాహన బైక్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని డాక్టర్ ఎస్. నరసింహులు, ఆప్తలమిక్ అధికారి ఇ. ఉరుకుందప్ప ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ నరసింహులు మాట్లాడుతూ.. నేత్రదాన పక్షోత్సవాల సమయంలో ధర్మవరం ప్రాంతం నుంచి ఐదుగురితో నేత్రదానం చేయించడం అభినందనీయమన్నారు. ఉరుకుందప్ప మాట్లాడుతూ కర్నియా సేకరణలో విశ్వదీప సేవా సంఘం కృషి ప్రశంసనీయమన్నారు. సంఘం ఫౌండర్ కోళ్లమొరం చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ నేత్రదానం ద్వారా ఇద్దరి జీవితాల్లో వెలుగులు నింపవచ్చన్నారు. రాకబంధు ట్రస్ట్ కన్నా వెంకటేష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నేత్రదానంపై అవగాహన పెంచుకుని ముందుకు రావాలని కోరారు. కదిరిగేటు నుంచి ప్రారంభమైన ర్యాలీ శివానగర్, తేరుబజార్, అంజుమన్ సర్కిల్, ప్రభుత్వ ఆసుపత్రి, కళాజ్యోతి సర్కిల్, ఆర్టీసీ బస్టాండ్, పీఆర్‌టీ సర్కిల్, గాంధీనగర్ మీదుగా సాగింది. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు గాజుల సురేష్, సభ్యులు, సేవా కార్యకర్తలు పాల్గొన్నారు.



## డ్రంక్ డ్రైవ్.. ఇద్దరికి రూ.20 వేల జరిమానా

ధర్మవరం, సెప్టెంబర్ 8; (అరుణ ప్రభ న్యూస్) : మద్యం సేవించి వాహనాలు నడిపిన ఇద్దరికి ధర్మవరం ద్వితీయ శ్రేణి న్యాయస్థానం రూ.20 వేల జరిమానా విధించింది. రామగిరి మండలం కలికివాండ్లపల్లికి చెందిన సంగాల శివయ్య (30), ధర్మవరం సాయినగర్‌కు చెందిన జి. శ్రీరాములు (60) మద్యం సేవించి వాహనాలు నడుపుతున్నట్లు పోలీసులు గుర్తించి కేసులు నమోదు చేశారు. ఈ కేసులను విచారించిన న్యాయస్థానం ఇద్దరికీ రూ.10 వేల చొప్పున జరిమానా విధించింది. డ్రంక్ అండ్ డ్రైవ్‌పై కఠిన చర్యలు కొనసాగుతాయని పోలీసులు తెలిపారు.



## అర్హులైన వారికి పెన్షన్లు వెంటనే ఇవ్వాలి

బత్తలపల్లి, సెప్టెంబర్ 8; (అరుణ ప్రభ న్యూస్) : 50 ఏళ్లు దాటిన ఎస్సీ, ఎస్టీ, బీసీలకు పెన్షన్ హామీని వెంటనే అమలు చేయాలని బీఎస్పీ శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షుడు సాకే వినయ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బత్తలపల్లి డిప్యూటీ ఎంపీడీవో కృష్ణప్పకు వినతిపత్రం అందజేశారు. పెన్షన్ దరఖాస్తులకు విధించిన గడువును ఎత్తివేసి, అర్హులైన ప్రతి ఒక్కరూ ఎప్పుడైనా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించాలని కోరారు. డప్పు, చర్మ కళాకారులు, కుమ్మరి, చేనేత, కమ్మరి, వడ్రంగి, రజకులు, నాయీ బ్రాహ్మణులు, మత్స్యకారులు, గీత కార్మికులు తదితర చేతివృత్తిదారులకు పెన్షన్‌తో పాటు వృత్తి పరికరాలు, ఆర్థిక సహాయం అందించాలని కోరారు. దివ్యాంగులకు సదరం ధ్రువీకరణ తేదీ నుంచి బకాయిలు చెల్లించాలని, వితంతువులు, వృద్ధుల పెండింగ్ పెన్షన్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సాకే కుళ్లాయప్ప, మాలవంతం, రాంప్రసాద్, కళాకారులు, చేతివృత్తిదారులు పాల్గొన్నారు.

## నేత్రదానంతో ఇద్దరి జీవితాల్లో వెలుగులు



రాప్తాడు, సెప్టెంబర్ 8; (అరుణ ప్రభ న్యూస్) : రాప్తాడు మండలం యర్రగుంటకు చెందిన పప్పూరు నరసింహారెడ్డి (73) మంగళవారం వృద్ధాప్యంతో మృతి చెందారు. విశ్వదీప సేవా సంఘం సభ్యులు నేత్రదానంపై కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించగా, వారు అంగీకరించడంతో నరసింహారెడ్డి నేత్రాలను సేకరించారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, అనంతపురం రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలోని డీవై కుల్లాయప్ప కంటి కేంద్రం టెక్నీషియన్ జి. రాఘవేంద్ర కార్నియాలను సేకరించారు. నేత్రదానానికి సహకరించిన కుటుంబ సభ్యులకు విశ్వదీప సేవా సంఘం ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం ఫౌండర్ కోళ్లమొరం చంద్రశేఖర్‌రెడ్డి, అధ్యక్షుడు గాజుల సురేష్, ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, కార్యదర్శి జుజారు రఘు, ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

# మారుమూల ఎల్లారెడ్డిపేటలో ఆధునిక వైద్యానికి చిరునామా.. అశ్విని ఆసుపత్రి

**నాలుగు దశాబ్దాలుగా వైద్య సేవలు..**
**అత్యాధునిక క్యాత్ ల్యాబ్‌తో గుండె చికిత్సలు**

**నాలుగు నెలల్లో 80 మందికి**
**అంజియోగ్రామ్.. 30 మందికి స్టంట్లు**

**అతితక్కువ ప్యాకేజీతో గుండె రోగులకు చికిత్స..**
**పలువురిని ప్రాణాపాయం నుంచి కాపాడిన వైద్య బృందం**



ఎల్లారెడ్డిపేట, అరుణప్రభ: రాజన్న సిరిసిల్ల జిల్లాలోని మారుమూల ప్రాంతమైన ఎల్లారెడ్డిపేటలో అత్యాధునిక వైద్య సేవలకు వేదికగా అశ్విని మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిలుస్తోంది. గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యాన్ని అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో నాలుగు దశాబ్దాలుగా సేవలందిస్తున్న అశ్విని ఆసుపత్రి.. కాలానుగుణంగా ఆధునిక వైద్య సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ ముందుకు సాగుతోంది.

### అత్యాధునిక క్యాత్ ల్యాబ్‌తో గుండె వైద్యం

ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన అత్యాధునిక క్యాత్ ల్యాబ్ ద్వారా గుండె సంబంధిత వ్యాధులకు ఆధునిక వైద్య సేవలు అందిస్తున్నారు. గుండెకు సంబంధించిన సమస్యలను సకాలంలో గుర్తించి, అవసరమైన చికిత్స అందించడం ద్వారా రోగులకు ప్రాణాపాయం నుంచి రక్షణ కల్పిస్తున్నట్లు ఆసుపత్రి వైద్యులు తెలిపారు. గుండె వైద్య నిపుణులు డాక్టర్ పరమేశ్వర్ రెడ్డి నేతృత్వంలోని వైద్య బృందం క్యాత్ ల్యాబ్ ద్వారా గుండె రోగులకు అవసరమైన పరీక్షలు, చికిత్సలు అందిస్తోంది.

### నాలుగు నెలల్లో 80 మందికి అంజియోగ్రామ్ పరీక్షలు

గత నాలుగు నెలల్లోనే అశ్విని ఆసుపత్రిలో 80 మంది గుండె వ్యాధి బాధితులకు అంజియోగ్రామ్ పరీక్షలు నిర్వహించినట్లు ఆసుపత్రి వైద్యులు డాక్టర్ గోవర్ధనం సత్యనారాయణ స్వామి, మేనేజింగ్ డైరెక్టర్ అభినయ్, గుండె వైద్యులు డాక్టర్ పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. అంజియోగ్రామ్ పరీక్షల ద్వారా గుండె రక్తనాళాల్లో ఉన్న బ్లాకులను గుర్తించి, రోగి పరిస్థితిని బట్టి తదుపరి చికిత్సను నిర్ణయిస్తున్నట్లు వారు వివరించారు.

### 30 మందికి గుండెలో స్టంట్లు

అంజియోగ్రామ్‌లో గుండె రక్తనాళాల్లో బ్లాకులు ఉన్నట్లు గుర్తించిన 30 మంది రోగులకు స్టంట్లు వేసినట్లు వైద్యులు వెల్లడించారు. అత్యవసర పరిస్థితుల్లో సకాలంలో చికిత్స అందించడంతో ప్రాణాపాయ స్థితిలో ఉన్న పలువురు రోగులను కాపాడి వారి ప్రాణాలను రక్షించగలిగామని తెలిపారు. గుండె రక్తనాళాల్లో బ్లాకులు ఉన్న రోగులకు అవసరమైన చికిత్సను అందించడంతో పాటు అతితక్కువ ప్యాకేజీ ద్వారా స్టంట్ చికిత్సను అందిస్తున్నట్లు వైద్యులు పేర్కొన్నారు. దీంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొనే గ్రామీణ ప్రాంత ప్రజలకు గుండె వైద్యం మరింత అందుబాటులోకి వస్తోందని తెలిపారు.

### సకాలంలో వైద్యం.. ప్రాణాలకు రక్షణ

గుండెపోటు వంటి అత్యవసర పరిస్థితుల్లో ప్రతి నిమిషం ఎంతో కీలకమని వైద్యులు పేర్కొంటున్నారు. గుండె రక్తనాళాల్లో బ్లాకులు ఏర్పడినప్పుడు ఆలస్యం చేయకుండా వైద్యులను సంప్రదించడం, అవసరమైన పరీక్షలు చేయించుకోవడం ద్వారా ప్రాణాపాయాన్ని తగ్గించవచ్చని సూచిస్తున్నారు. స్థానికంగానే క్యాత్ ల్యాబ్, గుండె వైద్య నిపుణుల సేవలు అందుబాటులో ఉండటంతో ఎల్లారెడ్డిపేటతో పాటు పరిసర మండలాల ప్రజలకు అత్యవసర గుండె వైద్యం చేరువైందని ఆసుపత్రి వర్గాలు చెబుతున్నాయి.

### ఆరోగ్యశ్రీతో డయాలసిస్ సేవలు

కిడ్నీ వైఫల్యంతో బాధపడుతున్న రోగులకు కూడా అశ్విని ఆసుపత్రి సేవలు అందిస్తోంది. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా డయాలసిస్ సేవలు అందుబాటులో ఉండటంతో పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భారం తగ్గుతోంది. స్థానికంగానే డయాలసిస్ సేవలు పొందే అవకాశం కల్పించడం ద్వారా దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన ఇబ్బందులను తగ్గిస్తోంది.

### నరాలు, ఎముకలు, కీళ్లకు ప్రత్యేక వైద్యం

నరాల సంబంధిత వ్యాధులతో పాటు ఎముకలు, కీళ్ల సమస్యలకు ప్రత్యేక వైద్య నిపుణులతో చికిత్స అందిస్తున్నారు. అవసరమైన సందర్భాల్లో శస్త్రచికిత్సలు నిర్వహిస్తూ మెరుగైన వైద్య సేవలను అందిస్తున్నారు. ముఖ్యంగా మోకాళ్ల మార్పిడి శస్త్రచికిత్సలు సహా ఆర్థోపెడిక్ విభాగంలో ఆధునిక చికిత్సా విధానాలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు ఆసుపత్రి నిర్వాహకులు తెలిపారు.

### పాము కాటు.. విషం తాగిన వారికీ అత్యవసర సేవలు

అత్యవసర వైద్య సేవల్లోనూ అశ్విని ఆసుపత్రికి స్థానికంగా ప్రత్యేక గుర్తింపు ఉంది. పాము కాటు, విష పదార్థాలు తీసుకోవడం వంటి అత్యవసర పరిస్థితుల్లో సకాలంలో చికిత్స అందించి పలువురి ప్రాణాలను కాపాడిన అనుభవం ఆసుపత్రికి ఉందని వైద్యులు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో అత్యవసర పరిస్థితుల్లో వెంటనే అందుబాటులో ఉండే వైద్యశాల ఎంతో అవసరమని, ఆ దిశగా అశ్విని ఆసుపత్రి నిరంతరం సేవలు అందిస్తోందని పేర్కొన్నారు.

### నాలుగు దశాబ్దాల సేవా ప్రస్థానం

అశ్విని ఆసుపత్రి వ్యవస్థాపకులు డాక్టర్ గోవర్ధనం సత్యనారాయణ స్వామి, ఆయన తనయుడు, ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ అభినయ్ సారథ్యంలో నాలుగు దశాబ్దాలుగా ఎల్లారెడ్డిపేట ప్రాంతంలో వైద్య సేవలు కొనసాగుతున్నాయి. కాలానుగుణంగా ఆధునిక వైద్య సాంకేతికతను అందిపుచ్చుకోవడంతో పాటు వివిధ వైద్య విభాగాలకు చెందిన నిపుణుల సేవలను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేస్తున్నామని వారు తెలిపారు.

### ఒకే చోట.. అనేక వైద్య సేవలు

గుండె వైద్యం, క్యాత్ ల్యాబ్ సేవలు, అంజియోగ్రామ్, స్టంట్ చికిత్సలతో పాటు కిడ్నీ రోగులకు డయాలసిస్, నరాల వ్యాధులు, ఎముకలు, కీళ్ల సమస్యలు, మోకాళ్ల మార్పిడి, అత్యవసర వైద్యం తదితర సేవలను అందుబాటులో ఉంచడం అశ్విని ఆసుపత్రి ప్రత్యేకతగా నిలుస్తోంది. మారుమూల ప్రాంతంలో ప్రారంభమైన ఆసుపత్రి నాలుగు దశాబ్దాల కాలంలో ఆధునిక వైద్య సేవలకు కేంద్రంగా ఎదగడం విశేషం. గత నాలుగు నెలల్లో 80 అంజియోగ్రామ్ పరీక్షలు, 30 స్టంట్ చికిత్సలు నిర్వహించినట్లు వైద్యులు వెల్లడించడం ద్వారా గుండె వైద్య విభాగంలో అందిస్తున్న సేవల విస్తృతిని తెలియజేస్తోంది. గ్రామీణ ప్రాంత ప్రజలకు అత్యాధునిక వైద్యం.. అందుబాటు ధరల్లో చికిత్స.. అత్యవసర వేళల్లో సకాలంలో వైద్య సేవలు --- ఈ లక్ష్యాలతో అశ్విని మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఎల్లారెడ్డిపేట ప్రాంత ప్రజలకు వైద్య భరోసాగా నిలుస్తోంది.

# నైపుణ్య శిక్షణతో విద్యార్థులకు స్వయం ఉపాధి అవకాశాలు

గూడూరు – (అరుణ ప్రభ న్యూస్ ): విద్యార్థులు నైపుణ్య శిక్షణను సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఎస్.కె. ఆర్. ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. రాం ప్రసాద్ సూచించారు. స్థానిక ఎస్.కె.ఆర్. ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులకు నైపుణ్య శిక్షణ కార్యక్రమాలపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కార్పొరేషన్, విజయవాడ మరియు కళాశాల నైపుణ్యాభివృద్ధి విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు అందుబాటులో ఉన్న వివిధ నైపుణ్య శిక్షణా అవకాశాలు, వాటి ద్వారా ఉపాధి మరియు స్వయం ఉపాధి పొందే మార్గాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ కె. రాం ప్రసాద్ మాట్లాడుతూ, ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్హతలతో పాటు వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకోవడం ఎంతో అవసరమని అన్నారు. విద్యార్థులు శిక్షణా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని తమ ప్రతిభను అభివృద్ధి చేసుకోవడంతో పాటు భవిష్యత్తులో స్వయం ఉపాధి పొందే దిశగా ముందుకు సాగాలని సూచించారు.ఈ కార్యక్రమంలో నిర్వాహకులు ఆంజనేయులు, కన్వీనర్ బి. శైలజ నిరుద్యోగులు, యువతకు అందుబాటులో ఉన్న వివిధ అవకాశాలను ఎలా వినియోగించుకోవాలనే అంశంపై పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ



కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎస్. కిరణ్మయి, అధ్యాపకులు శ్రీమతి ఎస్. మైమూస్, డాక్టర్ గోవిందు సురేంద్ర, వి.వి. రమణా రెడ్డి తదితర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# ఎమ్మెల్యే శంకర్‌పై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ ఫిర్యాదు

## ఎమ్మెల్సీ తాతా మధుపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ ఫిర్యాదు

అరుణప్రభ ప్రతినిధి, ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 08: ఎమ్మెల్యే వీర్ల శంకర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ నాయకులు, ఎమ్మెల్సీ తాతా మధుపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కాంగ్రెస్ నాయకులు మంగళవారం ఎల్లారెడ్డిపేట పోలీసులకు వేర్వేరుగా ఫిర్యాదులు చేశారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షులు వరుస కృష్ణహరి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు ఎల్లారెడ్డిపేట ఎస్సై రమేష్ గౌడ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మరణించాలని సీఎం రేవంత్‌రెడ్డి తన ఎమ్మెల్యే వీర్ల శంకర్‌తో మాట్లాడించారని ఆరోపిస్తూ, దీనిపై వెంటనే విచారణ జరిపి ఎమ్మెల్యే శంకర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. అదేవిధంగా అసెంబ్లీ సమావేశాల ప్రారంభ సమయంలో ఎమ్మెల్సీ తాతా మధు స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ కాంగ్రెస్ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షులు సూడిది రాజేందర్ ఆధ్వర్యంలో నాయకులు ఎస్సై రమేష్ గౌడ్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ తాతా మధుపై వెంటనే చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.



# ప్రగతి సేవా సంస్థ సేవలు అభినందనీయం

గూడూరు – (అరుణ ప్రభ న్యూస్ ): గూడూరు పట్టణంలో ప్రముఖ చార్టర్డ్ అకౌంటెంట్, శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ సీఏ రామ్మోహనరావు కార్యాలయంలో మంగళవారం ప్రత్యేక కార్యక్రమం జరిగింది. పేద విద్యార్థుల చదువుకు అండగా నిలవడం అభినందనీయమని ప్రగతి సేవా సంస్థ అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్ కొనియాడారు. విద్య, వైద్య రంగాల్లో పేదలకు సేవ చేయడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నట్లు సీఏ రామ్మోహనరావు తెలిపారు. ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో, కుప్పంలో ఫిజియోథెరపీ ద్వితీయ సంవత్సరం చదువుతూ కళాశాల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన అల్తాఫ్ కుమార్తె ఆయేషా విద్యాభ్యాసానికి ఆయన ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా రామ్మోహనరావు మాట్లాడుతూ... తమ తండ్రిగారు స్థాపించిన ఎస్.వి. రత్నం ఛారిటీస్' ద్వారా విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహిస్తున్నామని, రాబోయే రోజుల్లోనూ పేద విద్యార్థులకు తమ సహాయ సహకారాలు ఉంటాయని పేర్కొన్నారు. ఆయేషా భవిష్యత్తులో మంచి వైద్యురాలిగా ఎదిగి గూడూరు పట్టణ ప్రజలకు సేవలు అందించాలని ఆకాంక్షించారు. అనంతరం ప్రగతి సేవా సంస్థ అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ... దైవభక్తితో పాటు ప్రజాసేవను ఒక బాధ్యతగా భావించి విద్యార్థులకు చేయూతనందిస్తున్న రామ్మోహనరావు సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. భగవంతుడు ఆయనకు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రగతి సేవా కుటుంబ సభ్యులు వాచ్ షాపు రాము, కుమార్ నాయుడు, పయ్యావుల మురళి నాయుడు సందేపూడి రవికుమార్, ఎక్సైజ్ డిపార్ట్మెంట్ దయాకర్ ,కృష్ణారెడ్డి, సోనాలి సిల్వర్ ప్యారిస్ మల్లికార్జునరావు, విజయ్ నాగేంద్ర , తదితరులు పాల్గొన్నారు.

# వినాయక చవితిలోపు నేతన్న సేవా పథకం అమలు చేయాలి



ధర్మవరం, సెప్టెంబర్ 8; (అరుణ ప్రభ న్యూస్) : అర్హులైన చేనేత కార్మికులందరికీ నేతన్న సేవా పథకాన్ని వినాయక చవితిలోపు వర్తింపజేయాలని ఏపీ చేనేత కార్మిక సంఘం నాయకులు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను కోరారు. ఈ మేరకు మంత్రికి వినతిపత్రం అందజేశారు. ధర్మవరం డివిజన్‌తో పాటు జిల్లా వ్యాప్తంగా పలువురు అర్హులైన చేనేత కార్మికులకు పథకం అందలేదని తెలిపారు. రెండో విడతలో గుర్తించిన 33,600 మందికి పథకం అమలు చేస్తామని ఇచ్చిన హామీ నెరవేరలేదని పేర్కొన్నారు. స్పందించిన మంత్రి సత్యకుమార్ యాదవ్.. అర్హులైన ప్రతి చేనేత కార్మికుడికి పథకం అందేలా జౌళి శాఖ మంత్రి సవితతో ఫోన్‌లో మాట్లాడి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ జె.వి. రమణ, ఎస్.హెచ్. భాష, ఏ. ఖాదర్ భాషా, గుంపు హరి, వి. వెంకటస్వామి, లోకేష్, తిమ్మరాజు, బండి రామకృష్ణ, బొమ్మ శివప్రసాద్, అన్నం సూరి, సుధాకర్, గంగప్ప తదితరులు పాల్గొన్నారు.



# నేత్రదానంపై అవగాహన ర్యాలీ

ధర్మవరం, సెప్టెంబర్ 8; (అరుణ ప్రభ న్యూస్) : 41వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాల ముగింపు సందర్భంగా ధర్మవరంలో మంగళవారం నేత్రదానంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. ఎస్. ఫైరోజా బేగం ముఖ్య అతిథిగా పాల్గొని ర్యాలీని ప్రారంభించారు. డిప్యూటీ జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. జి. భాగ్యలక్ష్మి, జిల్లా అంధత్వ నివారణ అధికారి డా. అనురాధ, మాజీ అధికారి డా. ఎస్. నరసింహులు ఆధ్వర్యంలో స్వచ్ఛంద సంస్థల కేంద్రం నుంచి ప్రభుత్వ ఆసుపత్రి వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా నేత్రదానం ప్రాముఖ్యతను ప్రజలకు వివరించారు. మరణానంతరం నేత్రాలను దానం చేయడం ద్వారా ఇద్దరు అంధులకు చూపు ప్రసాదించవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ నేత్రదానంపై అవగాహన పెంచుకుని, ఇతరులను కూడా ప్రోత్సహించాలని అధికారులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డా. చెన్నారెడ్డి, కంటి వైద్య నిపుణుడు డా. రాముడు, డా. సురేష్ నాయక్, వైద్యాధికారులు, విజయ్‌కుమార్, ఉరుకుందప్ప, లక్ష్మీనారాయణ, మారుతి, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



# వృద్ధురాలిపై దుర్భాషల ఆరోపణ.. సీఐపై చర్యలు తీసుకోవాలి

ధర్మవరం, సెప్టెంబర్ 8; (అరుణ ప్రభ న్యూస్) : చీరాలలో గిరిజన వృద్ధురాలితో దురుసుగా ప్రవర్తించారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న టూటౌన్ సీఐ శశికుమార్‌పై ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసు నమోదు చేసి, సస్పెండ్ చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి దేవరకొండ రమేష్ డిమాండ్ చేశారు. ధర్మవరం పట్టణంలోని కేతిరెడ్డి కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 70 ఏళ్ల గిరిజన వృద్ధురాలి ఇంటికి వెళ్లి సీఐ దుర్భాషలాడినట్లు ఆరోపించారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలపై దాడులు పెరిగాయని ఆరోపించారు. మహిళలకు రక్షణ కల్పించడంలో విఫలమైన హోంమంత్రి అనిత రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఇటువంటి ఘటనలు పునరావృతమైతే పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎం. చౌడప్ప, కునుతూరు గోపాల్, గుజ్జల బొమ్మన్న, సాకే వెంకటేష్, ఎన్. గోపాల్‌నాయక్, పి. కుళ్లాయప్ప, వెంకటరమణస్వామి, పి. శ్రీనివాసులు, మల్లెల పెద్దన్న, గుజ్జల రామకృష్ణ, నామాల రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.




# బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో ఆధార్ కేంద్రం

ధర్మవరం, సెప్టెంబర్ 8; (అరుణ ప్రభ న్యూస్) : ధర్మవరం కొత్తపేటలోని బీఎస్ ఎన్ఎల్ కార్యాలయంలో నూతన ఆధార్ సేవా కేంద్రాన్ని ప్రారంభించారు. బీఎస్ ఎన్ఎల్ విభాగ ఇంజనీర్ నెనావత్, ఉపవిభాగ ఇంజనీర్ ఉదయ్‌కుమార్ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కేంద్రంలో కొత్త ఆధార్ నమోదు, చిరునామా సవరణ, మొబైల్ నంబర్ అనుసంధానం, జీవగుర్తింపు నవీకరణ, వేలిముద్రలు, నేత్రపటల గుర్తింపు, ఛాయాచిత్రం తదితర సేవలు అందుబాటులో ఉంటాయని అధికారులు తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు కేంద్రం పనిచేస్తుందని పేర్కొన్నారు. ప్రజలు అసలు గుర్తింపు, చిరునామా ధ్రువపత్రాలతో కేంద్రాన్ని సందర్శించి సేవలను సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు.

# స్పీకర్‌ను దూషించిన ఎమ్మెల్సీ తాతా మధు దిష్టిబొమ్మ దహనం

### కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా..

### తాతా మధు వ్యాఖ్యలను ఖండించిన నాయకులు





ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 08 (అరుణప్రభ): తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను ఎమ్మెల్సీ తాతా మధు దుర్భాషలాడారంటూ ఆరోపిస్తూ ఎల్లారెడ్డిపేట మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. మండల కేంద్రంలోని ప్రధాన ప్రాంతంలో కాంగ్రెస్ నాయకులు ధర్నా చేపట్టి, అనంతరం ఎమ్మెల్సీ తాతా మధు దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సూడిద రాజేందర్ మాట్లాడుతూ దళిత సామాజిక వర్గానికి చెందిన శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై ఎమ్మెల్సీ తాతా మధు అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని అన్నారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న స్పీకర్‌ను గౌరవించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ నాయకుల అహంకారం మితిమీరిపోయిందని సూడిద రాజేందర్ విమర్శించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఉన్నత పదవుల్లో ఉన్న వ్యక్తులపై వ్యక్తిగత దూషణలకు పాల్పడటం సరికాదని అన్నారు. స్పీకర్‌పై చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నాయకులు తాతా మధుకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సమయంలో ఎల్లారెడ్డిపేట ఎస్సై దిష్టిబొమ్మను లాక్కునే ప్రయత్నం చేయడంతో కొద్దిసేపు అక్కడ ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. పోలీసులు పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని అన్నారు. రాజకీయ విమర్శలు విధానాలపైనే ఉండాలని, వ్యక్తిగత దూషణలకు దారితీయకూడదని పేర్కొన్నారు. స్పీకర్‌ను అవమానించేలా వ్యాఖ్యలు చేసిన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు దొమ్మాటి నర్సయ్య, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గుండాటి రామ్‌రెడ్డి, నాయకులు షేక్ గౌస్, సద్ది లక్ష్మారెడ్డి, బాపురెడ్డి, గిరిధర్‌రెడ్డి, చరణ్‌గౌడ్, మధు, శ్రీనివాస్‌రెడ్డి, మరి శ్రీనివాస్‌రెడ్డి, బండారి బాల్‌రెడ్డి, శ్రీనివాస్, తిరుపతిగౌడ్, సంతోష్‌గౌడ్, మధుసూదన్‌రెడ్డి, మల్లారెడ్డి, నందికిషన్, రాజిరెడ్డి, శ్రీకాంత్, దేవానందం, చెన్నిబాబు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల టవర్స్ ధరావతు వాపస్

### అక్కౌంట్ నుంచి చెల్లిస్తే దాని ద్వారానే తిరిగి చెల్లింపు

### ఆ నియోజకవర్గాల్లో దరఖాస్తునకు రేపే ఆఖరు (సెప్టెంబర్ 10) తేదీ

### హౌసింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ శ్రీ వి.పి.గౌతం

హైదరాబాద్, సెప్టెంబరు 8 : ఇందిరమ్మఇండ్లు టవర్స్ పథకంలో దరఖాస్తుదారులు చెల్లించిన ధరావతు తిరిగి చెల్లింపు ప్రక్రియ ప్రారంభమైంది. హైదరాబాద్ క్యూర్ పరిధిలో నిర్మించనున్న ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ లో ఇండ్ల కోసం డిమాండ్ సర్వే ద్వారా ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించిన సంగతి తెలిసిందే. దరఖాస్తు సమయంలో ధరావతు (ఇఎండి) గా పదివేల రూపాయలను స్వీకరించారు. మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తుల స్వీకరణతో పాటు ఇఎండి మొత్తాన్ని కూడా పూర్తిగా ఆన్ లైన్ లోనే తీసుకున్నారు. ఈ ఇండ్ల కేటాయింపు లాటరీ ప్రక్రియ పూర్తి అయినందున, లాటరీలో ఎంపిక కాని దరఖాస్తు దారులకు ఇఎండి మొత్తాన్ని తిరిగి చెల్లిస్తున్నట్లు హౌసింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ శ్రీ విపి గౌతం తెలిపారు. దరఖాస్తు దారులు తాము ఏ అక్కౌంట్ నుంచి ఈ మొత్తాన్ని చెల్లించారో అదే అక్కౌంట్ కు జమ చేస్తున్నామన్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా ఎటువంటి దరఖాస్తులను సమర్పించాల్సిన అవసరం లేదని, వారం రోజుల్లో గా ఈ చెల్లింపుల ప్రక్రియ పూర్తి అవుతుందని వెల్లడించారు. అయితే కొంత మంది దరఖాస్తు దారులు, తాము ఆయా మీ సేవా కేంద్రాల్లో నగదు ద్వారా చెల్లించామని, లేదా ఇతరుల అక్కౌంట్ నుంచి చెల్లించామని ప్రభుత్వం దృష్టికి తీసుకుని వచ్చారు. ఇలా చెల్లించిన వారికి ఈ ధరావతు మొత్తం వారికే జమ అయ్యేలా చూడటానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇందుకోసం హౌసింగ్ బోర్డు అధికారిక వెబ్ సైట్ tghb.telangana.gov.in ద్వారా ఈ నెల 10 వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. లేని పక్షం లో ఏ అకౌంట్ ద్వారా చెల్లింపు జరిగిందో, అదే అకౌంట్ కు తిరిగి జమ అవుతుందని తెలిపారు.

**కొనసాగుతున్న వెరిఫికేషన్ ప్రక్రియ...కార్యాలయాల చుట్టూ తిరగవద్దు**

ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ లో లాటరీ ద్వారా ఎంపికైన వారి వివరాల పరిశీలన కొనసాగుతున్నదనీ, ఈ ప్రక్రియ పూర్తి కావడానికి మరికొన్ని రోజుల సమయం పడుతుందని వైస్ ఛైర్మన్ శ్రీ విపి గౌతం తెలిపారు. వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తి అయిన తరువాత అర్హులైన వారికి ఇండ్ల కేటాయింపు పత్రాలను (అలాట్మెంట్ లెటర్) అందచేస్తామన్నారు. ప్రతిపాదించిన 7340 ఇండ్లకు వెయిటింగ్ లిస్ట్ తో కలిపి సుమారు 10 వేల మందిని లాటరీ ద్వారా ఎంపిక చేసిన సంగతి తెలిసిందే. వారు సమర్పించిన వివరాల్లోని వాస్తవికతను క్షేత్రస్థాయిలో నిర్ధారించుకోడానికే వెరిఫికేషన్ ప్రక్రియ చేపడుతున్నారు. వెరిఫికేషన్ ప్రక్రియ తరువాత ఈ పథకం కింద లబ్ధిదారులు చెల్లించాల్సిన మొత్తాన్ని ఏ విధంగా, ఏ ఖాతాలో చెల్లించాలన్న దానిని అలాట్మెంట్ లెటర్ లో పొందు పరుస్తా మన్నారు. వెరిఫికేషన్ ప్రక్రియకు లాటరీలో ఎంపికైన వారు సహకరించాలని వైస్ ఛైర్మన్ కోరారు. ఈ ఇండ్లకు సంబంధించిన సమాచారం కోసం ప్రత్యేకంగా హౌసింగ్ బోర్డు కార్యాలయాలచుట్టూ తిరగాల్సిన అవసరం లేదని, వాట్సాప్/ఎస్ఎంఎస్ వంటి వాటి ద్వారా అవసరమైన సమాచారం అందిస్తున్నామని, ఇతరత్రా ఏమైనా సందేహాలుంటే కాల్ సెంటర్ కు ఫోన్ (నెం. 040 24603572) చేయవచ్చని ఆయన సూచించారు.

**నాలుగు నియోజకవర్గాల్లో దరఖాస్తులకు రేపే (10 సెప్టెంబర్ )ఆఖరు తేదీ**

ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ పథకంలో భాగంగా తొలుత 16 నియోజకవర్గాల నుంచి దరఖాస్తులను స్వీకరించి, లాటరీ ద్వారా ఇండ్లకేటాయింపు ప్రక్రియను కూడా పూర్తి చేయగా, మరో 4 నియోజకవర్గాల్లో ప్రస్తుతం దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతున్నది. చాంద్రాయణగుట్ట, ఎల్.బి.నగర్, ముషీరాబాద్, గోషామహల్ నియోజకవర్గాల పరిధిలో నిర్మించనున్న టవర్స్ లోని ఇండ్ల కోసం ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. ఈ దరఖాస్తులను ఈ నెల 10 వ తేదీ వరకు సమర్పించవచ్చనీ, ఈ నియోజకవర్గాల్లోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ఫిలిప్పీన్స్‌కు బియ్యం ఎగుమతులు, వాణిజ్యాన్ని పెంచాలని తెలంగాణ ప్రయత్నం: ఉత్తమ్



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 8, 2026: తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల, ఆహార మరియు పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి మంగళవారం న్యూఢిల్లీలో ఫిలిప్పీన్స్ వ్యవసాయ శాఖ కార్యదర్శి, ఆ దేశ క్యాబినెట్ సభ్యుడు శ్రీ ఫ్రాన్సిస్కో పి. టు లారెల్ జూనియర్‌తో సమావేశమయ్యారు. (ఫిలిప్పీన్స్‌లో శ్రీ ఫ్రాన్సిస్కో పి. టు లారెల్ జూనియర్ నిర్వహిస్తున్న పదవి, భారతదేశంలో నీటిపారుదల, వ్యవసాయం మరియు ఆహార శాఖల బాధ్యతలు నిర్వహించే కేంద్ర క్యాబినెట్ మంత్రి హోదాకు సమానం.) తెలంగాణ నుంచి బియ్యం ఎగుమతులను పెంచడంతోపాటు తెలంగాణ--ఫిలిప్పీన్స్ మధ్య వాణిజ్యాన్ని మరింత విస్తరించే అవకాశాలపై ఇరువురు నేతలు వివరణాత్మకంగా చర్చించారు. భారతదేశంలో అత్యధికంగా వరి పండించే రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటిగా అవతరించిందని ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు. భారీ పరిమాణంలో నాణ్యమైన బియ్యాన్ని సరఫరా చేయగల ఉత్పత్తి సామర్థ్యం, ఆధునిక రైస్ మిల్లింగ్ వ్యవస్థ, అవసరమైన అనుభవం తెలంగాణకు ఉన్నాయని తెలిపారు. తెలంగాణ నుంచి బియ్యం దిగుమతి చేసుకోవాలనే ప్రతిపాదనపై కార్యదర్శి లారెల్ సానుకూలంగా స్పందించారు. తెలంగాణ నుంచి మరింత పెద్ద పరిమాణంలో బియ్యాన్ని కొనుగోలు చేసే అవకాశాలను పరిశీలిస్తామని ఆయన తెలిపారు. సంబంధిత ప్రభుత్వ సంస్థలు, గుర్తింపు పొందిన దిగుమతిదారులు, ఎగుమతిదారులు, రైస్ మిల్లర్ల భాగస్వామ్యంతో ఈ ప్రతిపాదనను ముందుకు తీసుకెళ్లే విధానంపై చర్చించారు. ఫిలిప్పీన్స్‌కు దిగుమతి చేసుకునే బియ్యం అవసరం గణనీయంగా ఉండటం, అంతర్జాతీయంగా బియ్యం సరఫరా చేసే దేశాల సంఖ్యను విస్తరించేందుకు ఆ దేశం ప్రయత్నిస్తుండటం నేపథ్యంలో ఈ చర్చలకు ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది. పోటీ ధరలు, విశ్వసనీయమైన నాణ్యత, నిర్ణీత సమయంలో సరఫరా చేయగల సామర్థ్యంతో తెలంగాణ దీర్ఘకాలిక భాగస్వామిగా నిలవగలదని ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. బియ్యం రకాలు, ధరలు, నాణ్యతా ప్రమాణాలు, కొనుగోలు విధానాలు, రవాణా, ధ్రువీకరణ ప్రక్రియలు, శానిటరీ మరియు ఫైటోశానిటరీ నిబంధనలపై కూడా ఇరువురు చర్చించారు. ఈ అంశాలను సంబంధిత అధికారులు, పరిశ్రమ ప్రతినిధులు పరిశీలించి, వాణిజ్య అవకాశాలను కార్యరూపంలోకి తీసుకురావడానికి స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని నిర్ణయించారు. తెలంగాణ నుంచి మాంస ఉత్పత్తులు, నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేయడంపైనా కార్యదర్శి లారెల్ ఆసక్తి వ్యక్తం చేశారు. దీనిని స్వాగతించిన ఉత్తమ్ కుమార్ రెడ్డి, విత్తనోత్పత్తి, ఆహార శుద్ధి, వ్యవసాయ అనుబంధ రంగాల్లో తెలంగాణకు బలమైన సామర్థ్యం ఉందన్నారు. ఎగుమతికి అనువైన ఉత్పత్తులు, నాణ్యతా ప్రమాణాలు, అనుమతులు, ఇతర నియంత్రణ నిబంధనలను సంబంధిత ప్రభుత్వ సంస్థలు, ప్రైవేటు రంగ ప్రతినిధులతో కలిసి పరిశీలిస్తామని తెలిపారు. అంతర్జాతీయ మార్కెట్లలో తెలంగాణ వ్యవసాయ ఉత్పత్తులకు అవకాశాలు కల్పించడం వల్ల రైతులు, రైస్ మిల్లర్లు, విత్తన కంపెనీలు, ఆహార శుద్ధి పరిశ్రమలు, గ్రామీణ ఆర్థిక వ్యవస్థలోని ఇతర వర్గాలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని మంత్రి చెప్పారు. “తెలంగాణ రైతులు, వ్యవసాయ పరిశ్రమలకు స్థిరమైన, లాభదాయకమైన అంతర్జాతీయ మార్కెట్లను సృష్టించడమే మా లక్ష్యం. ఫిలిప్పీన్స్‌కు బియ్యం, విత్తనాలు, ఇతర వ్యవసాయ ఉత్పత్తులను దీర్ఘకాలంపాటు విశ్వసనీయంగా సరఫరా చేయగల ఉత్పత్తి సామర్థ్యం, మౌలిక సదుపాయాలు, పారిశ్రామిక నైపుణ్యం తెలంగాణకు ఉన్నాయి” అని ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. భారత్--ఫిలిప్పీన్స్ సంబంధాలు, ఆహార భద్రత, వ్యవసాయ సహకారం, తెలంగాణ నుంచి ఫిలిప్పీన్స్‌కు ప్రత్యక్ష వాణిజ్యాన్ని పెంచే అవకాశాలపై కూడా ఇరువురు విస్తృతంగా చర్చించారు. భారత్--ఫిలిప్పీన్స్ మధ్య అభివృద్ధి చెందుతున్న వ్యూహాత్మక భాగస్వామ్యంలో వ్యవసాయం, ఆహార వాణిజ్యం కీలక పాత్ర పోషించగలవని అభిప్రాయపడ్డారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి, కార్యదర్శి లారెల్ తమ తమ ప్రాంతాలను సందర్శించాల్సిందిగా పరస్పరం ఆహ్వానించుకున్నారు. 2026 డిసెంబర్‌లో నిర్వహించనున్న తెలంగాణ రైజింగ్ సమ్మిట్‌లో పాల్గొనేందుకు హైదరాబాద్ రావాల్సిందిగా కార్యదర్శి లారెల్‌కు ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రత్యేక ఆహ్వానం అందించారు. చర్చించిన అంశాలను కొనసాగిస్తూ వ్యవసాయం, బియ్యం మరియు ఆహార ఉత్పత్తుల వాణిజ్యం, విత్తనాభివృద్ధి, అనుబంధ రంగాల్లో సహకారాన్ని మరింత బలోపేతం చేయాలని ఇరువురు నిర్ణయించారు. ఈ ప్రతిపాదనలను ముందుకు తీసుకెళ్లేందుకు తెలంగాణ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం, ఫిలిప్పీన్స్ రాయబార కార్యాలయం, సంబంధిత ఫిలిప్పీన్స్ సంస్థలు, ప్రైవేటు రంగ ప్రతినిధులతో సమన్వయం చేసుకుంటుందని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.



## బతుకమ్మ యంగ్ ఫిలిం మేకర్స్ ఛాలెంజ్‌ను సద్వినియోగం చేసుకోండి: మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

హైదరాబాద్: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ పండుగను ప్రపంచవ్యాప్తంగా ప్రచారం చేయడంతో పాటు యువతలోని సృజనాత్మక ప్రతిభను వెలికితీసేందుకు నిర్వహిస్తున్న ‘బతుకమ్మ యంగ్ ఫిలిం మేకర్స్ ఛాలెంజ్-2026’ను యువ ఫిలిం మేకర్స్ సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆయన ఎమ్మెల్సీ శంకర్ నాయక్, ఎఫ్‌డీసీ ఎండీ జి. ముకుంద రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ క్రియేటివ్ డైరెక్టర్ రాజ్ కొండా, సెట్విన్ మాజీ చైర్మన్ గిరిధర్ రెడ్డిలతో కలిసి ఛాలెంజ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. షార్ట్‌ఫిలింలు, పాటలు, వీడియోల ద్వారా యువత తమ ప్రతిభను ప్రదర్శించేందుకు ఈ ఛాలెంజ్ మంచి వేదికగా నిలుస్తుందన్నారు. బతుకమ్మ విశిష్టత, తెలంగాణ సంస్కృతి, జానపద కళలు, సంప్రదాయాలతో పాటు ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సృజనాత్మకంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఇది దోహదపడుతుందని తెలిపారు. యువ ఫిలిం మేకర్స్, విద్యార్థులు, ఔత్సాహిక కళాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఛాలెంజ్‌ను విజయవంతం చేయాలని మంత్రి కోరారు.



## గూడెంలో అభివృద్ధి పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 08 (అరుణప్రభ న్యూస్): ముస్తాబాద్ మండలంలోని గూడెం గ్రామంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మంగళవారం పరిశీలించారు. గ్రామంలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. గూడెం గ్రామంలో ఆరు బ్లాకుల్లో మొత్తం 48 జీం1 విధానంలోని ఇందిరమ్మ ఇళ్లను నిర్మిస్తున్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా ఆయా ఇళ్లను పరిశీలించిన కలెక్టర్.. ప్రస్తుతం ఎన్ని కుటుంబాలు నివాసం ఉంటున్నాయి, ఇళ్లలో కల్పించిన మౌలిక సదుపాయాలు, తాగునీరు తదితర సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం డీఎంఎఫ్టీ నిధులతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను కలెక్టర్ పరిశీలించారు. అలాగే ఎంపీ ల్యాడ్స్ నిధులతో ఏర్పాటు చేసిన బోర్‌ను ఆమె ప్రారంభించారు. గ్రామ ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ వెంకట మాధవరావు, డీఈ సాజిద్, తహసీల్దార్ ఫారూఖ్, ఎంపీడీఓ లచ్చాలు తదితర అధికారులు పాల్గొన్నారు.



## కామ్రేడ్ పల్లా సుధీర్ రెడ్డి అంత్యక్రియల్లో పాల్గొన్న దిండి మండల సిపిఐ నాయకులు

అరుణ ప్రభ, దేవరకొండ డివిజన్, సెప్టెంబర్ 8 ,సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ పల్లా నరసింహారెడ్డి కుమారుడు పల్లా సుధీర్ రెడ్డి హైదరాబాద్ హాస్పిటల్ లో చికిత్స పొందుతూ సోమవారం మరణించారు.వారి స్వగ్రామము పడమటిపల్లి గ్రామంలో మంగళవారం నిర్వహించిన అంత్యక్రియల్లో దిండి మండల సిపిఐ నాయకులు పాల్గొని సుధీర్ రెడ్డి మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.సుధీర్ రెడ్డి మృతి పట్ల తీవ్ర సంతాపాన్ని వెలిబుచ్చారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తూము బుచ్చిరెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు బొడ్డుపల్లి వెంకటరమణ, జిల్లా రైతు సంఘం అధ్యక్షులు మైనద్దీన్, సిపిఐ దిండి మండల కార్యదర్శి కనకాచారి, సహాయ కార్యదర్శి శైలేష్, విజయేందర్ రెడ్డి, ఎనమల్ల నవీన్, సోమిడి శ్రీను, బొడ్డుపల్లి రవీందర్ శర్మ, తదితరులు పాల్గొని తమ సంతాపాన్ని వెలిబుచ్చారు.

# మీడియాపై ఆంక్షలు సరైంది కాదు

## ఆలోచనను విరమించుకోవాలి- TUWJ

శాసన సభ సమావేశాల కవరేజికి వెళ్లే మీడియాపై ఆంక్షలు విధించడం సరైంది కాదని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (ఖఔజే) రాష్ట్ర అధ్యక్షులు కె. విరాహత్ అలీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రాంనారాయణలు అన్నారు. శాసన సభలో మీడియా ఒక భాగమనే విషయాన్ని మరచిపోవద్దని వారు పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో మీడియా పాత్రను మన రాజ్యాంగ పెద్దలు గుర్తించినందునే, చట్ట సభల్లో మీడియా కవరేజికి ఒక గ్యాలరీని రిపోర్ట్ చేయడానికి ఏర్పాటు చేయడం అందులో భాగమే అని వారు తెలిపారు. అవసరమైనప్పుడు ముఖ్యమంత్రిని, మంత్రులను, ఎమ్మెల్యేలను కలువడం కూడా ఆనవాయితీగా కొనసాగుతుందన్నారు. అలాంటిది మన శాసన సభలో మీడియాపై ఆంక్షలు పెరుగుతున్నాయన్న భావన రావడం మంచిది కాదని వారు పేర్కొన్నారు. ఈ భావనను తొలగించడానికి గాను తగిన చర్యలు చేపట్టడానికి, శాసన సభ వ్యవహారాల మంత్రి డి.శ్రీధర్ బాబు వెంటనే చొరవ తీసుకొని, మీడియా అడ్వైజరీ కమిటీతో చర్చించి సమస్యను పరిష్కరించాలని వారు విజ్ఞప్తి చేసారు. ప్రజాస్వామ్యయుతంగా కార్యకలాపాలు నిర్వహించడానికి, మీడియా స్వేచ్ఛకి అడ్డంకులు ఉండబోవని, ప్రభుత్వ బాధ్యతలు చేపట్టిన వెంటనే ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఇచ్చిన భరోసాను ఈ సందర్భంగా గుర్తుచేస్తున్నట్లు విరాహత్ అలీ, రాంనారాయణలు పేర్కొన్నారు.

# గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించాలి

## మండపాల నిర్వాహకులు నిబంధనలు కచ్చితంగా పాటించాలి: ఎస్పీ మహేష్ బి. గితే



అరుణప్రభ న్యూస్ – ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 8: రాజన్న సిరిసిల్ల జిల్లాలో గణేష్ నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు మండపాల నిర్వాహకులు పోలీస్ శాఖకు పూర్తి సహాయ సహకారాలు అందించాలని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే సూచించారు. గణేష్ ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. సిరిసిల్ల పట్టణ పరిధిలోని పద్మనాయక ఫంక్షన్ హాల్‌లో మంగళవారం గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, మండపాల నిర్వాహకులు, స్థానిక కౌన్సిలర్లతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గణేష్ ఉత్సవాల నిర్వహణకు సంబంధించి పోలీస్ శాఖ సూచనలు, నిబంధనలు, భద్రతా చర్యలను ఎస్పీ వివరించారు.

### గణేష్ పోర్టల్‌లో మండపాల నమోదు తప్పనిసరి

జిల్లాలో గణేష్ మండపాలను ఏర్పాటు చేసే ప్రతి నిర్వాహకుడు గణేష్ పోర్టల్--2026లో తమ మండపానికి సంబంధించిన పూర్తి వివరాలను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని ఎస్పీ సూచించారు. ఇందుకోసం పోలీస్ శాఖ రూపొందించిన పోర్టల్‌లో వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. ప్రజా రవాణాకు, అత్యవసర సేవల వాహనాల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా మండపాలను ఏర్పాటు చేసుకోవాలని స్పష్టం చేశారు. రోడ్లను పూర్తిగా ఆక్రమించే విధంగా మండపాలు ఏర్పాటు చేయరాదని సూచించారు.

### మండపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

ప్రతి గణేష్ మండపం వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్పీ తెలిపారు. మండపాలన్నింటినీ జియో ట్యాగింగ్ చేయనున్నట్లు వెల్లడించారు. మండపాల వద్ద 24 గంటలూ వాలంటీర్లు అందుబాటులో ఉండేలా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని సూచించారు. మండపాల వద్ద నిర్వహించే కార్యక్రమాలకు పూర్తి బాధ్యత నిర్వాహకులదేనని ఆయన స్పష్టం చేశారు. పోలీస్ అధికారులు, బ్లూకోల్ట్ సిబ్బంది మండపాలను తరచూ సందర్శిస్తూ పరిస్థితులను పర్యవేక్షిస్తారని తెలిపారు.

### 10 అడుగులకు మించిన విగ్రహాలకు ముందస్తు సమాచారం

గణేష్ విగ్రహాల ఆగమన సమయంలో విగ్రహం ఎత్తు 10 అడుగులకు మించి ఉంటే ముందుగానే పోలీస్ శాఖకు సమాచారం అందించాలని ఎస్పీ సూచించారు. భారీ విగ్రహాల తరలింపు సమయంలో విద్యుత్ తీగలు, ట్రాఫిక్ తదితర అంశాలను దృష్టిలో ఉంచుకుని తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.

### నిమజ్జనం రోజున నిబంధనలు పాటించాలి

నిమజ్జనం రోజున గణేష్ మండపాల నుంచి నేరుగా పోలీస్ శాఖ నిర్దేశించిన నిమజ్జన ప్రదేశానికి వెళ్లాలని ఎస్పీ సూచించారు. నిర్దేశించిన సమయానికి నిమజ్జనం పూర్తి చేయాలని తెలిపారు. సిరిసిల్ల మానేరు తీరంలో ఏర్పాటు చేయనున్న నిమజ్జన ప్రదేశంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని, సరిపడా క్రేన్లను అందుబాటులో ఉంచనున్నట్లు చెప్పారు.



### మండపాలు, శోభాయాత్రల్లో డీజేలకు నో

గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మండపాల వద్ద, శోభాయాత్రలో, నిమజ్జనం రోజున డీజేలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి లేదని ఎస్పీ మహేష్ బి. గితే స్పష్టం చేశారు. అనుమతి లేకుండా డీజేలను వినియోగిస్తే డీజే నిర్వాహకులతో పాటు సంబంధిత గణేష్ మండపాల నిర్వాహకులపైనా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా రాత్రి 10 గంటల వరకు మాత్రమే రెండు చిన్న స్పీకర్లను వినియోగించాలని సూచించారు.

### మద్యం, అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు

గణేష్ మండపాల వద్ద మద్యం సేవించడం, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడటం వంటి వాటిని ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమని ఎస్పీ తెలిపారు. ఇలాంటి చర్యలకు పాల్పడే వ్యక్తులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అదేవిధంగా మండపాల వద్ద జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలను నియంత్రించడంలో నిర్వాహకులు నిర్లక్ష్యం వహించినా వారిపైనా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

### సోషల్ మీడియాపై ప్రత్యేక నిఘా

గణేష్ ఉత్సవాల నేపథ్యంలో సోషల్ మీడియాలో వచ్చే పోస్టులపై జిల్లా పోలీస్ శాఖ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయనున్నట్లు ఎస్పీ తెలిపారు. సామాజిక మాధ్యమాల్లో విద్వేషాలు రెచ్చగొట్టేలా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా పోస్టులు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాస్తవాలను తెలుసుకోకుండా వివాదాస్పదమైన పోస్టులను ఫార్వర్డ్ చేసే వారిపైనా క్రిమినల్ కేసులు నమోదు చేసే అవకాశం ఉందని తెలిపారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా సోషల్ మీడియాను వినియోగించాలని సూచించారు.

### గత ఏడాది 8 కేసులు నమోదు

గత ఏడాది గణేష్ నిమజ్జనం సందర్భంగా జిల్లా ప్రజలు పోలీస్ శాఖకు సహకరించారని ఎస్పీ పేర్కొన్నారు. అయితే జిల్లాలో అక్కడక్కడ ఇబ్బందులకు పాల్పడిన వ్యక్తులపై 8 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈ ఏడాది మరింత పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపడుతున్నామని వెల్లడించారు. గణేష్ ఉత్సవాలు భక్తి, ఆనందంతో జరుపుకునే పండుగ అని, అన్ని వర్గాల ప్రజలు పరస్పరం సహకరించుకుంటూ శాంతియుతంగా వేడుకలను నిర్వహించాలని ఎస్పీ కోరారు. పోలీస్ శాఖ సూచనలు, నిబంధనలను ప్రతి మండపం నిర్వాహకుడు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఈ సమన్వయ సమావేశంలో డీఎస్పీ నాగేంద్రచారి, సీఐలు శ్రీనివాస్, నాగేశ్వరరావు, వెంకటేష్, పోలీస్ సిబ్బంది, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, మండపాల నిర్వాహకులు, స్థానిక కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

# హామీలు అమలు చేయాలి.. బీఆర్ఎస్ నిరసన

## అంబేద్కర్‌కు వినతిపత్రం అందజేసిన తోట ఆగయ్య



ఎల్లారెడ్డిపేట అరుణప్రభ ప్రతినిధి । సిరిసిల్ల, సెప్టెంబర్ 08: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీలను అమలు చేయడంలో విఫలమైందని బీఆర్ఎస్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య ఆరోపించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు వారం రోజులుగా నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో నిరసన చేపట్టి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తోట ఆగయ్య మాట్లాడుతూ.. సెప్టెంబర్ 1 నుంచి మంగళవారం వరకు జిల్లాలోని పట్టణాలు, గ్రామాల్లో నిర్వహించిన నిరసన కార్యక్రమాలకు ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందనే విషయాన్ని ప్రజల ముందుకు తీసుకెళ్లామని తెలిపారు. ఆరు గ్యారంటీలు, 420 హామీలను అమలు చేయడంతో పాటు ప్రజల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అంబేద్కర్‌కు వినతిపత్రం అందజేశామని చెప్పారు. ఈ విషయంపై ప్రభుత్వానికి కనువిప్పు కలగాలని, జ్ఞానోదయం కలగాలని కోరుకున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అసెంబ్లీకి వెళ్లకుండా పోలీసులు అడ్డుకోవడం దారుణమన్నారు. మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు దురుసుగా వ్యవహరించడాన్ని తీవ్రంగా ఖండించారు. మహిళా ఎమ్మెల్యేలపై అనుచితంగా వ్యవహరించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### హామీలు అమలు చేసి చూపించాలి

ఇచ్చిన హామీలను అమలు చేస్తే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అసెంబ్లీకి వస్తారని, దమ్ముంటే కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను అమలు చేసి చూపించాలని తోట ఆగయ్య సవాల్ చేశారు. వారం రోజుల పాటు నిర్వహించిన నిరసన కార్యక్రమాల్లో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని తమ సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారని తెలిపారు. అసెంబ్లీకి బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు రాకుండా అడ్డుకోవడం, పోలీసులు పాశవికంగా వ్యవహరించడం సరికాదన్నారు. మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసుల తీరు సిగ్గుచేటని, హేయమైనదని విమర్శించారు. అసెంబ్లీ తీరు కౌరవుల సభను తలపిస్తోందని ఆయన వ్యాఖ్యానించారు. కేసీఆర్‌ను చావాలని కోరుకున్న కాంగ్రెస్ ఎమ్మెల్యేల వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. కేసీఆర్‌పై ఈగ వాలినా తెలంగాణ సమాజం ఊరుకోదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాప్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్ రావు, రాష్ట్ర కార్యదర్శి గూడూరు ప్రవీణ్, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, మున్సిపల్ చైర్మన్ జిందం కళా చక్రపాణి, మాజీ జెడ్పీ చైర్మన్ తుల ఉమ, పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, మున్సిపల్ కౌన్సిలర్లు, వివిధ గ్రామాల సర్పంచులు, మండలాల పార్టీ అధ్యక్షులు, సెస్ డైరెక్టర్లు, ప్యాక్స్ చైర్మన్లు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మహిళా ఉద్యోగులు ఉన్న అసెంబ్లీలో చొక్కాలు విప్పుకుని అసభ్యంగా ప్రవర్తించడం సిగ్గుచేటు

## ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



అరుణ ప్రభ పాలకుర్తి సెప్టెంబర్ : పాలకుర్తి మండలం తెలంగాణ అసెంబ్లీలో చోటుచేసుకున్న పరిణామాలపై తెలంగాణ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ ఆధ్వర్యంలో మహిళా ఎమ్మెల్యేలు తెలంగాణ మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పాలకుర్తి శాసనసభ్యురాలు మామిడాల యశస్విని రెడ్డి సహచర మహిళా ఎమ్మెల్యేలతో కలిసి మహిళా కమిషన్‌ను కలిసి ఫిర్యాదు సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి దేవాలయంగా భావించే అసెంబ్లీ ప్రాంగణంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వ్యవహరించిన తీరు తీవ్రంగా బాధించిందని,ముఖ్యంగా మహిళా ఉద్యోగులు, మహిళా ప్రజాప్రతినిధులు ఉన్న ప్రదేశంలో చొక్కాలు విప్పుకుని బహిరంగంగా నిరసన వ్యక్తం చేయడం ఏమాత్రం సమర్థనీయం కాదని,ఇది అత్యంత సిగ్గుచేటైన ఘటన అని,అసెంబ్లీ వంటి అత్యున్నత ప్రజాస్వామ్య వేదికపై సభ్యులు తమ నిరసనను ప్రజాస్వామ్య పద్ధతుల్లో వ్యక్తం చేయాలని,కానీ హద్దులు దాటి అసభ్యకరంగా ప్రవర్తించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని,అదేవిధంగా శాసనసభ స్పీకర్‌ను అసభ్యకరమైన పదజాలంతో దూషించడం మరింత బాధ కలిగించిందని,సభకు అధ్యక్షత వహించే స్పీకర్ పదవికి గౌరవం ఇవ్వాల్సిన బాధ్యత ప్రతి ఒక్క శాసనసభ్యుడిపై ఉందని,రాజకీయ విభేదాలు ఉన్నప్పటికీ వ్యక్తిగత దూషణలకు దిగడం సరైన పద్ధతి కాదని,మహిళల గౌరవం, భద్రతకు సంబంధించిన అంశాలను తేలికగా తీసుకోకూడదని,అసెంబ్లీలో జరిగిన ఈ ఘటనపై సమగ్రంగా విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని,మహిళా సాధికారత, మహిళల గౌరవం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని,మహిళలను అవమానించే ఎలాంటి ప్రవర్తననైనా సహించేది లేదని యశస్విని రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణతో పాటు పలువురు మహిళా ఎమ్మెల్యేలు పాల్గొని,అసెంబ్లీలో చోటుచేసుకున్న ఘటనపై మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేశారు.



# సెప్టెంబర్ 10న 'చలో హైదరాబాద్'.. ఉద్యోగ-పెన్షనర్ల సమస్యలపై మహాధర్నా

హైదరాబాద్, అరుణ ప్రభ, సెప్టెంబర్ 8: తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులు, గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం టీజీఈజేఏసీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 10న 'చలో హైదరాబాద్--మహాధర్నా' నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా హైదరాబాద్ నగర శాఖ ఆధ్వర్యంలో లంచ్ అవర్ డెమాన్‌స్ట్రేషన్ కార్యక్రమం నిర్వహించి, ఉద్యోగులు--పెన్షనర్ల దీర్ఘకాలిక సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు.

### ప్రధాన డిమాండ్లు ఇవే..

ఉద్యోగులు, పెన్షనర్లకు సంబంధించిన పలు కీలక డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని టీజీఈజేఏసీ నాయకులు కోరుతున్నారు. ముఖ్యంగా రెండో పీఆర్సీ అమలు, పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏల విడుదల, సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించడం, జీపీఎఫ్ బకాయిల చెల్లింపు, ఈహెచ్ఎస్ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయడం వంటి డిమాండ్లను ప్రభుత్వం ముందుంచారు. అలాగే ఉద్యోగులు, పెన్షనర్లకు పెండింగ్‌లో ఉన్న బిల్లులు, ఇతర ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలని, ఉద్యోగుల ఆరోగ్య పథకంలో ఉన్న సాంకేతిక సమస్యలను పరిష్కరించి సులభంగా వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

### సెప్టెంబర్ 10న భారీగా తరలిరావాలని పిలుపు

ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం పెద్ద సంఖ్యలో చలో హైదరాబాద్ కార్యక్రమానికి తరలివచ్చి మహాధర్నాను విజయవంతం చేయాలని టీజీఈజేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి, ఉద్యోగులు--పెన్షనర్ల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని వారు కోరారు.



# అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రేషన్ డీలర్‌కు పరామర్శ

## మానవత్వంతో అండగా నిలిచిన మాజీ మంత్రి ఎర్రబెల్లి

అరుణ ప్రభ పాలకుర్తి సెప్టెంబర్ : పాలకుర్తి మండల కేంద్రానికి చెందిన రేషన్ డీలర్ ఎడవెల్లి దయాకర్ అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరగా, ఆయనకు బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో ప్రస్తుతం కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు గారు ఆసుపత్రికి వెళ్లి ఎడవెల్లి దయాకర్ ని పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకుని, అందిస్తున్న చికిత్స, ఆరోగ్య పరిస్థితిపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం వైద్యులకు పలు సూచనలు చేస్తూ, మెరుగైన వైద్యం అందించి త్వరగా కోలుకునేలా చూడాలని కోరారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడుతూ, ఎడవెల్లి దయాకర్ త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకుని తిరిగి మన మధ్యకు రావాలని ఆకాంక్షించారు. ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడం.. ఆత్మీయతను చాటడం.. ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామి కావడం. ఎర్రబెల్లి దయాకర్ రావు గారి ప్రత్యేకతఅని అన్నారు.



# నారాయణఖేడ్‌లో జర్నలిస్టు నాయకులకు ఘన సన్మానం

నారాయణఖేడ్‌లో తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్--ఐజేయూ నూతనంగా ఏకగ్రీవంగా ఎన్నికైన నారాయణఖేడ్ నియోజకవర్గ కమిటీ సభ్యులను శుభం ఆసుపత్రి యాజమాన్యం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శుభం ఆసుపత్రి యాజమాన్య ప్రతినిధులు కే. శేఖర్, అబ్దుల్ రౌఫ్, వైద్యులు రాజేష్, ఫిజిషియన్, అత్యవసర వైద్య నిపుణులు, క్లినికల్ కార్డియాలజిస్టు సందీప్, ఆర్థోపెడిక్ శస్త్రచికిత్స నిపుణురాలు మేఘనా తదితరులు జర్నలిస్టు నాయకులను శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. జర్నలిస్టుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని భవిష్యత్తులో జర్నలిస్టులకు ఆరోగ్య కార్డులు అందజేస్తామని ఆసుపత్రి యాజమాన్యం హామీ ఇచ్చింది. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు సయ్యద్ ఆసిఫ్, జిల్లా ఉపాధ్యక్షుడు ఈ. వెంకటేశం, జిల్లా సంయుక్త కార్యదర్శి అబ్దుల్ రౌఫ్, కార్యవర్గ సభ్యుడు హసీబ్ పటేల్, నారాయణఖేడ్ నియోజకవర్గ గౌరవ అధ్యక్షుడు హలీం, అధ్యక్షుడు జి. సత్యం, ప్రధాన కార్యదర్శి కే. భూమయ్య, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు బి. రాములు, ప్రధాన కార్యదర్శి జావీద్, ఉపాధ్యక్షులు జి. విఠల్, సంగప్ప, అశోక్, నిసార్, కోశాధికారి నాథేక్, సంయుక్త కార్యదర్శులు అంజయ్య, రషీద్, ఫహీం, అంబదాస్, మాణిక్ తదితర జర్నలిస్టులు పాల్గొన్నారు. నూతనంగా ఎన్నికైన జర్నలిస్టు నాయకులకు సన్మానం చేయడంతో పాటు, జర్నలిస్టుల సంక్షేమానికి ఆరోగ్య కార్డులు అందిస్తామని హామీ ఇవ్వడం పట్ల జర్నలిస్టులు శుభం ఆసుపత్రి యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.

# 'ఆత్మహత్యల' రహిత భారత్‌ను నిర్మిద్దాం

**"సమస్యలనేవి జీవితంలో ఒక భాగం మాత్రమే .జీవితమే సమస్య కాదు. నిన్ను నువ్వు తక్కువ అంచనా వేసుకోకు.ధైర్యంగా ముందుకు సాగు " -స్వామి వివేకానంద**



మనిషి "జీవితంలో "అనుకున్న లక్ష్యాన్ని చేరుకోక పోవడం వల్ల తీవ్రఒత్తిడికి లోనై" ఆత్మహత్యలకు" పాల్పడటం ప్రపంచ మానవాళికి జటిల సామాజిక ప్రజారోగ్య సమస్యగా పరిణమించింది . "ప్రపంచ ఆరోగ్య సంస్థ" లెక్కల ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా సగటున 7లక్షల మంది "ఆత్మహత్యలు" చేసుకుంటున్నారు. ఇందులో 15 నుండి 29 ఏళ్ల మధ్య వయసు వారు ఉన్నట్లు తేలింది. వారి మరణాలకు రోడ్డు ప్రమాదాల తర్వాత రెండో ప్రధాన కారణం ఆత్మహత్యలే అని అనేక అధ్యయనాల్లో తేలింది. చనిపోయే ముందు "ఒక క్షణం వాళ్ళ కుటుంబ సభ్యుల గురించి ఆలోచిస్తే" పరిస్థితి మరో రకంగా వుండేది అని అంచనాలు తెలుపుతున్నాయి. ఆత్మహత్యల వల్లపెద్ద దిక్కును కోల్పోయిన కుటుంబాలు తీవ్ర ఆర్థిక 'సామాజిక 'సమస్యలతో కూరుకు పోయి ఆర్థికంగా కునారిల్లుతున్నాయి.

ప్రపంచవ్యాప్తంగా ఆత్మహత్యలు పెరుగుతున్నాయి .చిన్న కారణాలకే తమ ఉసురు తీసుకుంటున్నారు.(ఆత్మహత్య చేసుకుంటున్నారు) "ప్రపంచ ఆరోగ్య సంస్థ" నివేదిక ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా యేటా 7 లక్షల మంది కి పైగా ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఇందులో 77 శాతం కేసులు తక్కువ మధ్యఆదాయ దేశాలలో నమోదు అవుతున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ప్రకారం.వ్యవసాయ రంగములో సంభవిస్తున్న అతివృష్టి అనావృష్టి పంటలకు పురుగు తగలడం ముఖ్యంగా పత్తి రైతులు ఆశించిన దిగుబడి రాక పంట నష్టము భరించలేక తాము పండించిన పంటలకు మార్కెట్లో గిట్టుబాటు ధరలు లభించక పోవడం వల్ల పురుగుమందులు తాగి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంటున్నారు. ఇలాంటి ఆత్మహత్యలు నియంత్రించవచ్చని "డబ్ల్యూటీవో" చెబుతుంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతి ఏట సెప్టెంబర్ 10 తేదీన ఆత్మహత్యలనివారణ మీద అవగాహన చైతన్య సదస్సులు సమావేశాలు నిర్వహించి ఆత్మహత్య రహిత సమాజ స్థాపనకు ప్రపంచ వ్యాప్తంగా స్వచ్ఛంద సంస్థలు సామాజిక సంస్థలు పౌరసమాజం వైద్యులు ఆరోగ్య శాఖ సమిష్టిగా ఆత్మహత్యాల నివారణకు పలు అవగాహన చైతన్య సదస్సులు నిర్వహిస్తుంది.

**యువతలో నిరాశ నిస్పృహలు**

యువతలో పేరుకుపోయిన నిరాశ నిస్పృహలు 'నిరుద్యోగం 'ఒత్తిడి వల్ల మానసిక ఆరోగ్యం క్షీణించి అనారోగ్య సమస్యలను తట్టుకోలేక ,"ఆత్మహత్యలకు' పాల్పడే శాతం ఎక్కువైంది. రైతులు' చేనేత కార్మికులు' నిరుద్యోగులు ' పరిశ్రమలు మూతపడడం వల్ల ఉపాధి కోల్పోయిన కార్మికులు' పరిక్షల్లో ఫెయిలైన విద్యార్థులలో ఆత్మహత్యలు పెరుగుతున్నాయి. ""ఆత్మహత్యలు చేసుకునేవాళ్లలో యువకులే ఎక్కువ శాతం ఉంటున్నారు 15 నుండి 29 సంవత్సరాల వయసుగల వారు ఎక్కువ ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు" .దీనికి కారణం ప్రేమవిఫలం కావడం . పెద్దలు మందలించారని .ఈ పని చేస్తుంటే మరికొందరు పని భారం పెరిగిందని. ఉద్యోగం రాలేదని .పరీక్షల్లో ఫేలయ్యామని పరువు పోయిందని ఇలా రకరకాల కారణాలతో ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. "డిప్రెషన్ మెంటల్" బ్యాలెన్స్" కోల్పోవడం." ఆర్థిక సమస్యలు' కుటుంబ కలహాలు పిల్లలశక్తి సామర్థ్యాలు గుర్తించకుండా వారిని తీవ్ర ఒత్తిడికి గురి చేయడం. టీవీ సోషల్ మీడియా ప్రభావం సమస్య వచ్చినప్పుడు ఎదుర్కొలేని బలహీన మనస్తత్వం' అత్తింటి వేధింపులు గృహహింస ' వరకట్నం 'ఒత్తిడులు 'చదువుల భారం ర్యాంకుల కోసం ఒత్తిడి "అనుమానాలు'ఈర్ష్యా ద్వేషాలు 'అహం ' అవమానాలు బంధుత్వంలో వస్తున్న విభేదాలు. అప్పుల బాధలు 'సమాజములో సూటి పోటి మాటలు 'వెకిలి చేష్టలు భరించలేకపోవడం .ఆత్మీయులు దూరం కావడం. వారిని కోల్పోవడం ఇలాంటి పరిస్థితులు పలువురిని ఆత్మహత్యలకు పురికొలుపు తున్నాయి .అన్ని వయసుల వారు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ప్రపంచవ్యాప్తంగాపురుషులలోనే ఆత్మహత్యలు రేటు ఎక్కువుంది

**జీవితంపై" ఆశ"పునరుద్ధరణ**

ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవాన్ని ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆత్మహత్యలు నివారించడానికి అంతర్జాతీయ అసోసియేషన్ ఫర్ సూసైడ్ ప్రివెన్షన్ సంస్థ వరల్డ్ ఫెడరేషన్ ఫర్ మెంటల్ హెల్త్ తో కలిసి పనిచేస్తుంది ."కోవిడ్ మహమ్మారి" కారణంగాఏర్పడిన ఆర్థిక సామాజిక పరిస్థితులు మానసిక అనారోగ్యం ఒత్తిడి మానవాళినిపీడిస్తోంది .మానసిక అనారోగ్యం వల్ల కలిగే ఇబ్బందులను అధిగమించడానికి "కనెక్ట్ కమ్యూనికేట్ మరియు సంరక్షణ "ద్వారా జీవితము పై ఆశను పునరుద్దరించడం అనే ఆశయంతో పనిచేస్తుంది. గత రెండు సంవత్సరాలుగా ఔనూ తో కలిసి " ఆత్మహత్యలను నివారించడానికి కలిసి పనిచేదం"కోవిడ్" కారణంగా పెరుగుతున్న ఆత్మహత్యల నివారణ ఆవశ్యకతపెరిగింది.

**ఆత్మహత్యల నివారణ పై అవగాహన**

ఆత్మహత్యలు ప్రజారోగ్య సమస్యగా పరిణమించి సమాజానికి సవాల్ గా నిలవడం శోచనీయం . ఆత్మహత్యల మీద చర్చజరగాలి 1)ఆత్మహత్యల గురించి సమాజములో బహిరంగ చర్చ లేకపోవడంవల్ల ఆత్మహత్యల నివారణ లోఆశించిన ఫలితాలు రావడం లేదని పలు ఆరోగ్య సర్వేలు వెల్లడించాయి. 2)ఆత్మహత్యలు చేసుకునే వారి ప్రవర్తన పసిగట్టడం వారిని గుర్తించడం వల్ల ఆత్మహత్యలను నివారించవచ్చును.3) ఆత్మనిర్భరత మీదఅవగాన కలిగించడం. మానసిక ఆరోగ్య అక్షరాస్యతను విస్తరించే కార్యాచరణతో మనోబలాన్ని పెంపొందించే సామాజిక సాంస్కృతిక వాతావరణాన్ని సృష్టించడానికి ప్రభుత్వం పౌరసమాజం పూనుకోవాలి .

**పెరుగుతున్న ఆత్మహత్యలు**

దేశములో వివిధ కారణాల వల్ల ఆత్మహత్యలు చేసుకుంటున్న వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. 2015 నుండి ప్రతి యేటా ఆత్మహత్యల కేసులు ఎక్కువగా నమోదు కావడం గమనార్హం 2018 తో పోలిస్తే దేశం మొత్తములో139123ఆత్మహత్యలు నమోదైనాయి .2018 తోపోలిస్తే 3 .4 శాతం పెరిగాయి. 2019 లో ఆత్మహత్యల రేటు0.2 శాతం పెరిగింది.

**రాష్ట్రాల వారీగా ఆత్మహత్యలు**

మహరాష్ట్ర ఆత్యదిక ఆత్మహత్యలు 18'916(13.6 శాతం), తమిళనాడు లో13'493(9.7 శాతం), పశ్చిమ బెంగాల్ లో12457(9.1 శాతం), కర్ణాటక లో11288 ఆత్మహత్యలు(8.1శాతం) జరిగాయి.నమోదైన కేసుల్లో ఈఐదు రాష్ట్రాలలో కలిసి 49.5 శాతం ఉన్నాయి. 2018 సంవత్సరం తోపోలిస్తే 2019 లో ఆత్మహత్యలు 3.4 శాతం పెరిగాయి.వీరిలో ఎక్కువ మంది కుటుంబ తగాదాల వల్ల ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ఆత్మహత్యలకు రెండో కారణము ఆనారోగ్యం పెళ్లికి సంబంధించిన ఇబ్బందులతో ఆత్మహత్యలకు పలుపడిన వారు 3వ స్థానం ప్రేమ వ్యవహారాల వల్ల మరణించిన వారు 4 వ స్థానములో ఉన్నారు.మత్తుమందుల ( డుగ్స్) వల్ల మరణించినవారు5వ స్థానములో ఉన్నారు.

**ఆత్మహత్యల నివారణ.. జీవితము పై ఆశను కలిగించాలి**

జీవితము పై అవగాహన ఆశను పెంచడం.జీవిత విలువలను జీవన నైపుణ్యాలు పెంచడం.

వ్యక్తిలోఆశను ప్రోత్సాహించడం ద్వారా ఆత్మహత్య ఆలోచనను మార్చడం ద్వారా ఆత్మహత్యల రహిత సమాజాన్ని నిర్మించవచ్చు. జీవిత ఆశయాలు నెరవేర్చుకున్న వ్యక్తుల జీవితచరిత్రలను వారి విజయగాధలను చదవాలి. ధైర్యం సాహసం మనోబలం సంకల్పబలం పెంపొందించే కథలను సంఘటనలు తెలియచేయడం ద్వారా ఆత్మహత్యలను ఆపవచ్చును. కష్టాలను ఇష్టంగాఎదురుకునే మనోధైర్యం వజ్ర సంకల్పం వ్యక్తుల్లో కలిగించాలి. ప్రజల్లో విశ్వాసం వెలుగును ప్రేరేపించే లక్ష్యంగా కుటుంబ సభ్యులు పౌరసమజం స్వచ్ఛంద సంస్థలు మహిళా సంఘాలు యువజన సంఘం పనిచేయాలి. ఆత్మహత్య సంక్షోభాన్ని ఎదురుకుంటున్న వారికి మాట ఓపికగా వినాలి .ఆత్మీయ పలకరింపు తో మంచి మాటలతో బతుకు మీద బరోసా భద్రత అవసరమైన మద్దతు పౌరసమాజం ఇవ్వాలి. ఆత్మహత్యల ఆలోచనలను అందుకు దారితీసే కారణాలు పరిస్థితులు సంక్లిష్టంగా వుంటాయి. ఆందోళన డిప్రెషన్ లాంటి మానసిక ఆరోగ్య పరిస్థితులు ఆత్మహత్యలకు కారణమవుతాయి.

ఒంటరి తనం మానసిక దుర్భలత్వం తో బాద పడే వారిని గుర్తించి వారి పట్ల శ్రద్ధ చూపాలి. స్నేహితుల తో తాము పడుతున్న బాధలు షేర్ చేసుకోవాలి.స్నేహితుల సన్నిహితుల సంతోషాలలో భాగస్వాములు కావాలి. జీవితము పైఆశనుపెంచాలి. అత్యాశను తుంచాలి.. ఆత్మహత్య ఆలోచనలు అనుభవాలు చెబితే వినడానికి సమయం స్థలం కేటాయించడం ద్వారా వారిలో ఆత్మహత్య ఆలోచనలు తగ్గుతాయి. వారి ఆలోచనని మల్లించాలి.చిన్న చర్చ జీవితాలను కాపడగలడు.వ్యక్తిలో ఆశను సృష్టిస్తుంది. కొత్త విషయాలపై దృష్టి కేంద్రీకరించాలి .అప్పుడు మనలో వున్న.నెగెటివ్ ఆలోచనలు తగ్గుముఖం పడతాయి స్వాంతన చేకూరుతుంది. నెగెటివ్ ఆలోచనలకు స్వస్తి పలకాలి .సంకల్పం మనోధైర్యం తోముందుకు వెళ్లే నైజం పెంచుకోవాలి.

**రోజు' వ్యాయామం' యోగ వాకింగ్ 'జాగింగ్ 'మెడిటేషన్' పుస్తకపఠనం**

మెదడుకు మంచి వ్యాయామం.మెదడులోని న్యురాన్ "న్యూరనులు" ఆరోగ్యంగా వుంటే నెగెటివ్ ఆలోచనలు తగ్గుతాయి ఈ స్థితి ఆత్మహత్యల నివారణ దోహదపడుతుంది. ఆత్మహత్య చేసుకునే అవకాశం వున్నవారిని జాగ్రత్తగా గమనించాలి. పురుగుమందులు తుపాకులు ఆయుధాలు కొన్ని రకాల మందులు వారికి అందుబాటులో లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా వ్యవస్థలో సంస్కరణలు చేపట్టాలి. 'నూతన విద్యా విధానంలో యోగ మెడిటేషన్ తప్పని సరిగా ప్రవేశ పెట్టాలి. పాటశాల కళాశాల స్థాయిలో

**మానవీయ విలువలు మానసిక శాస్త్రాన్ని పాఠ్యాంశంగా ప్రవేశ పెట్టాలి."**

పౌరసమాజం ప్రభుత్వం' సామాజిక స్వచ్ఛంద ధార్మిక సంస్థలు విద్య ఆరోగ్య శాఖ సమిష్టిగా జీవన విలువలు మానసిక ఆరోగ్య అక్షాస్యత విస్తరణ "అందరికీ ఆరోగ్యం "కార్యాచరణతో ఆత్మహత్యలను

నివారణకు ఉద్యమించి

ఆత్మహత్యల రహితభారత్ నిర్మాణానికి సమాజం పునరంకితం కావాలి.



**నేదునూరి కనకయ్య, అధ్యక్షులు**
**తెలంగాణ ఎకనామిక్ ఫోరం**
**తెలంగాణ వికాస వేదిక**
**రచయిత కాలమిస్ట్, కరీంనగర్**
**9440245771**

# రేవంత్‌రెడ్డి, వీర్ల శంకర్, వేముల వీరేశం దిష్టిబొమ్మల శవయాత్ర

**ఎల్లారెడ్డిపేటలో**

**బీఆర్ఎస్వీ నాయకుల నిరసన.. దిష్టిబొమ్మల దహనం**

**పరిస్థితిని అదుపులోకి తెచ్చిన సీఐ, ఎస్ఐలు**

అరుణప్రభ న్యూస్ -- ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 08 : ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో బీఆర్ఎస్వీ నాయకులు మంగళవారం తీవ్ర నిరసన చేపట్టారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే వీర్ల శంకర్, వేముల వీరేశం దిష్టిబొమ్మలను ఏర్పాటు చేసి శవయాత్ర నిర్వహించి అనంతరం దహనం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్వీ నాయకులు ప్రభుత్వ విధానాలు, ప్రజాప్రతినిధుల వ్యాఖ్యలను నిరసిస్తూ నినాదాలు చేశారు. మండల కేంద్రంలోని ప్రధాన వీధుల మీదుగా దిష్టిబొమ్మలతో శవయాత్ర నిర్వహించిన నాయకులు అనంతరం వాటిని దహనం చేశారు. దీంతో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. నిరసన కార్యక్రమం గురించి సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకున్నారు.

**సీఐ, ఎస్ఐల ఆధ్వర్యంలో పోలీసుల బందోబస్తు**

ఎల్లారెడ్డిపేట సీఐ, ఎస్ఐలు సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. నిరసనకారులను శాంతింపజేసి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు



చోటుచేసుకోకుండా చర్యలు చేపట్టారు. పోలీసుల జోక్యంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. ఈ సందర్భంగా బీఆర్ఎస్వీ నాయకులు మాట్లాడుతూ.. ప్రజల మనోభావాలను దెబ్బతీసే విధంగా వ్యాఖ్యలు చేయడం సరికాదని, ప్రజాస్వామ్య పద్ధతిలో తమ నిరసనను తెలియజేస్తున్నామని అన్నారు. సంబంధిత వ్యాఖ్యలపై ప్రజాప్రతినిధులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. నిరసన నేపథ్యంలో ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో కొద్దిసేపు పోలీసు బందోబస్తు కొనసాగింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పరిస్థితిని పర్యవేక్షించారు.

# బోడుప్పల్ సర్కిల్లో అనుమతుల్లేకుండా విచ్చలవిడిగా షేడ్ల నిర్మాణాలు

**అధికార యంత్రాంగం నిద్ర వ్యవస్థలోగాయిత్రి హిల్స్ షెడ్ ను పరిశీలించిన బోడుప్పల్ సెటిలర్స్ ఫోరం ప్రతినిధులు**

**అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోకపోతే ఆందోళన ఉద్ధృతం చేస్తామని హెచ్చరిక**





సెప్టెంబర్ 08, అరుణ ప్రభ : బోడుప్పల్ సర్కిల్ పరిధిలో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న షెడ్లు, ఇతర నిర్మాణాలపై బోడుప్పల్ సెటిలర్స్ ఫోరం ఆగ్రహం వ్యక్తం చేసింది. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు విచ్చలవిడిగా సాగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ ఫోరం చైర్మన్ ఎడ్ల శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. అనంతరం గాయిత్రిహిల్స్ లోని అనుమతి లేని షెడ్ ను ఫోరం ప్రతినిధులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా ఫోరం ప్రతినిధులు మాట్లాడుతూ.. బోడుప్పల్‌లో నిర్మాణాలకు అనుమతులు తీసుకోవాల్సిన నిబంధనలు ఉన్నప్పటికీ కొందరు వాటిని పట్టించుకోకుండా షెడ్లు, ఇతర నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపించారు. నిర్మాణ దశలోనే గుర్తించి చర్యలు తీసుకోవాల్సిన టౌన్‌ప్లానింగ్ అధికారులు ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారని మండిపడ్డారు. అక్రమ నిర్మాణాలపై స్థానికులు పలుమార్లు ఫిర్యాదులు చేసినా చర్యలు తీసుకోకపోవడం అధికారుల పనితీరుపై అనేక అనుమానాలకు తావిస్తోందన్నారు. అనుమతులు లేకుండా నిర్మాణాలు సాగితే ప్రభుత్వానికి రావాల్సిన వివిధ రకాల రుసుములు, పన్నుల ఆదాయానికి గండిపడే అవకాశం ఉందని ఫోరం ప్రతినిధులు పేర్కొన్నారు. నిబంధనల ప్రకారం అనుమతులు పొందిన వారిపై కఠినంగా వ్యవహరిస్తూ, అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడుతున్న వారిని పట్టించుకోకపోవడం సరికాదన్నారు. అక్రమ నిర్మాణాలకు ఎవరు సహకరిస్తున్నారనే విషయంపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని కోరారు. బోడుప్పల్ పరిధిలో అనుమతిలేని షెడ్లు, నిర్మాణాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి వివరాలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన నిర్మాణాలపై చట్టప్రకారం చర్యలు తీసుకోవడంతో పాటు అవసరమైతే వాటిని తొలగించాలని కోరారు. అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు వచ్చినప్పుడు తక్షణమే స్పందించేలా టౌన్‌ప్లానింగ్ విభాగం ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. అనుమతిలేని షెడ్లపై అధికారులు వెంటనే చర్యలు తీసుకోకపోతే ఆందోళనను మరింత ఉద్ధృతం చేస్తామని సెటిలర్స్ ఫోరం ప్రతినిధులు హెచ్చరించారు. అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాల్సిన అధికారులే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రజల్లో ప్రభుత్వ యంత్రాంగంపై నమ్మకం సన్నగిల్లుతుందని అన్నారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి బోడుప్పల్‌లోని అనుమతిలేని నిర్మాణాలపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సెటిలర్స్ ఫోరం అధ్యక్షుడు కత్తి వెంకట్ రెడ్డి,ప్రధాన కార్యదర్శి అమరలింగారెడ్డి, కోశాధికారి బజ్జూరి శ్రీనివాస్ గుప్తా,సలహదారులు వెమకటస్వామి తదితరులు పాల్గొన్నారు.



## మాజీ సీఎం కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు

**ఎమ్మెల్యే ఈర్ల శంకర్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలి**

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 8 (అరుణప్రభ): మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మృతి చెందాలని వ్యాఖ్యలు చేసిన శాసనసభ్యులు ఈర్ల శంకర్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరుతూ బీఆర్ఎస్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య తదితరులు జిల్లా ఎస్పీ మహేష్ బి. గీతేకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా తోట ఆగయ్య మాట్లాడుతూ.. మాజీ సీఎం కేసీఆర్‌పై ఎమ్మెల్యే ఈర్ల శంకర్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరంగా ఉన్నాయని అన్నారు. ప్రజా జీవితంలో ఉన్న వ్యక్తి మరో ప్రజా నాయకుడిపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం బాధ్యతారాహిత్యమని పేర్కొన్నారు. ఇలాంటి వ్యాఖ్యలు ప్రజల్లో ఉద్రిక్తతలకు దారితీసే అవకాశం ఉన్నందున పోలీసులు సమగ్రంగా విచారణ జరిపి, చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. కేసీఆర్‌పై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని, భవిష్యత్తులో ఇలాంటి వ్యాఖ్యలు పునరావృతం కాకుండా సంబంధిత వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీకి సమర్పించిన ఫిర్యాదులో కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




## ఎస్ఐఆర్ ప్రక్రియపై బిఎల్ఓలకు శిక్షణ సదస్సు కార్యక్రమంలో తహశీల్దార్ హరిచంద్రప్రసాద్

అరుణ ప్రభ పత్రిక ప్రతినిధి సంగారెడ్డి జిల్లా : మంగళవారం నాడు మున్సిపల్ కార్యాలయంలో తహసిల్దార్ హరిచంద్ర ప్రసాద్ బి ఎల్ ఓ లకు శిక్షణ సదస్సు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా తహసిల్దార్ హరిచంద్ర ప్రసాద్ మాట్లాడుతూ సర్ ప్రక్రియలో భాగంగా నోటీసులు జారీ చేసినచో డాక్యుమెంట్స్ అప్లోడింగ్ ప్రక్రియలో ఎదురయ్యే సాంకేతిక సమస్యలపై బిఎల్ఓ లకు క్షుణ్ణంగా వివరించారు. ప్రజలకు సర్ నోటీసులు వచ్చినా కూడా ఎటువంటి భయభ్రాంతులకు గురి కావద్దని ప్రజలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ కిరణ్, ఆరిఫ్, ఆర్ ఐ లు సాయి, మంజులత, మున్సిపల్ డబ్ల్యూ ఓ స్వామి, ట్రైనర్ మల్లేశం, బి ఎల్ వో లు తదితరులు పాల్గొన్నారు.

# ధర్మవరంలో ఉద్యోగాల జాతర.. 1,146 మందికి కొలువులు





ధర్మవరం, సెప్టెంబర్ 08; (అరుణ ప్రభ న్యూస్) : ధర్మవరంలోని సిఎన్‌బీ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం నిర్వహించిన మెగా జాబ్ మేళాకు నిరుద్యోగ యువత భారీగా తరలివచ్చారు. సంస్కృతి సేవా సమితి సహకారంతో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ మేళాను రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్, జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ తదితరులు ప్రారంభించారు. జాబ్ మేళాలో 135 ప్రముఖ కంపెనీలు పాల్గొనగా, 4,100 మంది యువత హాజరయ్యారు. వారిలో 1,146 మందికి పైగా ఉద్యోగాలకు ఎంపికయ్యారు. టీసీఎస్, యాక్సెంచర్, క్యాప్‌జెమినీ, హెచ్‌సీఎల్, ఐసీఐసీఐ, యాక్సిస్ బ్యాంక్, కియా, టాటా మోటార్స్, ఫాక్స్‌కాన్, హ్యుందాయ్ మొబిస్, అరబిందో ఫార్మా, హెటిరో, డీమార్ట్ తదితర సంస్థలు పాల్గొన్నాయి. మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ యువతకు విద్య, నైపుణ్యంతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యమన్నారు. గతంలో నిర్వహించిన మెగా జాబ్ మేళాలో 2,400 మందికి ఉద్యోగాలు లభించాయని తెలిపారు. కలెక్టర్ శ్యాంప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమల విస్తరణతో స్థానికంగా ఉద్యోగ అవకాశాలు పెరుగుతున్నాయని తెలిపారు. యువత విద్యార్హతతో పాటు కమ్యూనికేషన్, సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, పారిశ్రామిక సంస్థల ప్రతినిధులు, నిర్వాహకులు, నిరుద్యోగ యువత పాల్గొన్నారు.

# మాజీ తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ దిష్టిబొమ్మ దగ్ధం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

**ప్రేక్షక పాత్ర వహిస్తున్న పోలీస్ అధికారులు**

**బిఆర్ఎస్ నేతలను హౌస్ అరెస్టులు చేసిన ం పోలీసులు, కాంగ్రెస్ నాయకులను అరెస్ట్ చేస్తారా?**

**బిఆర్ఎస్ కార్యాలయంపై దాడి చేసిన వారిని తక్షణమే అరెస్ట్ చేయాలి**

**బోడుప్పల్ బి.ఆర్.ఎస్ పార్టీ అధ్యక్షుడు మంద సంజీవరెడ్డి**



సెప్టెంబర్ 8, అరుణ ప్రభ : తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర రావు దిష్టిబొమ్మను, దగ్ధం చేసిన కాంగ్రెస్ నాయకులపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని మాజీ జెడ్పిటిసి, బోడుప్పల్ బి.ఆర్.ఎస్ పార్టీ అధ్యక్షుడు మంద సంజీవరెడ్డి మేడిపల్లి పోలీసులకు డిమాండ్ చేశారు. హౌస్ అరెస్ట్ లో ఉన్న మంద సంజీవరెడ్డి మీడియాతో మాట్లాడుతూ బి ఆర్ ఎస్ నాయకులు రాష్ట్రవ్యాప్తంగా శాంతియుతంగా నిరసనలు తెలుపు తుంటే అక్రమంగా హౌస్ అరెస్టు చేసి నిర్బంధించిన పోలీసులు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దిష్టిబొమ్మలు కాల్చి, బి.ఆర్.ఎస్ కార్యాలయం పై కాంగ్రెస్ నేతలు రౌడీల మాదిరిగా దాడులు చేస్తే మాత్రం పోలీసులు వాళ్లకు సెక్యూరిటీ ఇస్తున్నారు కానీ వారిపై ఎలాంటి అరెస్టులు, చర్యలు తీసుకోవడంలేదని మండిపడ్డారు. కెసిఆర్ దిష్టిబొమ్మ దహనం, బి ఆర్ ఎస్ పార్టీ పై దాడి గురించి ఆధారాలను, సమాచారాన్ని మేడిపల్లి సీఐకి అందించానని, తక్షణమే ఆ ఘట నలో పాల్గొన్న కాంగ్రెస్ నేతలపై కఠిన చర్యలు తీసుకోవాలని మేడిపల్లి పోలీస్ అధికారులు డిమాండ్ చేస్తున్నట్లు మంద సంజీవరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రధాన కార్యదర్శి మీసాల కృష్ణ, మేయర్ సామల బుచ్చిరెడ్డి, సీనియర్ నాయకులు రామచంద్రారెడ్డి, కొత్త చక్రపాణి గౌడ్, బందారం శ్రీధర్ గౌడ్, కృష్ణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం

**వేయి రోజుల పరిపాలన శూన్యం**



అరుణ ప్రభ పాలకుర్తి సెప్టెంబర్ : పాలకుర్తి మండల కేంద్రంలో టిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ కమిటీ కేటీఆర్ పిలుపుమేరకు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదేశానుసారం మండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ కార్యాలయం నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు బైక్ ర్యాలీ నిర్వహించి అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించిన మాజీ బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్ కుమార్ మరియు మాజీ జెడ్పిటిసి పుష్కూరి శ్రీనివాసరావు. అనంతరం మాట్లాడుతూ 420 హామీలు, ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను నమ్మించి తెలంగాణలకు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయకుండా కాలయాపన చేస్తోందని భారత రాష్ట్ర సమితి నాయకులు తీవ్రంగా మండిపడ్డారు. అధికారం కోసం హామీలు ఇవ్వడం కాదు ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలి! ఆరు గ్యారెంటీలు అమలు చేయాలి!420 హామీలపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలి! రాజ్యాంగం ప్రజలకు హక్కులు కల్పించింది. ఆ హక్కుల కోసం ప్రశ్నించడం మా బాధ్యత!ప్రజలకు ఇచ్చిన హామీల అమలు కోసం పోరాటం చేయడం మా కర్తవ్యం!కాంగ్రెస్ ప్రభుత్వం ఇకనైనా మేల్కొని ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని, ప్రజలను మభ్యపెట్టే మాటలు కాకుండా చేతల్లో చూపించాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు ప్రజల గొంతు గాగా

**ప్రజల హక్కుల కోసం.. హామీల అమలు కోసం**

బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుంది ఈ కార్యక్రమంలో భారత రాష్ట్ర సమితి మండల శాఖ నాయకులు, మాజీ ఎంపీపీ నల్ల నాగిరెడ్డి, సర్పంచ్ కమ్మగాని విజయ నాగన్న గౌడ్,మాచర్ల ఎల్లయ్య, పాము శ్రీను, వీరమనేని సోమేశ్వరరావు, అన్నమనేని మురళీధర్ రావు, మహేందర్ నాయక్, కడదుల కర్ణాకర్ రెడ్డి, మాటూరు యాకన్న,గాదపాక కిరణ్,రేపాల అశోక్, కోల నారాయణ, గద్దం కిరణ్, గణపురం సురేష్,మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామ సర్పంచులు, పార్టీ సీనియర్ నాయకులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ శాసనసభ స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా దిష్టిబొమ్మ దహనం



సెప్టెంబర్ 8, అరుణ ప్రభ : తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ గారిపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత, అహంకారపూరిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బోడుప్పల్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు.బోడుప్పల్ డివిజన్--11 కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొమ్మక్ కళ్యాణ్ కుమార్ గారి ఆధ్వర్యంలో, చెంగిచెర్ల డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకుల భాగస్వామ్యంతో బోడుప్పల్ అంబేద్కర్ విగ్రహం వద్ద మరియు బోడుప్పల్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం ముందు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మరియు ఇన్‌చార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ హాజరై, రాజ్యాంగబద్ధమైన అత్యున్నత పదవిలో ఉన్న తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ గారిపై ఇలాంటి అనుచిత వ్యాఖ్యలు చేయడం అత్యంత ఖండనీయమని పేర్కొన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు పోగుల నర్సింహారెడ్డి , బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ , బి-బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్, బోడుప్పల్ మరియు చెంగిచెర్ల మాజీ కార్పొరేటర్లు, కాంటెస్ట్ కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.అలాగే సీనియర్ కాంగ్రెస్ నాయకులు విశ్వం గుప్తా , మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బొమ్మక్ అజయ్ , మేడ్చల్ అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు తోటకూర రాహుల్ యాదవ్,యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు అసర్ల బీరప్ప , బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బద్దుల శ్రీకాంత్ , మైనారిటీ మరియు సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీమతి సమత యాదవ్ , మహిళా కాంగ్రెస్ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొని తమ నిరసనను తెలియజేశారు. రాజ్యాంగబద్ధమైన తెలంగాణ శాసనసభ స్పీకర్ పదవిని అవమానించేలా వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు వెంటనే బహిరంగంగా క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు.శాసనసభ గౌరవాన్ని కించపరిస్తే కాంగ్రెస్ పార్టీ చూస్తూ ఊరుకోదు. ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ సంస్థల గౌరవాన్ని కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతుంది.



## యూత్ అధ్యక్షుడు గుగులోతు అశోక్ గృహప్రవేశం ::: మార్కెట్ చైర్‌పర్సన్ మంజుల భాస్కర్ నాయక్

అరుణ ప్రభ పాలకుర్తి సెప్టెంబర్ : పాలకుర్తి మండలం మైలారం గ్రామంలో ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మరియు టిపిసిసి ఉపాధ్యక్షురాలు ఝాన్సీ రెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షులు గుగులోతు అశోక్ నూతన గృహప్రవేశం, కుమారుల ధోతి ఫంక్షన్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.అతిథులుగా పాలకుర్తి మార్కెట్ చైర్‌పర్సన్ మంజుల భాస్కర్ నాయక్, పాలకుర్తి మండల కాంగ్రెస్ అధ్యక్షులు పోగు శ్రీనివాస్ పాల్గొన్నారు. నూతన గృహప్రవేశ కార్యక్రమంలో రిబ్బన్ కట్ చేసి, అనంతరం అశోక్ కుటుంబ సభ్యులను ఘనంగా సన్మానించారు. అలాగే కుమారుల ధోతి ఫంక్షన్‌లో పాల్గొని చిన్నారులను ఆశీర్వదించి, కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా మంజుల భాస్కర్ నాయక్ మాట్లాడుతూ, గుగులోతు అశోక్ కుటుంబానికి నూతన గృహప్రవేశ శుభాకాంక్షలు తెలిపారు. నూతన గృహంలో కుటుంబ సభ్యులు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. కుమారులు ఉన్నతంగా ఎదిగి కుటుంబానికి, సమాజానికి మంచి పేరు తీసుకురావాలని ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో మైలారం సర్పంచ్ గూగులోతు విమల జీవన్,మాజీ సర్పంచ్ గుగులోతు కిషన్ నాయక్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు గాదెపాక భాస్కర్, మండల కార్యదర్శి గుగ్గిళ్ల ఆదినారాయణ, నియోజకవర్గ ఉపాధ్యక్షులు గొనె మహేందర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ధరవత్ వాసు, లకావత్ రవి, భూక్యా శ్రీనివాస్, భూక్యా మల్లేష్ తదితర ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## చలో హైదరాబాద్ పోస్టర్ ఆవిష్కరణ

అరుణప్రభ 8 సెప్టెంబర్ మహబూబాబాద్ అర్బన్ : తెలంగాణ విశ్రాంత ఉద్యో గుల సంఘం మహబూబాబాద్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో చలో హైదరాబాద్ పోస్టర్ని ఆవిష్కరించడం జరిగినది. ఈ సందర్భంగా విశ్రాంత ఉద్యోగుల జిల్లా ప్రధాన కార్య దర్శి కొండ బత్తుల ఈశ్వర్ కుమార్ మాట్లాడుతూ 10వ తారీఖు రోజు హైద రాబాదు లాల్ బహదూర్ స్టేడియంలో జరిగే తెలంగాణ జేఏసీ ఆధ్వర్యంలో 206 సంఘాలు పాల్గొనే ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో అందరూ సహక రించాలని ప్రతి పెన్షనర్ మిత్రుడు ఈ ధర్నా కార్యక్రమంలో విధిగా పాల్గొనుటకు ప్రయత్నించాలని కోరారు.ఇంకా ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి వివి నాగేందర్ జిల్లా ఉపాధ్యక్షులు నెలకుర్తి రంగారెడ్డి జిల్లా కార్యదర్శి చంద్రయ్య జిల్లా గౌరవ సలహాదారుడు సంక బద్రి నారాయణ నడిపెల్లి శ్రీనివాసరావు టి పి టి ఎఫ్ మహ బూబాబాద్ మండల ప్రధాన కార్యదర్శి సారెడ్డి లింగారెడ్డి గారు, పెన్షనర్స్ యూని యన్ మౌబాద్ మండల గౌరవాధ్యక్షులు రత్నమాచారి సలహాదారుడు వివి రమణ య్య రామచంద్రు వెంకటేశ్వర్లు ఎల్లయ్య జనార్ధన్ బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.



## జిల్లా స్థాయి ఎస్‌జిఎఫ్ గేమ్స్‌కు నలుగురు విద్యార్థుల ఎంపిక

అరుణప్రభ న్యూస్, ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 8: ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామంలో సెప్టెంబర్ 2న నిర్వహించిన ఎస్ జి ఎఫ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ,క్రీడా పోటీల్లో రాచర్ల గొల్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్-17 వాలీబాల్ విభాగంలో జప్త. మహేశ్వర్ (10వ తరగతి), ల్యాగల వేదశ్రీ (10వ తరగతి), అండర్-17 ఖో-ఖో విభాగంలో జప్త. శ్రావణి (10వ తరగతి), అండర్-14 కబడ్డీ విభాగంలో జీ. నిహారిక (7వ తరగతి) జిల్లా స్థాయి SGF గేమ్స్‌కు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి. మురళీధర్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ బృందం విద్యార్థులను మెమెంటోలతో సత్కరించి అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా స్థాయి పోటీల్లోనూ ఇదే ప్రతిభను కొనసాగించి విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. గ్రామ సర్పంచ్ కొండ రమేష్ గౌడ్, పాలకవర్గ సభ్యులు, ఘాఘాజ చైర్మన్ జనగామ రమ తదితరులు విద్యార్థులను అభినందించారు. జిల్లా స్థాయి పోటీల్లోనూ విజయం సాధించి పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు. విద్యార్థుల ఎంపిక పట్ల పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.



## భూ సర్వే పారదర్శకంగా, పక్కాగా సాగాలి: జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

అరుణప్రభ మహబూబాబాద్,సెప్టెంబర్.8 : మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం ఉప్పరపల్లి గ్రామ పరిధిలోని చెరువుముందు తండాలో కొనసాగుతున్న సమగ్ర భూ సర్వే ప్రక్రియను జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే బృందాలు నిర్వహిస్తున్న రోవర్ల వినియోగం, హద్దుల గుర్తింపు, డిజిటల్ మ్యాపింగ్ ప్రక్రియను ఆమె నిశితంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ సరిహద్దు వివాదాలకు తావులేకుండా భూ యజమానుల సమక్షంలోనే ఖచ్చితమైన కొలతలు నిర్వహించాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుంటూ రికార్డులను పక్కాగా, పారదర్శకంగా నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ వివేక్, సర్వేయర్లు, జి.పి ఓ నర్మద, గ్రామ పంచాయతీ సిబ్బంది మరియు స్థానిక రైతులు పాల్గొన్నారు

# శాసన మండలి నుంచి తాతా మధును తక్షణమే బర్తరఫ్ చేయాలి

### కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సమ్మిగౌడ్

### దళిత జాతిని హేళన చేస్తున్న బి ఆర్ ఎస్ పార్టీ - కాంగ్రెస్ పార్టీ ముఖ్యనాయకులు

### కాంగ్రెస్ మండల పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసన





అరుణప్రభ 8 సెప్టెంబర్ మహబూబాబాద్ : తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై ఆక్షేపమైన వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలతో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధును శాసన మండలి సభ్యత్వాని నుండి తక్షణమే బర్తరఫ్ చేయాలని కేసముద్రం మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు సమ్మిగౌడ్ తీవ్రంగా డిమాండ్ చేశారు. ?కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కేసముద్రం మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో నాయకులు, కార్యకర్తలు భారీ నిరసన నిర్వహించారు.??ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు నల్ల బ్యాడ్జీలు ధరించి తమ నిరసనను వ్యక్తం చేశారు. స్పీకర్ పదవికి, దళిత సమాజానికి వ్యతిరేకంగా మాట్లాడటం రాజ్యాంగ విలువలను తీవ్రంగా అవమానించడమేనని నినాదాలు చేశారు.అనంతరం సీనియర్ నాయకులు మాట్లాడుతూ...తాతామధును వెంటనే శాసనమండలి నుండి భర్తరప్ చేయాలని డిమాండ్ చేశారు ఈ సందర్భంగా మండల అధ్యక్షులు సమ్మిగౌడ్ మాట్లాడుతూ "ఉన్నతమైన రాజ్యాంగ పదవిలో ఉన్న స్పీకర్‌ను ఉద్దేశించి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు మాట్లాడిన తీరు అత్యంత హేయమైనదన్నారు. రాజ్యాంగ వ్యవస్థలను, ప్రజాస్వామ్య పద్ధతులను కించపరిచే హక్కు ఎవరికీ లేదని తెలిపారు. తాతా మధుపై తక్షణమే అనర్హత వేటు వేసి, శాసన మండలి నుండి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. చట్టపరంగా ఆయనపై కఠిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు." ప్రజాస్వామ్య వ్యవస్థలో స్పీకర్ స్థానానికి ప్రత్యేక గౌరవం ఉంటుందని, అలాంటి పదవిలో ఉన్న దళిత నేతపై అనుచిత వ్యాఖ్యలు చేయడం క్షమించరాని నేరమని స్థానిక కాంగ్రెస్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ పదవికి తాతా మధు అనర్హుడని, ఆయన వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో అంబటి మహేందర్ రెడ్డి, అల్లం నాగేశ్వరరావు,రావుల మురళి, బండారు వెంకన్న, కదిర సురేందర్, వల్లందాసు రవి, తరాల వీరేష్,రాంబాబు,రడెం వెంకన్న, రడెం శ్రీనివాస్,పోలెపాక నాగరాజు, ఆయూబ్ ఖాన్, శ్రీహరి, దామరకోండ ప్రవీణ్,సామల నరసయ్య,కొలిపాక వెంకన్న, వివిధ గ్రామాల సర్పంచ్ లు,గ్రామ పార్టీ అధ్యక్షులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వినాయక నిమజ్జనోత్సవాలను ప్రశాంత వాతావరణంలో, సమన్వయంతో విజయవంతం చేయాలి

### జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్





అరుణప్రభ మహబూబాబాద్, సెప్టెంబర్.08 : జిల్లాలో వినాయక నిమజ్జన వేడుకలను అత్యంత వైభవంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు పటిష్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్ తో కలిసి, వినాయక నిమజ్జన వేడుకలపై రెవెన్యూ, మున్సిపల్, విద్యుత్, పోలీస్ తదితర శాఖల ఉన్నతాధికారులతో నిమజ్జన ఏర్పాట్లపై సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించి, కీలక దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో శోభాయాత్ర సాగే ప్రధాన మార్గాల్లో, నిమజ్జన ఘాట్ల వద్ద పోలీస్ శాఖ పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు . సమస్యాత్మక ప్రాంతాల్లో అదనపు బలగాలను మోహరించి, సీసీటీవీ కెమెరాలు, డ్రోన్ల ద్వారా నిరంతర నిఘా ఉంచాలన్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తుగా రూట్ డైవర్షన్ ప్రణాళికలు అమలు చేయాలన్నారు. విగ్రహాల ఊరేగింపు మార్గాల్లో రోడ్ల మరమ్మతులు, గుంతల పూడ్చివేత పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. నిమజ్జనం పూర్తయిన వెంటనే వ్యర్థాలను తొలగించేందుకు పారిశుధ్య కార్మికులను షిఫ్టుల వారీగా నియమించాలి. ఊరేగింపు మార్గాల్లో వేలాడుతున్న విద్యుత్ తీగలను సంబందిత శాఖల వారు సరిచేసి, ఎత్తు పెంచాలన్నారు.విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా నిరంతర విద్యుత్‌తో పాటు ఘాట్ల వద్ద అదనపు జనరేటర్లు, హైమాస్ట్ లైట్లను సిద్ధంగా ఉంచాలన్నారు. విగ్రహాల నిమజ్జనానికి ఇబ్బంది కలగకుండా, క్రేన్లు సులభంగా నిలిచేందుకు మరియు విగ్రహాలు నీటిలో సరిగ్గా మునిగేందుకు నిమజ్జన పాయింట్ల వద్ద పూడిక తీత పనులు చేపట్టాలని అన్నారు. ఇరిగేషన్ అధికారులు నిమజ్జనం జరిగే చెరువులు, జలాశయాలు లేదా కాలువల్లో తగినంత నీటి మట్టం ఉందో లేదో పర్యవేక్షించి మండల అధికారులను సమన్వయం చేసుకొని నివేదికలు అందజేయాలని అన్నారు. ప్రమాదాలు జరగకుండా ఘాట్ల వద్ద బలమైన బారికేడింగ్, గజ ఈతగాళ్లు, బోట్లు, లైఫ్ జాకెట్లతో కూడిన ప్రత్యేక రెస్క్యూ టీమ్‌లను మోహరించాలన్నారు. అగ్నిమాపక శకటాలను (ఫైర్ ఇంజిన్లు) ఎల్లవేళలా అందుబాటులో ఉంచాలన్నారు. మండప నిర్వాహకులు, ప్రజలు అధికారులకు సహకరించి, పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని నిబంధనలకు అనుగుణంగా నిమజ్జనం పూర్తి చేయాలని అన్నారు. మండల స్థాయిలో తహసీల్దార్లు పంచాయతీ కార్యదర్శులు, గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశాలు నిర్వహించి అవసరమైన ఏర్పాట్లపై కార్యాచరణ రూపొందించాలన్నారు. అన్ని శాఖల అధికారులు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించి వినాయక చవితి ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆదేశించారు. నిమజ్జనం పూర్తయిన తరువాత ఘాట్ల వద్ద, ప్రధాన రహదారులపై మున్సిపల్ మరియు పంచాయతీ సిబ్బంది సహాయంతో మట్టి, వ్యర్థాలు, పూజా సామగ్రిని తొలగించి శుభ్రపరిచే చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్ మాట్లాడుతూ వినాయక మండపాల నిర్వాహకులు పోలీస్ శాఖ వెబ్‌సైట్‌లో పూర్తి వివరాలను నమోదు చేసి అనుమతి పొందాలని సూచించారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోలేని వారు సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనుమతులు పొందిన తర్వాతే మండపాలను ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యు అదనపు కలెక్టర్ కె.అనిల్ కుమార్, ఇంచార్జ్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పురుషోత్తం, డి.ఆర్.ఓ. నాగావాణి, డి.ఆర్.డి.ఓ మధుసూధనరాజు, మహబూబాబాద్, తొర్రూరు ఆర్డీఒ లు రాజేశ్వరీ, గణేష్ ట్రైనీ డిప్యుటీ కలెక్టర్ నితీష్ కుమార్, మున్సిపల్ కమిషనర్లు, తహసిల్దార్లు మరియు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు

# కూరగాయలు, పండ్లతోటలు, తృణధాన్యాల సాగు విస్తరణకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలి: సీఎస్ సంజయ్ జాజు



హైదరాబాద్, సెప్టెంబర్ 8: రాష్ట్రంలో కూరగాయలు, పండ్లతోటలు, తృణధాన్యాలు, ప్రత్యామ్నాయ పంటల సాగును మరింత విస్తరించేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. కూరగాయలు, పండ్లతోటలు, ప్రత్యామ్నాయ పంటల సాగు ప్రోత్సాహంపై మంగళవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో సీఎస్ సంజయ్ జాజు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొ. అల్తాస్ జానయ్య, పీవీ నర్సింహారావు తెలంగాణ వెటర్నరీ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొ. ఎం. జ్ఞాన ప్రకాష్, హార్టికల్చర్ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డా. దండా రాజి రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎస్ సంజయ్ జాజు మాట్లాడుతూ, రైతులకు అధిక ఆదాయం అందించే కూరగాయల సాగును మరింత ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కూరగాయలు, పండ్లతోటలు, తృణధాన్యాలు, ప్రత్యామ్నాయ పంటల సాగుకు అనుకూలమైన ప్రాంతాలను గుర్తించి, సాగు విస్తీర్ణాన్ని పెంచేలా సమన్వయంతో చర్యలు చేపట్టాలని సూచించారు. రైతులకు అవసరమైన సాంకేతిక సహకారం, ఆర్థిక వనరులు, మార్కెటింగ్ సదుపాయాలను అందించేందుకు నాబార్డ్‌తో పాటు అన్ని సంబంధిత సంస్థలు, ఏజెన్సీల సహాయ సహకారాలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని అధికారులను ఆదేశించారు.ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో నీటి వనరుల సమర్థ వినియోగానికి ప్రాధాన్యత ఇవ్వాలని, కూరగాయలు, పండ్లతోటలు మరియు ప్రత్యామ్నాయ పంటల్లో డ్రిప్ ఇరిగేషన్‌ను మరింత విస్తృతంగా ప్రోత్సహించాలని సీఎస్ సూచించారు.వ్యవసాయ, ఉద్యానవన శాఖలతో పాటు వ్యవసాయ, వెటర్నరీ విశ్వవిద్యాలయాలు సమన్వయంతో పనిచేసి రైతులకు మెరుగైన సాంకేతిక మార్గదర్శకత్వం అందించాలని ఆయన పేర్కొన్నారు.



## ఫిజియోథెరపీ సేవలతో ఆరోగ్యకర సమాజం

ధర్మవరం, సెప్టెంబర్ 08; (అరుణ ప్రభ న్యూస్) : ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ ఫిజికల్ థెరపిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ధర్మవరంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరై ఫిజియోథెరపిస్టులకు శుభాకాంక్షలు తెలిపారు. ఆరోగ్య సంరక్షణ, పునరావాస సేవల్లో ఫిజియోథెరపీకి ఎంతో ప్రాధాన్యత ఉందని మంత్రి తెలిపారు. సమీప భవిష్యత్తులో ప్రభుత్వ ఫిజియోథెరపీ కళాశాలలు ఏర్పాటయ్యే అవకాశం ఉందని, తద్వారా ఫిజియోథెరపిస్టులకు ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ చైర్మన్ జి. సతీష్‌రెడ్డి, ఎన్‌టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం కార్యనిర్వాహక మండలి సభ్యుడు డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి, ఒంటెరు శ్రీనివాస్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వంగళ శశిభూషణ్‌రెడ్డి తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ యాదవ్, అతిథులు ఫిజియోథెరపిస్టులతో కలిసి కేక్ కట్ చేసి వేడుకల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏపీ ఫిజికల్ థెరపిస్ట్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు శివానాయక్, రాయలసీమ సమన్వయకర్త పి. సతీష్‌రెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ జగదీశ్ అబ్బరాజు, డాక్టర్ సుదర్శన్, డాక్టర్ అశోక్‌తో పాటు ధర్మవరం, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిజియోథెరపిస్టులు పాల్గొన్నారు.



## ప్రశ్నించే గొంతులను అక్రమ అరెస్టులతో ఆపలేరు ఎడవల్లి రఘువర్ధన్ రెడ్డి

### బి ఆర్ ఎస్ నేతలపై దాడులు రేవంత్ రెడ్డి నియంత పాలనకు నిదర్శనం

### కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీలు నెరవేర్చేవరకు పోరాటం ఆగదు

### పీర్జాదిగూడ బి.ఆర్.ఎస్ ప్రధాన కార్యదర్శి, ఎడవల్లి రఘువర్ధన్ రెడ్డి

సెప్టెంబర్ 08, అరుణ ప్రభ : కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 6 గ్యారెంటీలు, 420 హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తూ, అసెంబ్లీలో ప్రజా గొంతును వినిపించే బి ఆర్ ఎస్ ఎమ్మెల్యేలను అక్రమ అరెస్టులు చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం తన నియంత పరిపాలన కొనసాగిస్తుందని పీర్జాదిగూడ బిఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడవల్లి రఘువర్ధన్ రెడ్డి మండిపడ్డారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న బి.ఆర్.ఎస్ నేతలను హౌస్ అరెస్ట్ చేసి నిర్బంధించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ఖండిస్తూ కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలపై ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు సహా ప్రజా ప్రతినిధులపై అసెంబ్లీ వద్ద పోలీసులు జరిపిన దాష్టీకం, అక్రమ అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నామని. ప్రజా ప్రభుత్వం అని చెప్పుకుంటున్న ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తున్న బి ఆర్ ఎస్ నాయకుల గొంతు నొక్కుతూ, రాష్ట్రవ్యాప్తంగా అక్రమ అరెస్టులు, నిర్బంధాలు చేయడం రేవంత్ రెడ్డి నిరంకుశ పోకడలకు నిదర్శనమని, బి ఆర్ ఎస్ శ్రేణులు అరెస్టులకు, కేసులకు భయపడమని కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకు తమ పోరాటం ఆగదని, రేవంత్ రెడ్డి సర్కార్ పతనం ప్రారంభమైందని రఘువర్ధన్ రెడ్డి హెచ్చరించారు.ం

## శంకరయ్య కాలనీ నూతన కమిటీ ఎన్నిక

### ::: అధ్యక్షుడిగా చిల్లా రమేష్



సెప్టెంబర్ 08, అరుణ ప్రభ. : బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని శంకరయ్య కాలనీ నూతన కమిటీని ఎన్నుకున్నారు.కమిటీ ముఖ్య సలహదారులుగా పి. వెంకట్‌రెడ్డి, అధ్యక్షుడిగా చిల్లా రమేష్,ఉపాధ్యక్షులుగా ఎస్.రాజేష్,బాబు రావు,రంగారెడ్డి,ప్రధాన కార్యదర్శిగా బి. రామ్‌గోపాల్,కోశాధికారిగా శశిధర్, సంయుక్త కార్యదర్శులుగా మహేందర్‌రెడ్డి, రామ్‌చ ందర్, సాంస్కృతిక కార్యదర్శులుగా జె.నరేందర్, బి. కిరణ్, కార్యవర్గ సభ్యులుగా భరత్,నరేందర్,పి. శ్రీనివాస్, సలహాదారులుగా బిక్షపతి, బిక్షాచారి, బాలరాములు, వెంకటయ్య, వీరాచారి, డీజీపీ శర్మ, ఫణి శర్మలను ఎన్నుకున్నారు.ఈ సంధర్భంగా చిల్లా రమేష్ మాట్లాడుతూ అధ్యక్షుడి నన్ను ఎన్నుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. కాలనీ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం సమష్టిగా పనిచేస్తుందని సభ్యులు తెలిపారు.

## అన్నవరంలో భక్తుడిని మోసం చేసిన వ్యాపారికి భారీ షాక్

అన్నవరం దేవస్థానం ప్రాంగణంలోని ఓ శీతలపానీయాల దుకాణదారుడికి వినియోగదారుల ఫోరం భారీ షాక్ ఇచ్చింది. కేవలం ఏడు రూపాయల అదనపు వసూళ్ల కోసం ఆశపడి, ఏకంగా ఏడు లక్షల రూపాయల జరిమానా చెల్లించాల్సిన పరిస్థితిని కొనితెచ్చుకున్నాడు. ఎమ్మార్పీ కంటే అధిక ధరకు వాటర్ బాటిల్ విక్రయించినందుకు గాను కాకినాడ వినియోగదారుల ఫోరం ఈ సంచలన తీర్పును వెలువరించింది. వివరాల్లోకి వెళితే.. ఈ ఏడాది ఫిబ్రవరి 22న పిఠాపురానికి చెందిన వెంకటేశ్వరరావు అనే భక్తుడు అన్నవరం ఆలయ ప్రాంగణంలోని ఒక దుకాణంలో వాటర్ బాటిల్ కొనుగోలు చేశారు. దాని ఎమ్మార్పీ ధర రూ.18 కాగా, సదరు దుకాణదారుడు రూ.25 వసూలు చేశాడు. అదనంగా రూ.7 వసూలు చేసి వినియోగదారుడిని మోసగించినందుకు గాను వెంకటేశ్వరరావు కాకినాడ వినియోగదారుల ఫోరంలో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై విచారణ చేపట్టిన ఫోరం మంగళవారం తుది తీర్పును వెల్లడించింది. ఫోరం అధ్యక్షులు రఘుపతి వసంత్ కుమార్, సభ్యులు శశి, నాగేశ్వరరావులతో కూడిన బెంచ్ ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. భక్తుడి నుంచి అదనంగా వసూలు చేసిన రూ.7ను తిరిగి చెల్లించడంతో పాటు, కోర్టు ఖర్చుల నిమిత్తం రూ.10,000 చెల్లించాలని ఆదేశించింది. వీటితో పాటు, వినియోగదారుల సంక్షేమ నిధికి ఏకంగా రూ.7 లక్షలను జరిమానాగా జమ చేయాలని తీర్పులో స్పష్టం చేసింది. ఎమ్మార్పీ కంటే అధిక ధరకు వస్తువులను విక్రయించే వ్యాపారులకు ఈ తీర్పు ఒక గట్టి హెచ్చరికగా నిలుస్తోంది.

# మానుకోటలో ఘనంగా ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవ వేడుకలు

అరుణప్రభ 8 సెప్టెంబర్ మహబూబాబాద్ అర్బన్ : మహబూబాబాద్: ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవాన్ని పురస్కరించుకొని సెప్టెంబర్ 8, 2026న మహబూబాబాద్ పట్టణంలోని స్థానిక అమరవీరుల స్థూపం వద్ద మానుకోట శాఖ ఫిజియోథెరపిస్టులు ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ అమరవీరుడు, ఫిజియోథెరపిస్టు కాసోజు శ్రీకాంత్ చారి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఫిజియోథెరపిస్ట్స్ యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కందుల నాగరాజు మాట్లాడుతూ సుధా రహిత జీవన విధానమే ఫిజియోథెరపీ అని,ఫిజియోథెరపీకి గొప్ప చారిత్రక నేపథ్యం ఉందని తెలిపారు. ప్రాచీన గ్రీకు వైద్యుడు హిప్పోక్రటీస్ కాలం నుంచే వ్యాయామం వంటి భౌతిక చికిత్సా విధానాలను ఉపయోగించిన ఆధారాలు ఉన్నాయని తెలిపారు. అనంతరం ఫిజియోథెరపీ శాస్త్రీయంగా అభివృద్ధి చెందుతూ, ఆధునిక పునరావాస వైద్య విధానంగా రూపుదిద్దుకుందని పేర్కొన్నారు. హేనరికే లింగ్ ( హెన్రిక్ లింగ్) ఆధునిక ఫిజియోథెరపీ అభివృద్ధికి ముఖ్యమైన పునాది వేసిన వ్యక్తుల్లో ఒకరని డాక్టర్ నాగరాజు తెలిపారు. లింగ్ వ్యాయామాలను కేవలం శారీరక దృఢత్వం కోసం మాత్రమే కాకుండా వ్యాధులు, గాయాలు మరియు శారీరక సమస్యల పునరావాసం కోసం వ్యవస్థీకృతంగా ఉపయోగించే “మెడికల్ జిమ్నాస్టిక్స్ ” విధానాన్ని అభివృద్ధి చేశారని చెప్పారు. 1813లో స్టాకహోలం మానుకోటలో ఘనంగా ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవ వేడుకలు మహబూబాబాద్: ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవాన్ని పురస్కరించుకొని సెప్టెంబర్ 8, 2026న మహబూబాబాద్ పట్టణంలోని స్థానిక అమరవీరుల స్థూపం వద్ద మానుకోట శాఖ ఫిజియోథెరపిస్టులు ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ అమరవీరుడు, ఫిజియోథెరపిస్టు కాసోజు శ్రీకాంత్ చారి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు

ఈ సందర్భంగా తెలంగాణ ఫిజియోథెరపిస్ట్స్ యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కందుల నాగరాజు మాట్లాడుతూ సుధా రహిత జీవన విధానమే ఫిజియోథెరపీ అని,ఫిజియోథెరపీకి గొప్ప చారిత్రక నేపథ్యం ఉందని తెలిపారు. ప్రాచీన గ్రీకు వైద్యుడు హిప్పోక్రటీస్ కాలం నుంచే వ్యాయామం వంటి భౌతిక చికిత్సా విధానాలను ఉపయోగించిన ఆధారాలు ఉన్నాయని తెలిపారు. అనంతరం ఫిజియోథెరపీ శాస్త్రీయంగా అభివృద్ధి చెందుతూ, ఆధునిక పునరావాస వైద్య విధానంగా రూపుదిద్దుకుందని పేర్కొన్నారు. హేనరికే లింగ ( హెన్రిక్ లింగ్) ఆధునిక ఫిజియోథెరపీ అభివృద్ధికి ముఖ్యమైన పునాది వేసిన వ్యక్తుల్లో ఒకరని డాక్టర్ నాగరాజు తెలిపారు. లింగ్ వ్యాయామాలను కేవలం శారీరక దృఢత్వం కోసం మాత్రమే కాకుండా వ్యాధులు, గాయాలు మరియు శారీరక సమస్యల పునరావాసం కోసం వ్యవస్థీకృతంగా ఉపయోగించే “మెడికల్ జిమ్నాస్టిక్స్ ” విధానాన్ని అభివృద్ధి చేశారని చెప్పారు. 1813లో స్టాకహోలం లో లిలిరాయల్ సెంట్రల్ ఇన్స్టిట్యూట్ అఫ్ జిమ్నాస్టిక్స్ ను స్థాపించి తెరపెటిక్ ఎక్సర్సిస్ మరియు మెడికల్ జిమ్నాస్టిక్స్ అభివృద్ధికి ఎంతో కృషి చేశారని వివరించారు. రెండో ప్రపంచ యుద్ధ కాలంలో గాయపడిన సైనికుల పునరావాసంలో ఫిజియోథెరపీ కీలక పాత్ర పోషించిందని డాక్టర్ నాగరాజు తెలిపారు. గాయాలు, కదలికల లోపాలు మరియు శారీరక వైకల్యాల నుంచి సైనికులు తిరిగి సాధారణ జీవనానికి చేరుకోవడంలో ఫిజియోథెరపిస్టులు అందించిన పునరావాస సేవలు ఎంతో ఉపయోగపడ్డాయని పేర్కొన్నారు. భారతదేశంలో కూడా ఫిజియోథెరపీ క్రమంగా అభివృద్ధి



చెందుతూ 1955లో ఇండియన్ అసోసియేషన్ అఫ్ ఫిజిదరపిస్ట్స్ ఏర్పడిందని తెలిపారు. ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవం సెప్టెంబర్ 8న నిర్వహించడానికి ప్రత్యేకమైన చారిత్రక నేపథ్యం ఉందని డాక్టర్ నాగరాజు వివరించారు. 1951 సెప్టెంబర్ 8న వరల్డ్ కాన్ఫడరేషన్ ఫర్ ఫిసికల్ థెరపీ స్థాపించబడింది. అదే రోజున డబ్ల్యూ సి పి టి యొక్క మొదటి సాధారణ సమావేశం కూడా నిర్వహించబడింది. ఈ చారిత్రక రోజును గుర్తుచేసుకుంటూ 1996లో డబ్ల్యూ సి పి టి సెప్టెంబర్ 8ను వరల్డ్ ఫిసికల్ థెరపీ డే గా నిర్ణయించింది. ప్రస్తుతం పేరు వరల్డ్ ఫిజిఓథెరపీ గా కొనసాగుతోందని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ప్రజల ఆరోగ్యం, కదలిక సామర్థ్యం మరియు జీవన నాణ్యతను మెరుగుపరచడంలో ఫిజియోథెరపీ కీలక పాత్ర పోషిస్తోందని డాక్టర్ నాగరాజు అన్నారు. స్ట్రోక్, పార్కిన్సన్స్, బెల్స్ పాల్సీ, ఆర్థోపెడిక్ సమస్యలు, కీళ్ల సమస్యలు, స్పోర్ట్స్ గాయాలు, శస్త్రచికిత్స అనంతర పునరావాసం, పిల్లల నాడీ సంబంధిత సమస్యలు తదితర అనేక పరిస్థితుల్లో ఫిజియోథెరపీ సేవలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు

తెలంగాణలో కూడా ఫిజియోథెరపీ రంగాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని డాక్టర్ కందుల నాగరాజు పేర్కొన్నారు. తెలంగాణ అమరవీరుడు మరియు ఫిజియోథెరపిస్టు కాసోజు శ్రీకాంత్ చారి పేరుతో ఫిజియోథెరపీ రంగంలో పరిశోధనలకు ప్రోత్సాహం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఖాళీగా ఉన్న ఫిజియోథెరపిస్టు పోస్టులను భర్తీ చేసి, రెగ్యులర్ రిక్రూట్‌మెంట్ చేపట్టాలని, ఫిజియోథెరపీకి ప్రత్యేక డిపార్ట్‌మెంట్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు ప్రజలకు నాణ్యమైన ఫిజియోథెరపీ సేవలు అందించడంతో పాటు రాష్ట్రంలోని ఫిజియోథెరపిస్టుల హక్కులు, వృత్తిపరమైన గౌరవం మరియు ఉద్యోగ భద్రత కోసం తెలంగాణ ఫిజియోథెరపిస్ట్స్ యూనియన్ నిరంతరం కృషి చేస్తుందని ఆయన తెలిపారు. ఫిజియోథెరపీ రంగం మరింత అభివృద్ధి చెంది, తెలంగాణ దేశంలోనే ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు

ఈ కార్యక్రమంలో మానుకోట శాఖకు చెందిన సీనియర్ ఫిజియోథెరపిస్టులు డాక్టర్ విజయకుమార్, డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ రమేష్, డాక్టర్ గణేష్, డాక్టర్ వెంకన్న, డాక్టర్ రాజా, డాక్టర్ శ్రీవిద్య తదితరులు పాల్గొన్నారు. ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవం సందర్భంగా ప్రజలకు ఆరోగ్యం, కదలిక మరియు మెరుగైన జీవన నాణ్యత కోసం ఫిజియోథెరపీ సేవలను మరింత విస్తరించాలనే సందేశాన్ని ఈ కార్యక్రమం అందించింది.లో లిలిరాయల్ సెంట్రల్ ఇన్స్టిట్యూట్ అఫ్ జిమ్నాస్టిక్స్ (జీసీఐఎల్ )ను స్థాపించి తెరపెటిక్ ఎక్సర్సిస్ మరియు మెడికల్ జిమ్నాస్టిక్స్ అభివృద్ధికి ఎంతో కృషి చేశారని వివరించారు.

రెండో ప్రపంచ యుద్ధ కాలంలో గాయపడిన సైనికుల పునరావాసంలో ఫిజియోథెరపీ కీలక పాత్ర పోషించిందని డాక్టర్ నాగరాజు తెలిపారు. గాయాలు, కదలికల లోపాలు మరియు శారీరక వైకల్యాల నుంచి సైనికులు తిరిగి సాధారణ జీవనానికి చేరుకోవడంలో ఫిజియోథెరపిస్టులు అందించిన పునరావాస సేవలు ఎంతో ఉపయోగపడ్డాయని పేర్కొన్నారు. భారతదేశంలో కూడా ఫిజియోథెరపీ క్రమంగా అభివృద్ధి చెందుతూ 1955లో ఇండియన్ అసోసియేషన్ అఫ్ ఫిజిదరపిస్ట్స్ (ఐ ఎ పి ) ఏర్పడిందని తెలిపారు. ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవం సెప్టెంబర్ 8న నిర్వహించడానికి ప్రత్యేకమైన చారిత్రక నేపథ్యం ఉందని డాక్టర్ నాగరాజు వివరించారు. 1951 సెప్టెంబర్ 8న వరల్డ్ కాన్ఫడరేషన్ ఫర్ ఫిసికల్ థెరపీ స్థాపించబడింది. అదే రోజున డబ్ల్యూ సి పి టీ యొక్క మొదటి సాధారణ సమావేశం కూడా నిర్వహించబడింది. ఈ చారిత్రక రోజును గుర్తుచేసుకుంటూ 1996లో డబ్ల్యూ సి పి టి సెప్టెంబర్ 8ను వరల్డ్ ఫిసికల్ థెరపీ డే గా నిర్ణయించింది. ప్రస్తుతం డబ్ల్యూ సి పి టి పేరు వరల్డ్ ఫిజిఓథెరపీ గా కొనసాగుతోందని తెలిపారు.

ప్రపంచవ్యాప్తంగా ప్రజల ఆరోగ్యం, కదలిక సామర్థ్యం మరియు జీవన నాణ్యతను మెరుగుపరచడంలో ఫిజియోథెరపీ కీలక పాత్ర పోషిస్తోందని డాక్టర్ నాగరాజు అన్నారు. స్ట్రోక్, పార్కిన్సన్స్, బెల్స్ పాల్సీ, ఆర్థోపెడిక్ సమస్యలు, కీళ్ల సమస్యలు, స్పోర్ట్స్ గాయాలు, శస్త్రచికిత్స అనంతర పునరావాసం, పిల్లల నాడీ సంబంధిత సమస్యలు తదితర అనేక పరిస్థితుల్లో ఫిజియోథెరపీ సేవలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు

తెలంగాణలో కూడా ఫిజియోథెరపీ రంగాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని డాక్టర్ కందుల నాగరాజు పేర్కొన్నారు. తెలంగాణ అమరవీరుడు మరియు ఫిజియోథెరపిస్టు కాసోజు శ్రీకాంత్ చారి పేరుతో ఫిజియోథెరపీ రంగంలో పరిశోధనలకు ప్రోత్సాహం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఖాళీగా ఉన్న ఫిజియోథెరపిస్టు పోస్టులను భర్తీ చేసి, రెగ్యులర్ రిక్రూట్‌మెంట్ చేపట్టాలని, ఫిజియోథెరపీకి ప్రత్యేక డిపార్ట్‌మెంట్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు

ప్రజలకు నాణ్యమైన ఫిజియోథెరపీ సేవలు అందించడంతో పాటు రాష్ట్రంలోని ఫిజియోథెరపిస్టుల హక్కులు, వృత్తిపరమైన గౌరవం మరియు ఉద్యోగ భద్రత కోసం తెలంగాణ ఫిజియోథెరపిస్ట్స్ యూనియన్ నిరంతరం కృషి చేస్తుందని ఆయన తెలిపారు. ఫిజియోథెరపీ రంగం మరింత అభివృద్ధి చెంది, తెలంగాణ దేశంలోనే ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు

ఈ కార్యక్రమంలో మానుకోట శాఖకు చెందిన సీనియర్ ఫిజియోథెరపిస్టులు డాక్టర్ విజయకుమార్, డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ రమేష్, డాక్టర్ గణేష్, డాక్టర్ వెంకన్న, డాక్టర్ రాజా, డాక్టర్ శ్రీవిద్య తదితరులు పాల్గొన్నారు

ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవం సందర్భంగా ప్రజలకు ఆరోగ్యం, కదలిక మరియు మెరుగైన జీవన నాణ్యత కోసం ఫిజియోథెరపీ సేవలను మరింత విస్తరించాలనే సందేశాన్ని ఈ కార్యక్రమం అందించింది.

# దేవరకొండలో ఘనంగా ప్రజా వికాస ర్యాలీ

రుణ ప్రభ ,దేవరకొండ డివిజన్, సెప్టెంబర్ 8 ,రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వము వెయ్యి రోజుల ప్రజా పాలన పూర్తిచేసిన సందర్భంగా నల్లగొండ జిల్లా దేవరకొండ పట్టణంలో మంగళవారం ప్రజా వికాస్ ర్యాలీ భారీ ఎత్తున నిర్వహించబడినది.నియోజకవర్గ పరిధిలోని ఎనిమిది మండలాల నుంచి 5వేల బైకులు ,11,000 మందికి పైగా నాయకులు, కార్యకర్తలు, యువ నాయకులు ,మహిళలు పాల్గొన్నారు .దేవరకొండ పట్టణంలో కనిపించిన ఈ జనసంద్రం కాంగ్రెస్ ప్రజా పాలనకు ప్రజలే ఇచ్చిన మద్దతుగా నిదర్శనం.ఈ కేవలం బైకు ర్యాలీ కాదు వెయ్యి రోజుల పాలనలో చేసిన అభివృద్ధికి ప్రజల ముందుంచిన అభివృద్ధి నివేదిక అని ఎమ్మెల్యే అన్నారు .రైతు సంక్షేమానికి పెద్ద పీట వేస్తూ దేవరకొండ నియోజకవర్గం లో రూపాయిలు 369 కోట్ల రైతు రుణమాఫీ జరిగిందని గుర్తు చేశారు. రూ 500 బోనస్ అందించాలని తెలియజేశారు.ఎస్ ఎల్ బి సి ,డిండి లిఫ్ట్ ఇరిగేషన్ పనులను వేగవంతం చేసే చివరి ఎకరాకు సాగునీరు అందించడమే లక్ష్యం అన్నారు.నియోజకవర్గంలో 15 వేల కొత్త రేషన్ కార్డు అందించామని ,ప్రతి యూనిట్కు నెలకు 6 కిలోల సన్నబియ్యం ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు.నియోజకవర్గ మూడు వేలకు పైగా ఇందిరమ్మ ఇండ్లు పూర్తయి గృహప్రవేశాలకు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు.మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నామని, దేవరకొండ డిపో పరిధిలో ఇప్పటివరకు 156 కోట్లు ప్రభుత్వం ఆర్టీసీకి చెల్లించింది అని తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పున్న శైలజ వెంకటేశ్వర్లు, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నరసింహ, నేనావత్ అభినయ



నాయక్, డాక్టర్ వేణుధర్ రెడ్డి, లోకసాని శ్రీధర్ రెడ్డి, దొంతినేని వెంకటేశ్వరరావు, కిన్నెర హరికృష్ణ ,రామ్ సింగ్ నాయక్, ముత్యాల శశిధర్ రెడ్డి వివిధ మండలాల పార్టీ అధ్యక్షులు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు, సర్పంచులు, మాజీ జడ్పీటీసీలు మాజీ ఎంపీటీసీలు, మహిళా కాంగ్రెస్ ప్రతినిధులు యువజన కాంగ్రెస్ సభ్యులు ,కాంగ్రెస్ పార్టీ సభ్యులు, పార్టీ శ్రేణులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల విద్యార్థులు, జిల్లా స్థాయి నుంచి ప్రాతినిధ్యం వహించిన క్రీడాకారులకు ఉచిత శిక్షణ

## క్రీడాకారుల సంక్షేమమే ప్రథమ ప్రాధాన్యం : స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ

## ఫీజుల సవరణపై సమీక్షకు కమిటీ ఏర్పాటు

హైదరాబాద్, సెప్టెంబర్ 8: క్రీడా శిక్షణ ఫీజుల సవరణపై కొందరు చేస్తున్న ప్రచారం పూర్తి వాస్తవాలను ప్రతిబింబించడం లేదని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (శాట్స్) స్పష్టం చేసింది. క్రీడా శిక్షణను ప్రజలకు మరింత అందుబాటులో ఉంచడమే ప్రభుత్వ లక్ష్యమని, ప్రభుత్వ మరియు ఎయిడెడ్ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులతో పాటు జిల్లా స్థాయి మరియు అంతకంటే ఉన్నత స్థాయిలో ప్రాతినిధ్యం వహించిన ప్రతిభావంతులైన క్రీడాకారులకు ఉచిత శిక్షణ కొనసాగుతుందని తెలిపింది. కొత్త ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం శిక్షణ పొందుతున్న వారిలో 42 శాతానికి పైగా మందికి ఉచిత కోచింగ్, క్రీడా సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని పేర్కొంది. 14 సంవత్సరాల అనంతరం క్రీడా శిక్షణ ఫీజులను సవరించినట్లు అథారిటీ వివరించింది. క్రీడా మౌలిక వసతుల నిర్వహణ, స్టేడియాలు, మైదానాల సంరక్షణ, క్రీడా పరికరాల కొనుగోలు, కోచ్‌ల పారితోషికాలు, విద్యుత్, భద్రతా సేవలు తదితర వ్యయాలు గణనీయంగా పెరిగిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. అంతేకాకుండా గత ఉత్తర్వుల్లో లేని విధంగా విద్యార్థుల ఆర్థిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని ఉచిత శిక్షణ కల్పించే అవకాశాన్ని కొత్త విధానంలో ప్రవేశపెట్టినట్లు వెల్లడించింది.

**ఫీజుల హేతుబద్ధీకరణకు కమిటీ**

క్రీడాకారులు, తల్లిదండ్రుల నుంచి వచ్చిన సూచనలు, అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని సవరించిన ఫీజుల నిర్మాణాన్ని సమగ్రంగా పరిశీలించి అవసరమైన హేతుబద్ధీకరణకు సిఫార్సులు చేయడానికి కమిటీని ఏర్పాటు చేయాలని సూత్రప్రాయంగా నిర్ణయించినట్లు స్పోర్ట్స్ అథారిటీ తెలిపింది. సోమవారం ఎల్‌బీ స్టేడియంలో స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శ్రీ కె. శివసేనారెడ్డి, వైస్ ఛైర్‌పర్సన్ ఉ మేనేజింగ్ డైరెక్టర్ డా. ఎ. సోనిబాలా దేవి ఆధ్వర్యంలో హైదరాబాద్ పరిధిలోని స్టేడియాల నిర్వాహకులు, కోచ్‌లు, డిప్యూటీ డైరెక్టర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఏ ఆర్థిక ఇబ్బందులూ క్రీడా ప్రతిభకు అడ్డంకిగా మారకూడదని ఈ సందర్భంగా ఛైర్మన్ శ్రీ కె. శివసేనారెడ్డి పేర్కొన్నారు. క్రీడాకారుల సంక్షేమమే స్పోర్ట్స్ అథారిటీకి అత్యున్నత ప్రాధాన్యమని, సమాజంలోని అన్ని వర్గాలకు క్రీడా శిక్షణ అందుబాటులో ఉండేలా చూడడమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రభుత్వ, ఎయిడెడ్ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులకు పూర్తిగా ఉచిత కోచింగ్ అందిస్తామని ఆయన తెలిపారు. వార్షిక ట్యూషన్ ఫీజు రూ.35 వేల వరకు ఉన్న ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు కూడా ఉచిత శిక్షణకు అర్హులవుతారని చెప్పారు. అలాగే గుర్తింపు పొందిన పోటీలలో జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయి మరియు అంతకంటే ఉన్నత స్థాయిలో ప్రాతినిధ్యం వహించిన క్రీడాకారులకు సంబంధిత క్యాలెండర్ సంవత్సరంలో తమ క్రీడా విభాగాల్లో ఉచిత శిక్షణ, ప్రాక్టీస్ సదుపాయాలు కొనసాగుతాయని వివరించారు. సవరించిన ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం స్పోర్ట్స్ అథారిటీ కేంద్రాల్లో శిక్షణ పొందుతున్న గణనీయమైన సంఖ్యలో క్రీడాకారులు ఇప్పటికే ఉచిత కోచింగ్‌కు అర్హులవుతున్నారని ఛైర్మన్ తెలిపారు. కేవీబీఆర్ ఇండోర్ స్టేడియంలో 10 క్రీడా విభాగాల్లో శిక్షణ పొందుతున్న వారిలో 57 శాతం మందికి, జింఖానా మైదానంలో 65 శాతం మందికి, హుస్సేన్ సాగర్ వాటర్ స్పోర్ట్స్ ట్రైనింగ్ సెంటర్‌లో 88 శాతం మందికి ఉచిత కోచింగ్ అందనుంది. కయాకింగ్, కానోయింగ్ విభాగాల్లో శిక్షణ పొందుతున్న వారందరికీ (100 శాతం) ఉచిత శిక్షణ లభించనుంది. ఉస్మానియా యూనివర్సిటీ సైక్లింగ్ వెలోడ్రోమ్‌లో 57 శాతం మంది, ఎల్‌బీ స్టేడియంలో 42 శాతం మంది, జీఎంసీ బాలయోగి స్టేడియంలో 35 శాతం మంది ఉచిత కోచింగ్‌కు అర్హులవుతారని తెలిపారు. ఈ గణాంకాలే క్రీడా శిక్షణను పెద్ద ఎత్తున ప్రజలకు అందుబాటులో ఉంచాలనే స్పోర్ట్స్ అథారిటీ సంకల్పాన్ని ప్రతిబింబిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు.

**లాభాపేక్ష కాదు.. క్రీడాభివృద్ధే లక్ష్యం**

స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ లాభాపేక్షలేని ప్రజాసేవా సంస్థ అని, క్రీడల అభివృద్ధి, ప్రతిభావంతుల గుర్తింపు, నాణ్యమైన శిక్షణ, క్రీడాకారుల సంక్షేమం, మౌలిక సదుపాయాల బలోపేతమే తమ లక్ష్యమని శ్రీ శివసేనారెడ్డి తెలిపారు. హైదరాబాద్‌తో పాటు జిల్లా కేంద్రాలు, ఇతర పట్టణాల్లో నిర్వహిస్తున్న కోచింగ్ కార్యక్రమాలు, వేసవి శిక్షణ శిబిరాలు, ప్రతిభా అన్వేషణ కార్యక్రమాల ద్వారా ప్రతి సంవత్సరం వేలాది మంది యువ క్రీడాకారులకు శిక్షణ అవకాశాలు కల్పిస్తున్నామని చెప్పారు. తెలంగాణ యువతకు మరింత విస్తృత స్థాయిలో క్రీడా అవకాశాలు కల్పించడం, ప్రతిభను ప్రోత్సహించడం, రాష్ట్రంలో బలమైన క్రీడా వ్యవస్థను నిర్మించడమే స్పోర్ట్స్ అథారిటీ ప్రతి నిర్ణయానికి మూల సూత్రమని ఆయన స్పష్టం చేశారు.

# సమాజంలో విద్వేషాలను రెచ్చ గొడుతున్న ఎమ్మెల్సీ తీన్మార్

## రెడ్డి సామాజిక వర్గం, ఓసీలపై చేసిన వ్యాఖ్యలకు బహిరంగ క్షమాపణ చెప్పాలి

## రెడ్డి ఐక్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంధి తిరుపతి రెడ్డి



కరీంనగర్, సెప్టెంబర్ 8:( అరుణ ప్రభ ప్రతినిధి) సమాజం లో కులాల మధ్య కుంపట్లు పెట్టే విధంగా ఎమ్మెల్సీ చింతపండు నవీన్ ఏతీన్మార్ మల్లన్న, రెడ్డి సామాజిక వర్గం, ఓసీలను ఉద్దేశించి చేసిన అభ్యంతరకర వ్యాఖ్యలను తీన్మార్ మల్లన్న వెంటనే ఉపసంహరించుకొని బహిరంగ క్షమాపణ చెప్పాలని రెడ్డి ఐక్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంధి తిరుపతి రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం కరీంనగర్ జిల్లా కేంద్రంలో రెడ్డి ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు వంచ సుదర్శన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథులుగా పాల్గొని సంధి తిరుపతి రెడ్డి మాట్లాడుతూ ఎవరైనా వ్యక్తి తప్పు చేస్తే ఆ వ్యక్తినే ప్రశ్నించాలి తప్ప, మొత్తం కులాన్ని లేదా సామాజిక వర్గాన్ని లక్ష్యంగా చేసుకొని వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదన్నారు. ఇకపై ఏ సామాజిక వర్గం మనోభావాలు దెబ్బతినేలా వ్యాఖ్యలు చేయకుండా సంయమనం పాటించాలని కోరారు. “తెలంగాణలో అన్ని కులాలు, వర్గాల ప్రజలతో అన్నదమ్ములు, అక్కాచెల్లెళ్లలా కలిసిమెలిసి జీవించాలన్నదే మా ఆకాంక్ష. మన మధ్య తరతరాలుగా ఉన్న సోదరభావం, పరస్పర గౌరవాన్ని కాపాడుకుందాం. వ్యక్తులపై విమర్శలను వ్యక్తులకే పరిమితం చేయాలి” అని సంధి తిరుపతి రెడ్డి పేర్కొన్నారు. తీన్మార్ మల్లన్న తన వ్యాఖ్యలను ఉపసంహరించుకొని బహిరంగ క్షమాపణ చెప్పాలని, భవిష్యత్తులో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని రెడ్డి ఐక్య వేదిక స్పష్టం చేసింది. ఈ సమావేశంలో రెడ్డి ఐక్య వేదిక రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బండ గోపాల్ రెడ్డి, మీడియా సెల్ కన్వీనర్ జాలి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా నాయకులు కాంతల సత్యనారాయణ రెడ్డి, గోగురు బాపు రెడ్డి, చింతల శ్రీనివాస్ రెడ్డి, ధ్యవ భాస్కర్ రెడ్డి, రావుల కిరణ్ రెడ్డి, పటేల్ శ్రీనివాస్ రెడ్డి, పటేల్ సుధీర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

# మానవత్వం చాటుకున్న పాలకవర్గం

## అంత్యక్రియలకు పూర్తి ఖర్చులు భరించిన గ్రామ పాలకవర్గం

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 8 (అరుణప్రభ న్యూస్): మానవత్వాన్ని చాటుకుంటూ రాచర్ల గొల్లపల్లి గ్రామ పాలకవర్గం నిరుపేద కుటుంబానికి అండగా నిలిచింది. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లి గ్రామానికి చెందిన జనగామ సతీష్ ( ) సుమారు 15 రోజుల క్రితం పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. తీవ్ర గాయాలతో వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయన మంగళవారం మృతి చెందాడు. సతీష్ మృతితో కుటుంబం విషాదంలో మునిగిపోయింది. అంత్యక్రియలు నిర్వహించేందుకు కుటుంబ సభ్యుల వద్ద కనీస ఆర్థిక స్తోమత కూడా లేకపోవడంతో విషయం తెలుసుకున్న గ్రామ పాలకవర్గం స్పందించింది. కుటుంబానికి అండగా నిలిచి, అంత్యక్రియలకు సంబంధించిన పూర్తి ఖర్చులను తామే భరిస్తూ, దగ్గరుండి అంత్యక్రియల కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొండ రమేష్ గౌడ్, ఉప సర్పంచ్ పొన్నాల మానెమ్మ, వార్డు సభ్యులు గాంతుల సతీష్, పొన్నాల వెంకటేష్ రెడ్డి, కొండ సాయి, దాసరపు అశోక్, అందె సామ్యూల్తో పాటు గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. కుటుంబ



సభ్యులకు అవసరమైన సహాయాన్ని అందిస్తూ పాలకవర్గ సభ్యులు మానవత్వాన్ని చాటుకున్నారు. మృతుడు సతీష్‌కు భార్య మమత, పిల్లలు విఘ్నేష్, పావనిశ్రీ ఉన్నారు. కుటుంబ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే స్పందించి, బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని సర్పంచ్ కొండ రమేష్ గౌడ్‌తో పాటు గ్రామ పాలకవర్గ సభ్యులు కోరారు.

# స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలా? దళిత సమాజానికి క్షమాపణ చెప్పాలి

**స్పీకర్‌ను అవమానిస్తే ఊరుకోం..**
**బీఆర్ఎస్ నేతల వైఖరి సిగ్గుచేటు**
**బీఆర్ఎస్ తీరుపై కాంగ్రెస్ ధ్వజం..**
**దళితుల ఆత్మగౌరవాన్ని కించపరిస్తే సహించం**
**తాతా మధుపై చర్యలు తీసుకోవాలి..**
**తూంకుంట నర్సారెడ్డి, అంక్షా రెడ్డి**
**ఫామ్‌హౌస్ నుంచి బయటకు రండి..**
**ప్రజా సమస్యలపై దృష్టి పెట్టండి**







గజ్వేల్: అసెంబ్లీ వద్ద నిన్న జరిగిన ఘటనపై కాంగ్రెస్ పార్టీ నేతలు తీవ్రంగా స్పందించారు. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ అనుచిత వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు తూంకుంట అంక్షా రెడ్డి పేర్కొన్నారు. కేసీఆర్ ఆదేశాలతోనే తాతా మధుసూదన్ స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారని వారు ఆరోపించారు. తాతా మధుసూదన్ శాసనమండలి సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. స్పీకర్‌పై చేసిన వ్యాఖ్యలకు బాధ్యత వహిస్తూ కేసీఆర్ దళిత సమాజానికి బహిరంగంగా క్షమాపణ చెప్పాలని కోరారు. ప్రజా ప్రతినిధులు, సమాజానికి రక్షణ కల్పించే పోలీసులపైనే బీఆర్ఎస్ నేతలు దాడులకు పాల్పడుతున్నారని వారు విమర్శించారు. అసెంబ్లీ వద్ద చోటుచేసుకున్న ఘటన సభ్య సమాజం తలదించుకునేలా ఉందన్నారు. దళితులు, మహిళల పట్ల బీఆర్ఎస్ నేతల వైఖరి సిగ్గుచేటని ఆరోపించారు. మహిళా పోలీసుల సమక్షంలో చొక్కాలు విప్పి నిరసన వ్యక్తం చేయడం వారి వైఖరిని, సంస్కృతిని బహిర్గతం చేస్తోందని విమర్శించారు. తప్పును అంగీకరించకుండా బీఆర్ఎస్ నేతలు మరింత రెచ్చగొట్టే విధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించిన కాంగ్రెస్ నేతలు.. స్పీకర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలతో దళిత సమాజంలో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోందని అన్నారు. కేసీఆర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ ఫామ్‌హౌస్ వద్ద కాంగ్రెస్ శ్రేణులు డప్పు మోతలతో నిరసన చేపట్టినట్లు తెలిపారు. ఇప్పటికైనా కేసీఆర్ ఫామ్‌హౌస్ నుంచి బయటకు వచ్చి ప్రజా సమస్యలను పరిష్కరించడంతో పాటు అసెంబ్లీకి హాజరు కావాలని తూంకుంట నర్సారెడ్డి, అంక్షా రెడ్డి డిమాండ్ చేశారు.

# నర్సారెడ్డికి అండగా కాంగ్రెస్ .. నిమ్స్‌లో పరామర్శ

**ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో ఆరా..**
**మెరుగైన వైద్యం అందించాలని సూచన**



హైదరాబాద్: ఎర్రవల్లి ఫామ్‌హౌస్ వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో చోటుచేసుకున్న తోపులాటలో తీవ్రంగా గాయపడి నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గజ్వేల్ మాజీ



ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డిని పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ పరామర్శించారు. ఈ సందర్భంగా నర్సారెడ్డి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు వారికి వివరించారు. నర్సారెడ్డికి మెరుగైన వైద్యం అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని వైద్యులను కాంగ్రెస్ నేతలు కోరారు. నర్సారెడ్డి త్వరగా కోలుకోవాలని వారు ఆకాంక్షించారు. ఆయనకు మెరుగైన వైద్యం అందించడంలో ఎలాంటి లోటు లేకుండా చూడాలని వైద్యులకు సూచించారు. కాంగ్రెస్ పార్టీ తూంకుంట నర్సారెడ్డికి అన్ని విధాలా అండగా ఉంటుందని ఈ సందర్భంగా నేతలు తెలిపారు. ఆయన త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు.

# ఇరాన్‌కు అణ్వాయుధం దక్కే ఛాన్సే లేదు: ట్రంప్

ఇరాన్ ఎప్పటికీ అణ్వాయుధాన్ని సాధించలేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి స్పష్టం చేశారు. ఆ దేశం అణ్వస్త్ర తయారీ దిశగా అడుగులు వేయకుండా తాము కఠిన చర్యలు తీసుకున్నామని, ఇప్పటికే ఆంక్షల రూపంలో వారిని కట్టడి చేశామని ఆయన పేర్కొన్నారు. వాషింగ్టన్‌లో మంగళవారం జరిగిన 'స్టీల్ అక్రాస్ అమెరికా' కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ట్రంప్ మాట్లాడుతూ.. "ఒక దేశం అణ్వాయుధాన్ని సాధించాలని భావించి, ఆ లక్ష్యానికి అత్యంత చేరువగా వెళ్లింది. కానీ, ఇప్పుడు ఆ అవకాశం వారికి లేదు. వారికి అణ్వాయుధం ఎప్పటికీ దక్కదు" అని ఇరాన్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఇరాన్‌పై విధించిన ఆంక్షలు అత్యంత శక్తిమంతంగా, సమర్థవంతంగా పనిచేశాయని, ఈ స్థాయిలో విజయం లభిస్తుందని ఎవరూ ఊహించలేదని ఆయన అమెరికా సైన్యాన్ని ప్రశంసించారు. సెప్టెంబర్ 11 ఉగ్రదాడుల 25వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ దాడుల్లో అసువులు బాసిన సుమారు 3 వేల మందిని స్మరించుకుంటూ ట్రంప్ ప్రసంగం సాగింది. ఈ సందర్భంగా వరల్డ్ ట్రేడ్ సెంటర్ సౌత్ టవర్ శిథిలాల నుంచి వెలికితీసిన 16,000 పౌండ్ల ఉక్కు దూలాన్ని ప్రదర్శించారు. ఉగ్రదాడుల సమయంలో ప్రజలను కాపాడే క్రమంలో ప్రాణత్యాగం చేసిన ఫైర్‌ఫైటర్ జెఫ్రీ పలాజో గౌరవార్థం.. కోస్ట్ గార్డ్‌కు చెందిన ఓ నూతన నౌకకు ఆయన పేరు పెట్టనున్నట్లు ట్రంప్ ప్రకటించారు. 'ది మ్యాన్ ఇన్ ది రెడ్ బందానా'గా గుర్తింపు పొందిన వెల్లెస్ క్రౌథర్‌కు మరణానంతరం అమెరికా అత్యున్నత పౌర పురస్కారం 'ప్రెసిడెన్షియల్ మెడల్ ఆఫ్ ఫ్రీడమ్'ను అందజేశారు. ఆయన తరఫున తల్లి అలీసన్ క్రౌథర్ ఈ గౌరవాన్ని స్వీకరించారు.



# భావప్రకటన స్వేచ్ఛను హరిస్తే ఊరుకోం

**టీయుడబ్ల్యూజే ప్రదర్శనలో ముక్తకంఠంతో హెచ్చరించిన జర్నలిస్టులు**

దేశంలో భావప్రకటన స్వేచ్ఛను, ప్రజాస్వామ్యాన్ని, మీడియా స్వేచ్ఛను హరించేందుకు పాలకులు ప్రయత్నిస్తే ప్రజాస్వామికవాదుల నుండి ప్రతిఘటన తప్పదని జర్నలిస్టులు హెచ్చరించారు. ఢిల్లీలో విధినిర్వహణలో ఉన్న మహిళా జర్నలిస్టులపై పోలీసుల దాడి, అక్రమ కేసు, అరెస్టును నిరసిస్తూ మంగళవారం సాయంత్రం తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం(టీయుడబ్ల్యూజే) ఆధ్వర్యంలో జర్నలిస్టులు, ప్రజాస్వామికవాదులు కొవ్వొత్తులతో రాష్ట్ర రాజధాని హైదరాబాద్ లో నిరసన ప్రదర్శన నిర్వహించారు. బషీర్ బాగ్ లోని టీయుడబ్ల్యూజే కార్యాలయం నుండి ప్రారంభమైన ఈ నిరసన ప్రదర్శన, నిజాంకాలేజీ మీదుగా జగజీవన్ రాం విగ్రహం వరకు కొనసాగింది. అనంతరం టీయుడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు కె. విరాహత్ అలీ అధ్యక్షతన జరిగిన సభలో పలువురు సీనియర్ పాత్రికేయులు, ప్రజాస్వామికవాదులు ప్రసంగించారు. ప్రజాస్వామిక ఈ దేశంలో పౌరులకు రాజ్యాంగం కల్పించిన హక్కులను, స్వేచ్ఛను ఖునీ చేస్తూ, తమకు అనుకూలమైన విధానాలను ఎన్డియే ప్రభుత్వం అవలంబించడం అప్రజాస్వామికమని సీనియర్ పాత్రికేయులు, ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ మాజీ అధ్యక్షులు దేవులపల్లి అమర్ ఆందోళన వ్యక్తం చేసారు. ఐదు రోజుల క్రితం ఢిల్లీలో విధినిర్వహణ లో ఉన్న మైనారిటీ సామాజిక వర్గానికి చెందిన మహిళా జర్నలిస్టులు షాహిన్ ఖాన్, నఫీజా ఖాన్ లపై పోలీసులు దాడి చేయడం, వారిని అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యంలో మీడియా స్వేచ్ఛను, జర్నలిస్టుల హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని ఈ సభలో పాల్గొన్న పలువురు సూచించారు. జర్నలిస్టులపై దాడులు, బెదిరింపులు, అక్రమ అరెస్టులకు పాల్పడటం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని వారు అన్నారు. మహిళా జర్నలిస్టులకు న్యాయం చేయడంతో పాటు, ఘటనకు బాధ్యులైన పోలీసులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ ప్రదర్శనలో ఐజేయు స్టీరింగ్ కమిటీ సభ్యులు ఎం.ఏ. మాజీద్, జాతీయ కార్యదర్శి వై. నరేందర్ రెడ్డి, జాతీయ కార్యవర్గ సభ్యులు కల్లూరి సత్యనారాయణ, కె. అజిత, హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షురాలు అత్తలూరి అరుణ, టీయుడబ్ల్యూజే మహిళా జర్నలిస్ట్స్ విభాగం కన్వీనర్ రాజేశ్వరీ, ప్రగతిశీల మహిళా సంఘం నాయకురాలు సంధ్య, సీనియర్ పాత్రికేయులు వనజ, స్వప్న, విమల, టీయుడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏ. రాజేష్, బి. కిరణ్ కుమార్, హెచ్.యు.జే అధ్యక్షుడు శిగా శంకర్ గౌడ్, తెలంగాణ చిన్న, మధ్యతరగతి పత్రికల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యూసుఫ్ బాబు, అశోక్, ఫోటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.ఎన్.హరి, తెలంగాణ ఉర్దూ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి గౌస్ మోహియొద్దీన్ లతో పాటు పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.



# వాల్మీకి బోయల ఎస్టీ హోదాకు కృషి

ధర్మవరం, సెప్టెంబర్ 08; (అరుణ ప్రభ న్యూస్) : వాల్మీకి బోయల ఎస్టీ హోదా పునరుద్ధరణ అంశంపై సామాజిక వర్గ నాయకులు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్‌ను మంగళవారం ఎన్డీఏ కార్యాలయంలో కలిశారు. వాల్మీకి బోయలు బీసీ-ఏ, ఎస్టీ రిజర్వేషన్ల అంశంలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను నాయకులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో తమకు నష్టం జరుగుతోందని వివరించారు. ఎస్టీ హోదా పునరుద్ధరణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి సమస్యను తీసుకెళ్లాలని కోరారు. మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పందిస్తూ వాల్మీకి బోయల సమస్యను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. అవసరమైతే కేంద్ర ప్రభుత్వ పెద్దలతోనూ చర్చించి సమస్య పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వాల్మీకి సామాజిక వర్గ రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

## గాదె సాయికృష్ణ కేసు: ఇద్దరు నిందితుల కస్టడీకి సిట్ పిటిషన్

**విజయవాడ సాయికృష్ణ అదృశ్యం కేసులో కీలక పరిణామం**
**ఏ-2 అశోక్, ఏ-7 వెంకటరాజును రెండు రోజులు విచారించేందుకు అనుమతి కోరిన సిట్**
**మాజీ సీఐ నాగరాజు వాంగ్మూలం ఆధారంగా మరిన్ని ఆధారాల సేకరణే లక్ష్యం**
**కౌంటర్ దాఖలు చేయాలని నిందితుల తరపు న్యాయవాదులకు కోర్టు ఆదేశం**

రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన గాదె సాయికృష్ణ అదృశ్యం కేసు దర్యాప్తు మరో కీలక దశకు చేరుకుంది. ఈ వ్యవహారంలో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) తాజాగా న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. కేసులో ప్రధాన నిందితులుగా ఉన్న ఇద్దరిని తమ కస్టడీకి ఇవ్వాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేసింది. కేసులో ఏ-2 నిందితుడు అశోక్ కుమార్, ఏ-7 నిందితుడు వెంకటరాజులను రెండు రోజుల పాటు తమ కస్టడీకి అప్పగించాలని సిట్ అధికారులు కోరారు. ఈ కేసులో గతంలో మాజీ సీఐ నాగరాజు ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా మరిన్ని వాస్తవాలను రాబట్టేందుకు, లోతైన విచారణ జరిపేందుకు వీరి కస్టడీ అవసరమని అధికారులు పేర్కొన్నారు. నిందితుల నుంచి మరిన్ని కీలక ఆధారాలు సేకరించాల్సి ఉందని పిటిషన్‌లో వివరించారు. సిట్ దాఖలు చేసిన పిటిషన్‌పై స్పందించిన న్యాయస్థానం, దీనిపై కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని నిందితుల తరపు న్యాయవాదులను ఆదేశించింది. ఇరుపక్షాల వాదనలు విన్న అనంతరం, నిందితులను కస్టడీకి అప్పగించే అంశంపై కోర్టు తుది నిర్ణయం తీసుకోనుంది.

CORPORATE OFFICE:SNEHALA MEDIA PUBLICATIONS LLP, PLOT NO. 267,HUDA SAI NAGAR COLONY, BESIDE COMMUNITY HALL, VANASTHALIPURAM, RR DIST, HYDERABAD 500070.TG. CELL. 9348313999/8885727777.

Edited, Printed, Published & Owned By GURRAM PAPI REDDY,# H.No.4-57, Thorrur Village, Abdullapurmet Mandal, Turkayamal Municipality, Ranga reddy District.501511. Telangana. Printedat:GARUDA PRINT- ERS,# H.No.2-86/1, PlotNo.23-SP, SyNo.417, Sagar Highway, Rangannaguda Village, Abdullapurmet Mandal, Turkayamjal Municipality, Ranga reddy District.501510.Telangana.Published at: # H.No.4-57, Thorrur Village,Abdullapurmet Mandal, TurkayamalMunicipality, Ranga reddy District. 501511. Telangana...www.arunaprabha.com..email.arunaprabhadaily@gmail.com, RNI NO. TELTEL/2023/89778, Cell No. 9700127889